# మోడీతో పాక్‌కు తీవ్ర నష్టం

**భారత్‌పై యుద్ధం మినహా మరోదారి లేదు**

**పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ప్రేలాపన**

లాహోర్ : నరేంద్ర మోదీ సారథ్యంలోని భారత ప్రభుత్వ చర్యలు పాక్‌కు చాలా నష్టం కలిగించాయి. ఈ చర్యలకు మనమంతా ఐకమత్యంగా ఎదురొడ్డి నిలవాలని పాకిస్థాన్‌కు చెందిన మాజీమంత్రి బిలావల్ భుట్టో అన్నారు.





# Crime News ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

బుధవారం, ఆగస్టు 13, 2025 | సంపుటి - 20 | సంచిక 313 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## మధ్య బంగాళాఖాంతంలో ఉపరితల ఆవర్తనం

తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

విశాఖపట్టణం : మధ్య బంగాళాఖాంతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. బుధవారం నాటికి ఇది అల్ప పీడనంగా బలపడే అవకాశం ఉంది. ఆరు రోజులపాటు- ఏపీకి విస్తారంగా వానలు కురిసే అవకాశం ఉంది.. నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది..

# తెలంగాణలో భారీ వర్షాలు

ఉరుములు,మెరుపులతో వానలు పడతాయ్

ప్రజలు అసవరమైతే తప్ప బయటకు రావద్దు

ప్రయాణాలు వాయిదా వేసుకోవాలన్న వాతావరణ శాఖ

భారీగా నీటి చేరికతో సాగర్ 16 క్రస్ట్ గేట్లుఎత్తి నీటి విడుదల

నీట మునిగిన వరంగల్ జంటనగరాలు

మత్తడి పోస్తున్న పలు గ్రామాల చెరువులు

పొంగి ప్రవహిస్తున్న ఆకేరు వాగు



## భారీ వర్ష సూచనతో అప్రమత్తం

### ఉద్యోగులకు మూడురోజుల పాటు సెలవులు రద్దు



**72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**

**కరెంట్, మంచినీటి ఇబ్బంది రాకుండా చర్యలు**

**అధికారులు, కలెక్టర్లతో సిఎం రేవంత్ సమీక్ష**

హైదరాబాద్ :

తెలంగాణలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అధికారులు, జిల్లా కలెక్టర్లు, మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మూడు రోజుల పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు


మిగతా 2లో




## మంత్రి పదవిపై మరోమారు రాజగోపాల్ కస్సుబుస్సు

ఇద్దరం అన్నదమ్ములం సమర్థులమే అని వ్యాఖ్య

ఖమ్మంకు లేని నిబంధన నల్లగొండకే ఎందుకో

నల్గొండ : మంత్రి పదవి విషయంలో తనకుకావాలనే అన్యాయం చేయడంపై మరోమారు కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజ గోపాల్ రెడ్డి పార్టీనేతల తీరుపై విమర్శలు గుప్పించారు. కేబినేట్‌లో ఇద్దరు అన్నదమ్ములకు పదవులు ఇవ్వడం సాధ్యం కాదని చెబుతున్నవారు, పార్టీలో ఇద్దరు ఉన్నారని ముందు తెలియదా అని కూడా ప్రశ్నించారు.


2లో


## నిరాధార ఆరోపణలతో ప్రతిష్టకు భంగం

బండి సంజయ్‌కు కెటిఆర్ లీగల్ నోటీస్ జారీ




హైదరాబాద్,ఆగస్ట్1 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కల్వకుంట్ల తారక రామారావు మంగళవారం లీగల్ నోటీసులు పంపించారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని కేటీఆర్ లీగల్ నోటీసులో పేర్కొన్నారు.

## రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

వనరులను సద్వినియోగం చేసేలా ప్రణాళికలు

అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సౌకర్యాలు

అటవీశాఖపై సమీక్షలో సిఎం రేవంత్ సూచనలు



## తిక్క రేగిందంటే బ్రహ్మోస్‌తో అంతుచూస్తాం

పాక్ ప్రేలాపనలపై మండిపడ్డ మిథున్

బిలావల్ భుట్టో వ్యాఖ్యలపై ఆగ్రహం



కోల్‌కతా : భారత్‌తో యుద్ధం రావొచ్చంటూ పిచ్చి ప్రేలాపనలు చేసిన పాక్ నేత బిలావల్ భుట్టోపై బీజేపీ నేత మిథున్ చక్రవర్తి మండిపడ్డారు. తిక్కరేగిందంటే మిసైళ్ల వర్షం కురిపిస్తామని హెచ్చరించారు.ఇలాంటి వ్యాఖ్యలకు మాకు తిక్క రేగిందంటే వరుస పెట్టి బ్రహ్మోస్ క్షిపణులను ప్రయోగిస్తామని అంటూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారత డ్యాములు కూల్చేస్తామంటూ పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ చేసిన వ్యాఖ్యలపై కూడా మిథున్ చక్రవర్తి తనదైన శైలిలో ఘాటు- వ్యాఖ్యలు చేశారు. 140 కోట్ల మంది మూత్ర విసర్జన కోసం డ్యామ్ కట్టే ఆలోచనలో ఉన్నాము. ఆ తరువాత డ్యామ్ గేట్లు- తెరిస్తే భారీ సునామీ వస్తుంది. ఇదంతా బిలావల్‌ను ఉద్దేశించి అన్నాను.


2లో


## సిబిఐకి న్యాయవాద దంపతుల హత్య కేసు

స్వాగతించిన మంత్రి శ్రీధర్ బాబు




హైదరాబాద్ : న్యాయవాదులు గట్టు- వామనరావు దంపతుల హత్యకేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఓ కార్యక్రమానికి హాజరైన మంత్రి.. ఈ విషయంపై మాట్లాడారు.

## ఆత్మకూరులో అత్యాధునిక స్పోర్ట్స్ మైదానం



**స్థల పరిశీలన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి**

మహబూబ్‌నగర్ : ఆత్మకూర్ మున్సిపాల్టీలలో నూతనంగా నిర్మించనున్న క్రీడా మైదానాలకు రాష్ట్ర స్పోర్ట్ అథారిటి చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి స్థల పరిశీలన చేశారు. ఆత్మకూర్ మున్సిపాల్టీ పరిదిలో జాతర మైదానం పక్కన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఒక


మిగతా 2లో


## రేవంత్‌రెడ్డికి సవాల్‌గా జూబ్లీహిల్స్

బిసి రిజర్వేషన్లతో పాటు...స్థానిక ఎన్నికలు

గెలుపు కోసం బిఆర్ఎస్, బిజెపిల వ్యూహాలు



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, బిసి రిజర్వేషన్లు, పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్య వంటి సమస్యలు ఇప్పుడు కాంగ్రెస్‌కు సవాల్‌గా మారనున్నాయి. కబుర్లతో కాలక్షేపం చేస్తే ఇవి చుట్టుముట్టుకుంటాయి. సమయం దగ్గర పడుతోంది. వీటిని ఎలా పరిష్కరిస్తారన్నది రేవంత్ సమర్థతపైనే ఆధారపడి ఉంటుంది. దీనికితోడు పార్టీలోఐక్యత అన్నది డొల్లగా మారింది. మంత్రులు ఎవరికి వారు యమునా తీరం అన్న చందంగా ఉంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్ష నటరాజన్ పెత్తనం కూడా ఎక్కువగా కనిపిస్తోంది. సొంతంగా సమీక్షలు, పాదయాత్రలు చేస్తూ ఆమె పార్టీలో రాజకీయేతర శక్తిగా మారుతున్నారు. జూబ్లీహిల్స ఉప ఎన్నికలో గెవడంతో పాటు, బిసి రిజర్వేషన్లకు అనుగుణంగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ద్వారా పార్టీలో బలిమి చాటుకోవడం ద్వారా సిఎం రేవంత్ తన స్థానాన్ని పదిలలం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నిక కాంగ్రెస్ నేతలకన్నా సిఎం రేవంత్‌కు జీవన్మరణ సమస్యగా మారింది.


మిగతా 3లో


## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

సృష్టి ఫర్టిలిటీ కేసు సిట్‌కు అప్పగింత

హైదరాబాద్ : సృష్టి ఫెర్టిలిటీ స్కాం కేసును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. అనేక దందాలు తోడవ్వడంతో దీనిపై లోతైన విచారణ కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.


2లో


## మూడురాష్ట్రాల్లో సెమీ కండక్టర్ ప్రాజక్టుల ఏర్పాటు

**ఎపి,ఒడిషా, పంజాబ్‌లో ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం**

**రూ.4,594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం**

న్యూఢిల్లీ : ఎపిలో సెమీ కండక్టర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్రం ముందుకు వచ్చింది. దేశంలో నాలుగు కొత్త సెమీ కండక్టర్ ప్రాజెక్టులు ఏర్పాటు- చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది.


మిగతా 3లో


## బిఆర్ఎస్ కదనభేరీ సభ వాయిదా



భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు ప్రకటన

త్వరలోనే మళ్లీ సభ నిర్వహణ తేదీ ప్రకటిస్తామన్న గంగుల

కరీంనగర్ : కరీంనగర్ వేదికగా బిఆర్ఎస్ నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను వాయిదా వేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనే ఉద్దేశ్య ంతో బీఆర్ఎస్ పార్టీ కదనభేరి పేరిట నిర్వహించ తలపెట్టిన బీసీ గర్జన సభను మరోసారి వాయిదా వేసింది. భారీ వర్ష సూచన నేపథ్యంలో


మిగతా 2లో

# మోడీతో పాక్‌కు తీవ్ర నష్టం

అధికారంలో లేకపోవడంతో ఖాళీగా ఉన్న ఆయన తన పార్టీని అధికారంలోకి తీసుకునిరావాలంటే భారత్ వ్యతిరేక వైఖరితో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్లుగా ఉంది.గతంలో మోడీపైనా విపరీత వ్యాఖ్యలు చేసిన భిలావల్ తాజాగా సింధు జలాల ఒప్పందం నిలుపుదల ఇలాగే కొనసాగితే భారత్‌పై యుద్ధం మినహా పాక్‌కు మరో ప్రత్యామ్నాయం ఉండకపోవచ్చని వార్నింగ్ ఇచ్చారు. పాక్ ప్రజలు యుద్ధానికి సమర్థులంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. 'మేము యుద్ధం ప్రారంభించ లేదు. కానీ, ఆపరేషన్ సిందూర్ లాంటి దాడులు మళ్లీ చేస్తే పాక్‌లోని అన్ని ప్రావిన్స్‌ల (రాష్ట్రాలు) ప్రజలు మీతో (భారత్) పోరాడేందుకు సిద్ధమే. ఈ యుద్ధంలో భారత్‌కు ఓటమి తప్పదు' అని అన్నారు. పహల్గాం ఉగ్ర దాడి తరువాత భారత్ పాక్‌పై ఆపరేషన్ సిందూర్‌ను ప్రయోగించిన విషయం తెలిసిందే. పాక్‌కు గట్టి బుద్ధి చెప్పేందుకు సింధు నదీ జలాల ఒప్పందం అమలును కూడా నిలిపివేసింది. దీంతో, పాక్‌లో నదీ జలాల కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తప్పును సరిదిద్దుకోవాల్సిన పాక్ నేతలు తమ దేశ ప్రజల్లో భారత్‌పై అకారణ ద్వేషం రగిలించి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు.ఇప్పటికే పాక్ ఆర్మీ చీఫ్ మునీర్.. అణుబాంబు ప్రయోగిస్తామంటూ ఉన్మాదంతో ఊగిపోయారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు- సగం ప్రపంచం అంతమైపోతుందని హెచ్చరించారు. సింధు జలాలను అడ్డుకునేందుకు భారత్ చేపట్టే నిర్మాణాలను కూడా కూల్చేస్తామని అన్నారు. నిర్మాణాలు పూర్తయ్యే వరకూ వేచి చూసి ఆపై ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సింధు జలాలు భారతీయ కుటుంబ ఆస్తి కాదని కామెంట్ చేశారు. ఈ నదీ జలాల ఒప్పందం నిలుపుదలతో 250 మిలియన్‌ల మంది పాకిస్థానీలకు ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. మునీర్ వ్యాఖ్యలకు భారత్ గట్టిగా బదులిచ్చింది. ఈ బాధ్యతారహిత వ్యాఖ్యలను ప్రపంచం అర్థం చేసుకుందని కామెంట్ చేసింది. పాక్‌లో అణ్వాయుధాలకు భద్రత లేదని, అక్కడి మిలిటరీ టెర్రరిస్టులతో కుమ్మక్కయ్యిందని ఈ వ్యాఖ్యలు మరోసారి స్పష్టం చేశాయని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.తాజాగా బిలావల్ భుట్టో వ్యాఖ్యలుకూడా ప్రజలను రెచ్చగొట్టేందుకే అని అర్థం చేసుకోవచ్చు.

# మంత్రి పదవిపై మరోమారు రాజగోపాల్ కస్సుబుస్సు

మంత్రి పదవి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మునుగోడు మండలం ఎలగలగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ గోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తన నియోజకవర్గం మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే తనకు అన్యాయం జరిగినట్లేనని రాజ్ గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తనకు అన్యాయం జరిగితే ఫర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని.. గత ప్రభుత్వానికి చెప్పానని.. ఈ ప్రభుత్వానికి కూడా చెబుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ తనకు మంత్రి పదవి ఇస్తానని మాట ఇచ్చింది, మంత్రి పదవి ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ.. అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దని కోరారు. తనకు మంత్రి పదవి ఇస్తామన్నమాట ఆలస్య మైందని.. సమీకరణాలు కుదరటం లేదని ఇప్పుడు ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. తనకు మంత్రి పదవి ఇవ్వడం ఎందుకు కుదరటం లేదు.. ఆ సమీకరణలు రాకుండా ఎవరడ్డుకుంటున్నారు..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే సమయంలో మంత్రి పదవి ఇస్తాననే తీసుకున్నారని గుర్తుచేశారు. అప్పుడు తాము ఇద్దరం అన్నదమ్ములం కాంగ్రెస్‌లోనే ఉన్నామని తెలియదా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తానని రెండోసారి హామీ ఇచ్చారని.. అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీలో తాము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని గుర్తులేదా అని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రశ్నించారు. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా కొంతమంది నేతల పరిస్థితి ఉందని విమర్శించారు. తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు కదా అని ప్రశ్నించారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటం తప్పా అని నిలదీశారు. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమేనని, ఇద్దరం గట్టి వాళ్లమేనని.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని ప్రశ్నల వర్షం కురిపించారు. మంత్రి పదవి ఇవ్వడానికి ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతానని కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంత్రి పదవి ఇస్తామని మాటిచ్చారు.. ఇచ్చినప్పుడు ఇవ్వండి. ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా? లోక్‌సభ ఎన్నికల్లో రెండోసారి హామీ ఇచ్చినప్పుడు తెలియదా? అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే.. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? ఆలస్యమైనా సరే ఓపిక పడుతున్నా? అని అన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఈ కేసును సిట్‌కు అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంగళవారంఈ కేసుకు సంబంధించిన విషయాలను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. సృష్టి కేసును సీసీఎస్ సిట్‌కి బదిలీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో 25 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారు. సృష్టి కేసులో 8 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వివరించారు. ఓ కేసులో సృష్టి యాజమాన్యం బాధితులకు చనిపోయిన బిడ్డను చూపించారని చెప్పుకొచ్చారు. మరో కేసులో రూ.15 లక్షలు ఎక్కువగా ఇవ్వాలని సృష్టి యాజమాన్యం డిమాండ్ చేసిందని తెలిపారు డీసీపీ రష్మీ పెరుమాళ్.విశాఖపట్నంలో కూడా సరోగసీ పేరుతో మోసం చేశారని డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు. బాధితులకు ఇచ్చిన బేబీ గర్ల్‌కి డీఎన్ఏ టెస్ట్ చేసి సరి పోల్చినప్పుడు ఈ వ్యవహారం బయట పడిందని వెల్లడించారు. ఈ కేసులో చాలామంది డాక్టర్ల ప్రమేయం ఉందని తెలిపారు. విశాఖపట్నంలోని డాక్టర్లు విద్యులత, రవిను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. వైజాగ్‌కి చెందిన డాక్టర్ విద్యులతతో పాటు- డాక్టర్ రవి, డాక్టర్ ఉషను అరెస్ట్ చేశామని వివరించారు. సికింద్రాబాద్‌లో ఉన్న హాస్పిటల్‌ను కేవలం కన్సల్టెన్సీగా మాత్రమే వాడుకున్నారని గుర్తు చేశారు. పేరుతో శాంపిల్స్ తీసుకుంటున్నారని చెప్పారు. మిగతా సరోగసీ ప్రాసెస్ అంతా వైజాగ్‌లో చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 25 మందిని అరెస్ట్ చేశామని వెల్లడించారు డీసీపీ రష్మీ పెరుమాళ్. వీరిలో చాలామంది మహిళలు ఉన్నారని... మహిళా నిందితుల్లో చాలామంది అండాలు అమ్ముకున్న వారు ఉన్నారని, సరోగసీ తల్లులుగా నటించిన వాళ్లు ఉన్నారని తెలిపారు. ఎవరైనా దంపతులు సరోగసీ కోసం అప్రోచ్ అవగానే.. వాళ్లకు కొన్నిరోజుల తర్వాత ఒక ఫేక్ అల్ట్రా స్కాన్ రిపోర్ట్ పంపుతారని చెప్పుకొచ్చారు. సరోగసీ పద్ధతిలో మీకు పుట్టబోయే పాప స్కానింగ్ రిపోర్ట్ అని చెబుతారని అన్నారు. అదే సమయంలో డాక్టర్ నమ్రత ఏజెంట్లు- ఓ గర్భిణిని వెతికి పెడతారని తెలిపారు. 9 నెలల తర్వాత వైజాగ్‌లో డెలివరీ చేసి.. ఆ శిశువును సరోగసీ ద్వారా పుట్టిన పాప అని చెప్పి దంపతులకు అప్పగిస్తారని నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పేర్కొన్నారు.

# త్వరగా డయాఫ్రాం వాల్ పూర్తి: నిమ్మల

అమరావతి : పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. పోలవరం డయాఫ్రంవాల్ మొత్తం పొడవు 1,396 మీటర్లకు గాను 500 మీటర్ల నిర్మాణం పూర్తయిందని, ఇందులో 3 టెంచ్ కట్టర్లు, 3 గ్రాబర్లతో శరవేగంగా డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. స్వయంగా సీఎం విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా పనులు చేపడుతున్నామని, వరద సమయంలో కూడా పనులకు ఆటంకం కాకుండా నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అలాగే ఎగువ కాఫర్ డ్యామ్‌ను బలోపేతం చేసేలా బట్రస్ డ్యామ్ నిర్మాణ పనులు ఇప్పటికే 90 శాతానికి పైగా పూర్తయ్యాయని, మొత్తంగా 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును అందుబాటు-లోకి తీసుకురావడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల వివరించారు.

# తెలంగాణలో భారీ వర్షాలు

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్, అరెంజ్ అలర్టులు జారీ చేసింది. అయితే మరోసారి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ మేరకు ప్రజలందరూ.. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే ఛాన్స్ ఉందని ప్రజలు అనవసరంగా బయటకు రావొద్దని పేర్కొంది. వర్షం పడే సమయంలో చెట్ల కింద కూడా ఉండకూడదని హెచ్చరిస్తుంది. ప్రయాణాలు మానుకోవాలని, లేని పక్షంలో వాయిదా వేసుకోవాలని తెలుపుతుంది. భారీ వర్షాల కారణంగా రోడ్లు, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్లు జలమయం అవుతున్నాయి. కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందస్తు.. చర్యలు చేపడుతుంది. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ.. అధికారులను ప్రజలతో సమన్వయం అయ్యేలా.. చూస్తుంది. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లా ప్రజలు వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్నారు. పొలాల దగ్గరకు వెళ్లాల్సిన రైతుల కూడా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజల దృష్ట్యా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ 7981975495 కు ఫోన్ చేయాలని అధికారులు వెల్లడించారు. ఇకపోతే ఎగువన కురుస్తున్న వర్షాలతో నాగార్జున సాగర్ జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో అధికారులు 16 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టుకు 1,77,173 క్యూసెక్కుల వరద వస్తోంది. స్పిల్‌వే ద్వారా 1,28,768 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రస్తుత నీటి మట్టం 589 అడుగులుగా ఉంది. ఇకపోతే వరంగల్, హనుమకొండ, కాజీపేటలో భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో హనుమకొండ బస్టాండ్, చౌరస్తా, ఇతర లోతట్టు- ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై భారీగా నీరు నిలవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వర్ధన్నపేటలోని ఆకేరువాగు పొంగిపొర్లుతోంది. సంగెం మండలం ఎల్గూరురంగంపేట పెద్దచెరువు, పర్వతగిరి మండలం ఏనుగల్లు ఊరచెరువు మత్తడి పోస్తోంది. ఎల్గూరు స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం- ఎల్గూరు రంగంపేట గ్రామాల మధ్య రైల్వే అండర్ పాసు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో ఆ గ్రామాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామానికి రెండు వైపులా రహదారి దిగ్బంధం కావటంతో ఎల్గూరు రంగంపేట గ్రామం జల దిగ్బంధమైంది. వరదల కారణంగా వర్ధన్నపేట తహశీల్దార్ కార్యాలయం నీట మునిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆముదాల పల్లెలో గండివాగు పంట పొలాల మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. గొల్లబుద్ధారం గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రాంగణం పూర్తిగా జలమయమై, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. గద్దగుంట వాగు పొంగి, భూపాలపల్లి నుంచి రాంపూర్,గొల్లబుద్ధారం మీదుగా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇదిలావుంటే గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో తెలంగాణలోని పలు ప్రాంతాలు తడిసి ముద్దావుతున్నాయి. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక రాష్ట్రంలో బుధవారం అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, సిద్ధిపేట, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ మల్కాజ్‌గిరి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. అందుకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# నిరాధార ఆరోపణలతో ప్రతిష్టకు భంగం

ఈ నెల 8వ తేదీన బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కేటీఆర్ ఈ నోటీసులను పంపించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు నోటీసులో తెలిపారు. బండి సంజయ్ తన హోదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో తన ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా ప్రాపగండ చేస్తున్న బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. బండి సంజయ్ ఆరోపణలతో తన ప్రతిష్టకు భంగం కలిగిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు-తో పాటు- ఆ తర్వాత మంత్రిగా తాను అనేక రంగాల్లో అద్భుతమైన సేవలు అందించానని చెప్పుకొచ్చారు. అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లయింట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతుందని నోటీసులో న్యాయవాదులు పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని, ఒక పార్లమెంటు- సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపైన అసత్య పూరిత అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీ-సులో కేటీ-ఆర్ న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదని, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీ-సులో వెల్లడించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ కేటీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కేటీఆర్ అతని కుటుంబ సభ్యులపై భవిష్యత్తులో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యాఖ్యలు చేయకుండా ఉండాలని నోటీ-సులో కోరారు. నోటీసులు అందిన ఏడు రోజుల్లోగా ఈ డిమాండ్లను పాటించని పక్షంలో, చట్టపరంగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆరోపణలతో కలిగిన నష్టానికి బండి సంజయ్ బాధ్యత వహించాల్సి ఉంటుందని నోటీసులో కేటీఆర్ న్యాయవాదులు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలు ఉన్నాయని... మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు.. అందులోనే నదులు, జలపాతాలు ఉన్నందున మనకు ఉన్న వనరులను సద్వినియోగం చేసే ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. అటవీ శాఖపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. మన దగ్గర అమ్రాబాద్, కవ్వాల్ -టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళుతున్నారని సీఎం అన్నారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని సీఎం ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలని సీఎం సూచించారు. కలెక్టర్లు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సీఎం సూచించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూ ను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మృతిచెందిన లేదా గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సీఎం సూచించారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను సాధ్యమైనంత త్వరగా సాధించాలన్నారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు- చేసిన కెమెరాలన్నింటిని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలని సీఎం ఆదేశించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపైనా సీఎం ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు... ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, పీసీసీఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కదనభేరీ సభ వాయిదా

ఈ భారీ బహిరంగ సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కరీంనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత గంగుల కమలాకర్.. తన ఎక్స్ ఖాతా వేదికగా ప్రకటన చేశారు. భారీ వర్ష సూచన కారణంగానే ఈ సభను వాయిదా వేసినట్లు- ఆయన తెలిపారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని.. అందులో భాగంగా ఆగస్ట్ 14, 15, 16, 17 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే సూచించిందని వివరించారు. ఈ క్రమంలో ఈ కదన భేరి సభను వాయిదా వేసినట్లు- తెలిపారు. అయితే వాతావరణం అనుకూలించిన తర్వాత ఈ సభను నిర్వహించాలని పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుందని పేర్కొన్నారు. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించనున్నది మరికొద్ది రోజుల్లో నిర్ణయించి.. ప్రకటిస్తామని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు గమనించాలని సూచించారు. తొలుత ఆగస్ట్ 8వ తేదీన కరీంనగర్ వేదికగా ఈ కదన భేరీ సభ నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంనిర్ణయించింది. కానీ ఎందుకో.. ఈ సభను ఆగస్ట్ 14వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించింది. కానీ భారీ వర్షాల నేపథ్యంలో ఈ సభను మరోసారి వాయిదా వేశారు. ఈ సభ ఏర్పాటుపై వాయిదాల పర్వం కొనసాగడానికి వెనుక ఉన్న కారణాలు ఏమై ఉంటాయనే ఒక చర్చ అయితే రాజకీయ వర్గాల్లో బలంగా సాగుతోంది. అయితే వర్షాల కారణంగానే బీసీ కదన భేరి సభను వాయిదా వేస్తున్నట్లు- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రస్తుతం సభ నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు- జరుగుతున్నాయని, అయితే.. వాతావారణ శాఖ చెప్పిన అంశాలను పరిగనణలోకి తీసుకొని వాయిదా వేస్తున్నట్లుగా పేర్కొన్నారు. భేరి ఎప్పుడు నిర్వహించే విషయాన్ని.. తదుపరి ప్రకటిస్తామని, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో కోరారు.

# భారీ వర్ష సూచనతో అప్రమత్తం

డీజీపీ జితేందర్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలపై సీఎం రేవంత్ దిశానిర్దేశం చేశారు. భారీ వర్షాలపై 72 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి మంత్రులు, అధికారులకు సూచించిన సీఎం.. రానున్న మూడు రోజులు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు వరద ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్ ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అకస్మిక వరదలు సంభవించినపుడు ఎయిర్ లిఫ్టింగ్ చేసేందుకు అవసరమైన హెలికాప్టర్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. విద్యుత్ కు సంబంధించి అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా మొబైల్ ట్రాన్స్‌ఫర్స్ అందుబాటు లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో వరదలపై హైడ్రా అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. స్కూల్స్, కాలేజీలు, ఐటీ- సెక్టార్ ఉద్యోగులకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. భారీ వర్షాల సమయంలో బయటకు రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వర్షాలు, వరదలపై మీడియా ద్వారా సమాచారం చేరవేయాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సిబ్బందిని అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు ఉన్న జిల్లాలకు ముందే సిబ్బందిని తరలించాలని అన్నారు.ఆయా జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు- చేయాలని రేవంత్ అన్నారు. వైద్యులు అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. హైదరాబాద్‌లో వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా చూడాలని స్పష్టం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా అధికారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. భారీ వర్షాలు, రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో సీనియర్ అధికారులను నియమించాలని అన్నారు.

# మధ్య బంగాళాఖాంతంలో ఉపరితల ఆవర్తనం

రేపు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి.. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లా రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు తీరం వెంబడి 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయి.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ వెల్లడించింది..మరోవైపు అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో గత 5-6 రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వానలతో దాదాపుగా అన్ని జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వరదలకు చెరువులు, జలాశయాలు నిండిపోయాయి. మరోవైపు రహదారులపై వరద చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ వర్షాలకు హైదరాబాద్ నగర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. ప్రయాణికులు గంటల పాటు- ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. హైదరాబాద్‌లో భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్ష సూచన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం అయ్యారు. నగర వాసులకు ఓ సూచన చేశారు. అత్యవసరం అయితేనే బయటకు రావాలని సూచించారు. మధ్యాహ్నం 3 గంటల్లోగా ఇళ్లకు చేరుకునేలా ఎ÷-లాన్ చూసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీని నివారించడానికి సాయంత్రం షిఫ్ట్ ఉన్నవారు ఇంటి నుంచే పని చేసేలా ఎ÷-లాన్ చేసుకోవాలని ఓ ప్రకటన రిలీజ్ చేశారు.

# తిక్కరేగిందంటే బ్రహ్మోస్‌తో అంతుచూస్తాం

పాక్ ప్రజలపై నాకు ఎలాంటి కోపం లేదు' అని మిథున్ చెప్పారు. అమెరికా మద్దతు లభించడమో మరొకటో తెలీదు కానీ గత కొద్ది రోజులుగా పాక్ నేతలు మళ్లీ పిచ్చి ప్రేలాపనలు మొదలెట్టారు. అమెరికా వేదికగా పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ అణు హెచ్చరికలు చేశారు. తమ దేశ ఉనికికి ముప్పు వచ్చిన పక్షంలో తమతో పాటు- సగం ప్రపంచం అంతమైపోతుందంటూ ఉన్మాదంతో ఊగిపోయారు. ఈ క్రమంలో పీపీపీ పార్టీ నేత బిలావల్ భుట్టో కూడా రెచ్చిపోయారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. యుద్ధం మినహా మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితి భారత్ కల్పిస్తోందంటూ అన్యాయంగా బెదిరింపులకు దిగారు. పాక్‌తో ఘర్షణల్లో ఓటమి కారణంగానే భారత్ సింధు నదులపై డ్యామ్‌ల నిర్మాణానికి నడుం కట్టిందని అన్నారు. పహల్గాం దాడి తరువాత భారత్ పాక్‌కు బుద్ధి చెప్పేందుకు బహుళ అంచెల వ్యూహం ప్రయోగించింది. అటు- ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రమూకలను మట్టి కరిపించడంతో పాటు సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందాన్ని కూడా నిలుపుదల చేసింది. ఇరు దేశాల మధ్య స్నేహసంబంధాల ఆధారంగా ఒప్పందం కుదుర్చుకున్న విషయాన్ని అప్పట్లో భారత్ పేర్కొంది. తమపై పాక్ అకారణంగా విషం చిమ్ముతున్న నేపథ్యంలో ఒప్పందాన్ని కొనసాగించలేమని స్పష్టం చేసింది. ఈ క్రమంలో పాక్ నేతల తీరుపై మిథున్ చక్రవర్తి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ఆత్మకూరులో అత్యాధునిక స్పోర్ట్స్ మైదానం

మినీ స్టేడియం, అదేవిధంగా జాతర మైదానంలో నడక వ్యాయామ దారులకు సౌకర్యాలు అధునీకరించడంతో పాటు పక్కనే ఒక ఇండోర్ స్టేడియం కొరకు ప్రణాళికలు సిద్దం చేసి ఇవ్వాలని సూచించారు. ఈ క్రీడా మైదానాలకు దాదాపు 5 కోట్ల నిధులు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవ తీసుకొని 4 ఎకరాల స్థలాన్ని కేటాయించారని, అదేవిదంగా ఇండోర్ స్టేడియం ఏర్పాటు-కు సైతం స్థలం కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూర్‌లో నిర్మించనున్న క్రీడా మైదానాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్దం చేసి స్పోర్ట్ అథారిటికి సమర్పిస్తే నెలరోజుల్లో పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలియ జేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కొన్ని హంగులతో క్రీడా మైదానాలు పూర్తి అయితే ఆత్మకూర్, అమరచింత మున్సిపాల్టీల రూపు రేఖలు మారిపోయాయని తెలియజేశారు. అనంతరం ఆగస్టు 25న హైదరాబాద్ ఎల్.బి. స్టేడియం టెన్నిస్ క్యాంప్లెక్స్ లో నిర్వహించనున్న సూపర్ స్పెషాలిటి హెల్త్ క్యాంప్ పోస్టరును మంత్రి, స్పోర్ట్ అథారిటి చైర్మన్ శివసేన రెడ్డి, అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

# సిబిఐకి న్యాయవాద దంపతుల హత్య కేసు

గత ప్రభుత్వం హయాంలో వామనరావు దంపతులను దారుణంగా హత్య చేస్తే విచారణ కూడా సరిగ్గా చేపట్టలేదని మంత్రి విమర్శించారు. దీంతో వామనరావు తండ్రి వెంకటరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారని తెలిపారు. సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వారి హత్యలో గత ప్రభుత్వంలోని కొంతమంది పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, దోషులు ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు- చెప్పారు. న్యాయవాదుల రక్షణ కోసం, చట్టం తెచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

# గ్రామీణ క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధి జరగాలంటే క్రీడా మౌలిక సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.

ఈరోజు మక్తల్ నియోజకవర్గం మక్తల్,ఆత్మకూరు,నార్వ, ఉట్కూరు మండల కేంద్రాల్లో మరియు అమరచింత, వనపర్తి జిల్లా కేంద్రాల్లో క్రీడా మైదానాలు మౌలిక సదుపాయాల ఏర్పాటు కై అధికారులతో ఆయన ఆయా ప్రాంతాలను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు అభివృద్ధి చెందాలంటే మండలా నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉండాలని ఆ ఆలోచన తోటే ఇప్పటివరకు మౌలిక సదుపాయాలేని మండల కేంద్రాల పైన దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అంచలంచలుగా అన్ని నియోజకవర్గాల్లో మండల కేంద్రాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు అయ్యే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. క్రీడల అభివృద్ధికి నూతన క్రీడా విధానం ప్రకటించుకొని దాని పటిష్టంగా అమలు చేయడానికి జరుగుతున్న కృషిలో భాగంగానే క్రీడా మైదానాల నిర్మాణము మౌలిక సదుపాయాల పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఒక దశాబ్ద కాలం నుండి ఎంతో వెనకబాటుకు గురైన మక్తల్ నియోజకవర్గంలో సమర్థవంతమైన క్రీడాకారులు ఉన్నారని వారిని గుర్తించి ప్రోత్సహించడానికి కృషి చేస్తామని తెలిపారు.



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి గారి నేతృత్వంలో గ్రామీణ క్రీడా రంగ మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తూ స్పష్టమైన కార్యాచరణకు పూనుకోవడం హర్షనీయమని అన్నారు. పోస్టర్ ఆవిష్కరణ.. అన్ని రాష్ట్రాల్లో కన్నా ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాల దినోత్సవం అని పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 25వ తేదీన ఎల్ బి టెన్నిస్ కాంప్లెక్స్ లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు. ఈ పర్యటనలో మంత్రి వాకిటి శ్రీహరి గారి వెంట స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి స్థానిక ప్రజా ప్రతినిధులు స్పోర్ట్స్ అథారిటీ అధికారులు చంద్రారెడ్డి, రవీందర్, భాష, అశోక్ కుమార్ మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిని రాయించుకుని తల్లిని గెంటేసిన తనయుడు

### ఎయిడ్స్ ఉందని ప్రచారంతో చేసిన దుర్మార్గుడు

### న్యాయం కోసం కలెక్టర్‌ను ఆశ్రయించిన తల్లి

జోగులాంబ గద్వాల,ఆగస్ట్12 : సమాజంలో రోజురోజుకూ దుర్మార్గాలు పెరిగిపోతున్నారు. ఆస్తి కోసం కొందరు దుర్మార్గులు ఎంతకైనా తెగిస్తున్నారు. నవమాసాలు మోసిన కన్న తల్లినే కడతేర్చుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే ఎన్నో జరిగాయి. తాజాగా మరో నీచమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆస్తి మొత్తం రాయించుకున్నాక.. కన్న తల్లికి ఎయిడ్స్ ఉందని కొడుకే పుకార్లు పుట్టించి ఇంట్లో నుంచి గెంటేశాడు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ (80) పేరిట 8 ఎకరాల భూమి ఉంది. జీవిత కాలం దగ్గరుండి మరీ చూసుకుంటానని చిన్న కుమారుడు ఇస్మాయిల్ ఆమెను ఇంటికి తీసుకెళ్లాడు. కసాయి కుమారుడి మాటలు నమ్మిన హుస్సేన్‌బీ తన పేరుపై ఉన్న భూమిని కొడుకు ఇస్మాయిల్, కోడలు సాభేరాభాను పేరిట రాయించింది. రామాపురం శివారు, జూలకల్ శివారులోని భూమిని శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. హుస్సేన్‌బీ పేరిట ఉన్న మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక కొడుకు ఇస్మాయిల్, కోడలు సాభేరాభాను ప్లేట్ మార్చారు. కొడుకు తల్లిని వేధించడం మొదలు పెట్టాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని ఎన్నో మాటలు అన్నాడు. చివరకు తల్లికి ఎయిడ్స్ ఉందని ప్రచారం చేసి ఇంటి నుంచి గెంటేశాడు. దాంతో గ్రామంలో ఆమెకు కనీసం ఎవరూ మంచినీరు కూడా ఇవ్వలేదు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కె.మోహన్ రావు సాయంతో జిల్లా కలెక్టర్, ఎస్పీలను హుస్సేన్‌బీ ఆశ్రయించారు. తన రెండో కుమారుడు, కోడలు నమ్మించి మోసం చేశారని, తన బాగోగులు చూడటం లేదని, మానసికంగా కృంగదీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వద్ద ఉన్న తులం బంగారం, బ్యాంక్ ఖాతాలోని డబ్బు తీసుకున్నారని తెలిపారు. గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి.. మళ్లీ తన పేరున భూమి నమోదు చేయాలని కోరారు. తన ఇంటిలో ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను హుస్సేన్‌బీ కోరారు. న్యాయం చేస్తామని కలెక్టర్, ఎస్పీలు ఆమెకు హామీ ఇచ్చారు.

## భారీ వర్షాంతో వరంగల్ అతలాకుతలం

### అనేక కాలనీల్లో మోకాలు లోతు నీళ్లు

### వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం

వరంగల్,ఆగస్ట్12 : వరంగల్ జిల్లాలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. వరంగల్ నగరంలో వర్షం దంచి కొట్టింది. వరంగల్ నగరంలోని వివేకానంద కాలనీ, సాయి గణేష్ కాలనీ, శివనగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీల్లోకి వరద నీరు భారీగా చేరింది. భారీ వర్షానికి గోకుల్ నగర్, శాంతి నగర్, కాలనీలకు ముంపు ముప్పు పొంచి ఉంది. కరీమాబాద్, రంగశాయిపేట, కాశీబుగ్గ ప్రాంతాలు మోకాళ్ల లోతు వరద నీళ్లలో కూరుకుపోయాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రధాన రహదారులపై నీరు చేరడంతో వరంగల్ నగరంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. లోతట్టు- ప్రాంతాల్లో ఇళ్లు, షాపుల్లోకి వరద నీళ్లు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. గడిచిన 12 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 92.9 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర సహాయం కోసం హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు- చేశారు

## అమెరికాలో రోడ్డు ప్రమాదం

### హైదరాబాద్ విద్యార్థిని శ్రీజావర్మ దుర్మరణం

హైదరాబాద్,ఆగస్ట్12 : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని మృతి చెందింది. ఎంఎస్ కోసం అమెరికా వెళ్లిన శ్రీజావర్మ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శ్రీజావర్మ ఈ మధ్యే ఎంఎస్ పూర్తి చేసింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి అపార్ట్‌మెంట్ నుంచి బయటకు వచ్చి భోజనం చేసేందుకు కారులో రెస్టరంట్‌కు వెళ్లింది. భోజనం చేసి తిరిగి వస్తుండగా ఆమె వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీజా వర్మ తీవ్రంగా గాయపడి మృతిచెందింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో శ్రీజా వర్మతో పాటు ఆమె స్నేహితురాలు కూడా ఉన్నట్లు- సమాచారం. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా రామారుకల గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ, హేమలత దంపతులకు శ్రీజా వర్మ, శ్రేయా వర్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శ్రీనివాస్ వర్మ దంపతులు బతుకుదెరువు కోసం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ చౌరస్తా సమీపంలోని శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నారు. శ్రీనివాస్ వర్మ డ్రైవర్‌గా పనిచేస్తుండగా.. ఆయన భార్య ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. వీరి పెద్ద కుమార్తె శ్రీజా వర్మ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. శ్రీనివాస్ వర్మ చిన్న కుమార్తె శ్రేయా వర్మ సైతం ఎంఎస్ చేసేందుకు 20 రోజుల క్రితం అమెరికా వెళ్లింది. ఈ వార్త తెలియడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

## విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

### కేసు నమోదు చేసిన పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్,ఆగస్ట్12 : ఎల్బీనగర్‌లో విద్యార్ది గ్రూపుల మధ్య జరిగిన గ్యాంగ్ వార్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లుగా సిసి కెమెరాల్లో నమోదు అయ్యింది. శుక్రవారం ఈ ఘటన జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొట్టుకున్న విద్యార్థులంతా అవినాష్ కాలేజీ వారుగా తెలుస్తోంది. ఒక గ్యాంగ్‌పై మరో గ్యాంగ్ దాడి చేసుకున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. గ్యాంగ్ వార్‌పై ఎల్బీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మొత్తం 15మందిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థుల మధ్య వాగ్వాదం జరగడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై కాలేజీ నిర్వాహకులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

## రేవంత్‌రెడ్డికి సవాల్‌గా జూబ్లీహిల్స్

ఇక్కడ ఉనికిని చాటితేనే రేవంత్ నాయకత్వానికి సవాల్ ఉండదు. ఇప్పటికే రేవంత్‌పై ముప్పేట దాడి చేస్తున్న కాంగ్రెస్ నేతలు ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోతే బంతాట ఆడు కుంటారు. అలాగే పదిమంది ఎమ్మెల్యేలే వ్యవహారంలో తేడావచ్చి ఉప ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ పార్టీకి మైనస్ కాగలదు. అందుకే సాధారణ ఎన్నికల కన్నా, ఉప ఎన్నికలు, స్థానిక ఎన్నికలు సవాల్‌గా మార నున్నాయి. బిసి రిజర్వేషన్లు ప్రకటించి, కేంద్రానిదే తప్పంటూ బట్టకాల్చి మీదవేసే ప్రయత్నాలు కూడా ఫలించవని తెలుసుకోవాలి. బిజెపి ఈ విషయంలో రేవంత్‌ను చెండాడేందుకు ఇప్పటికే రకరకాలుగా విమర్శలు చేస్తోంది. రిజర్వేషన్ల గండం ఎలా గట్టెక్కుతారన్నది కూడా ఇక్కడ ముఖ్యమే. చావోరేవో తేల్చుకునేందుకు రేవంత్ రెడ్డి సిద్ధం కావాల్సిన తరుణమిది. రానున్న ఎన్నికలో ఎక్కడ ఓటమిపాలైనా రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠకే భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. జూబ్లీహిల్స్‌కు సంబంధించి ఓ వైపు అభ్యర్థి ఎంపికకు కసరత్తు చేస్తూనే మరోవైపు కాంగ్రెస్‌కు తిరుగులేదన్న సంకేతాలు పంపేందుకు రేవంత్ ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇకపోతే జూబ్లీహిల్స్ రాజకీయం క్షేత్రస్థాయికి చేరింది. అన్ని పార్టీలు ఉప ఎన్నికల పోరును కార్యక్షేత్రంలోనే తేల్చుకునేందుకు సమాయత్తమవుతున్నాయి. విపక్ష బిఆర్‌ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇప్పుడు ఎన్నిక అనివార్యమయ్యింది. అందువల్ల బిఆర్‌ఎస్ ఈ స్థానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పోరాడబోతున్నది. కాంగ్రెస్ వైఫల్యాలనే ఎక్కువగా ప్రచారానికి ఉపయోగించుకోనుంది. ఇక్కడ గెలవడం ద్వారా ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. ఇక్కడ విజయం సాధించి తెలంగాణలో ఇక బిజెపి, కాంగ్రెస్‌లకు స్థానం లేదని నిరూపించాలన్న పట్టుదలతో బిఆర్‌ఎస్ ఉంది. మరోవైపు ఈ ఉపఎన్నికకు అన్ని రాజకీయ పార్టీలు సమాయత్త మవుతున్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలు వ్యూహరచన లో తలమునకలై ఉన్నాయి. ఎలాగైనా సరే సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో బిఆర్‌ఎస్, ఈ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భాజపా భావిస్తోంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పట్టు సాధించేందుకు పావులు కదుపుతోంది. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ తమ అభ్యర్థులు ఎవరన్నది బహుశా ఎన్నికల ప్రకటన వచ్చే వరకు నానబెట్టడం ఖాయం.

## మూడురాష్ట్రాల్లో సెమీ కండక్టర్ ప్రాజక్టుల ఏర్పాటు

ఏపీ సహా ఒడిశా, పంజాబ్‌లో సెమీ కండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది. మొత్తంగా రూ.4,594 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు- చేయనున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. అలాగే, పట్టణ రవాణాను మరింత బలోపేతం చేసేలా లక్నో మెట్రో ఫేజ్ 1బి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దీన్ని రూ.5,801 కోట్లతో చేపట్టనున్నట్లు పేర్కొంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో 700 మెగా వాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో సెమీ కండక్టర్ ఎకో సిస్టమ్ గణనీయంగా ఊపందుకుంటున్న వేళ తాజా నిర్ణయం మరింత ప్రయోజనకరంగా మారనుంది. ఇప్పటికే దేశంలో ఆరు సెమీ కండక్టర్ ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉండగా.. తాజాగా కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన నాలుగు కొత్త ప్రాజెక్టులతో ఈ సంఖ్య మొత్తంగా 10కి చేరింది. 2034 నాటికి నైపుణ్యం కలిగిన వారికి మరింతగా ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఇవి కీలకంగా పనిచేయనున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ ఎకోసిస్టమ్‌కు ఉత్ప్రేరకంగా పనిచేయడం ద్వారా ఇవి పరోక్షంగా అనేక ఉద్యోగాల కల్పనకు ఉపయోగపడనున్నాయి టెలికాం, ఆటోమోటివ్; డేటా సెంటర్లు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ఆమోదించిన ఈ నాలుగు కొత్త సెమీకండక్టర్ ప్రాజెక్టులు దేశంలో సాంకేతిక పరిజ్ఞానంలో స్వావలంబన సాధించడంలో, ఆత్మనిర్భర్ భారత్‌ను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రం పేర్కొంది. ఏపీకి సెమీ కండక్టర్ల ప్రాజెక్టు కేటాయిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ నేతృత్వంలో సెమీ కండక్టర్ తయారీ ఏపీకి వస్తోందన్నారు. రాష్ట్రానికి సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టును మంజూరు చేసినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు చెబుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజీ టెక్నాలజీస్ దక్షిణ కొరియాకు చెందిన కంపెనీతో 96 మిలియన్ యూనిట్ల వార్షిక సామర్థ్యంతో ఒప్పందం కుదుర్చుకుంటుందని తెలిపారు. సెమీకండక్టర్లను మొబైల్ ఫోన్లు, సెట్ టాప్ బాక్సులు, ఆటోమొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్‌లో ఉపయోగిస్తారని.. తద్వారా ఆత్మనిర్భర భారత్‌కు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని లోకేశ్ పేర్కొన్నారు.

## చందానగర్‌లో భారీ దోపిడీ

### ఖజానా జ్యువెలర్స్‌పై కాల్పులు

### బంగారం, వెంటి, నగదు అపహరణ

### రంగంలోకి దిగిన పోలీసులు.. గాలింపు ముమ్మరం

హైదరాబాద్,ఆగస్ట్12 : హైదరాబాద్ మహా నగరంలో ఓ జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపిన దుండగులు భారీ దోపిడీకి ఒడిగట్టారు. చందానగర్‌లోని ఖజానా జ్యువెలర్స్ షాపులో కొంతమంది దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఒక్కసారిగా దుకాణం లోపలికి ప్రవేశించిన దొంగలు తుపాకులతో బెదిరింపులకు దిగారు. అక్కడున్న సిబ్బంది బెదిరించి పెద్దఎత్తున నగలు ఎత్తుకెళ్లారు. వారిని అడ్డుకునేందుకు సిబ్బంది ప్రయత్నించగా.. కాల్పులకు తెగపడ్డారు. షాపు డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌండ్ల కాల్పులు జరిపారు దుండగులు. ఈ దాడిలో అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. అనంతరం సీసీ కెమెరాలపైనా కాల్పులు జరిపారు. షాపు తెరిచిన 5 నిమిషాల్లోనే భారీ దోపిడీకి పాల్పడి అక్కడ్నుంచి కేటుగాళ్లు ఉడాయించారు. షాపు సిబ్బంది, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, దోపిడీ అనంతరం దుండగులంతా జహీరాబాద్ వైపు పారిపోయినట్లు- గుర్తించారు. ఈ మేరకు జిల్లా సరిహద్దు పోలీసులను అలర్ట్ చేశారు. కాగా, నిందితులను పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ వెల్లడించారు. కెపిహెచ్‌బిలో దోపిడీకి పాల్పడిన ముఠానే ఖజానా జ్యువెలర్స్‌లోనూ కాల్పులు జరిపి దొంగతనం చేసినట్లు- తెలిపారు. 20 తులాల బంగారం, రూ.3లక్షలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా, ఖజానా జ్యువెలర్స్‌లో భారీగానే గోల్డ్ చోరీ అయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఎదురుతిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు.. రెండు రౌండ్ల ఫైరింగ్ జరిపారు. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు.. సిబ్బందిని లాకర్ కీ అడిగారు. వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ- మేనేజర్‌పై కాల్పులు జరిపారు. లోపల బంగారు ఆభరణాలకు సంబంధించిన స్టాల్స్ విరగ్గొట్టి సిబ్బందిపై దాడులకు సైతం పాల్పడ్డారు. నగల దుకాణ సిబ్బంది భయంతో పోలీసులకు కాల్ చేశారు. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి దుండగులు పారిపోయారు. నిందితుల కోసం పది బృందాలను ఏర్పాటు-చేసి గాలిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు దొంగల ముఠా దుకాణంలో చొరబడిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. బంగారు ఆభరణాలు ఉన్న కౌంటర్లను దుండగులు తెరవలేకపోయారని పేర్కొన్నారు. వెండి ఆభరణాలు ఉన్న కౌంటర్లు ధ్వంసం చేసి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. వెండి ఎంత ఎత్తుకెళ్లారనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయమైన డిప్యూటీ- మేనేజర్ పరిస్థితి బాగానే ఉందని వివరించారు.

## కాణిపాకం వినాయక బ్రహ్మోత్సవాలు

### వైభంగా నిర్వహించేలా ఏర్పాట్లు

కాణిపాకం : కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ అధికారులు అందరు కలసి వినాయక చవితి రోజున మూల విరాట్‌కు నిర్వహించే అభిషేకం, భక్తుకు స్వామి దర్శనం కల్పించడంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ మహాకుంభాభిషేకాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. 27నుంచి ప్రారంభ మయ్యే బ్రహ్మోత్సవాలు 21 రోజుల పాటు కొనసాగనున్నాయి. సామాన్య భక్తులకు పెద్దపీట వేయ నున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. రెండేళ్ల తర్వాత బ్రహ్మోత్స వాలను నిర్వహిస్తున్నందున భక్తుల సంఖ్య పెరగొచ్చని అభిప్రాయపడ్డారు. భక్తులెవరూ ఇబ్బందులకు గురికాకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు పరిసర గ్రామస్తులు సహకరించాలని కోరారు. బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల పాటు ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేయనున్నారు. కాణిపాకం విచ్చేసే భక్తులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపనుంది. భక్తులకు బస, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నారు. వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులందరు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు విజవంతం చేయాలన్నారు.

## చెరువులో మునిగి కవల సోదరుల మృతి

కామారెడ్డి,ఆగస్ట్12 : స్నానం కోసం చెరువుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు గల్లంతైన సంఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకొంది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మకుపల్లికి చెందిన కవల సోదరులు రామ్, లక్ష్మణ్(13)లు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి సమీపంలోని చెరువుకు స్నానానికి వెళ్లారు. చెరువు లోతు ఎక్కువగా ఉండటంతో ఈత రాక ఇద్దరూ మునిగిపోయి గల్లంతయ్యారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా గజ ఈతగాళ్ల సహాయంతో వెతికించడంతో మంగళవారం ఉదయం ఇద్దరు అన్నదమ్ముల మృతదేహాలు బయటపడ్డాయి. కవల సోదరుల మృతితో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకొన్నాయి.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

### స్థిరంగా వెండి ధరలు

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : దేశంలో పసిడి మంగళవారం ఉదయం నాటికి స్వల్పంగా తగ్గాయి. పెరిగినప్పుడు వేలల్లో పెంచుతున్న వారు తగ్గించేప్పుడు వందల్లో మమ అనిపిస్తున్నారు.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 760 తగ్గి రూ. 1,02,420కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,890 వద్ద నిలిచింది. వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉండి, ఢిల్లీలో కిలోగ్రాము వెండి రూ.1,16,900 స్థాయిలో ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో మార్పులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి (1 కిలో) రూ. 1,26,900గా నమోదైంది. విజయవాడలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ. 1,26,900గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,26,900గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,16,900గా నమోదైంది. ఈ ధరలు ఢిల్లీతో పోలిస్తే కొన్ని నగరాల్లో స్వల్ప వ్యత్యాసాలను చూపిస్తున్నాయి. వెండి ధరలు హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో ఢిల్లీ కంటే ఎక్కువగా ఉన్నాయి. బంగారం ధరలు ఇటీవల ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయిలకు చేరినప్పటికీ, మంగళవారం స్వల్పంగా తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్ బలపడటం, పెట్టుబడిదారులలో కొంతమంది లాభాలను బుక్ చేసుకోవడం కారనంగా చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు స్పాట్ గోల్డ్ రేట్లపై ఆధారపడి ఉంటాయి. డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు కూడా ఈ తగ్గుదలకు దోహదపడ్డాయి. భారతదేశంలో శ్రావణమాసం, పండుగ సీజన్ సమీపిస్తున్నప్పటికీ, కొంతమంది కొనుగోలుదారులు ధరలు మరింత తగ్గే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. దీని వల్ల డిమాండ్ తాత్కాలికంగా తగ్గింది. వెండి ధరలు స్థిరంగా ఉండటం దీని పారిశ్రామిక వినియోగం, స్థిరమైన డిమాండ్‌ను సూచిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం బంగారం ధరలు ఈ ఏడాది చివరిలో మరింత పెరిగే అవకాశం ఉంది.

## ఫ్రీడమ్ ఫైటర్స్ పెన్షన్ కేసుల పరిష్కారం

### ఎనిమీ ప్రాపర్టీ ఆస్తులు గుర్తించి తగు చర్యలు

### ఉన్నతాధికారులతో సమీక్షించిన కేంద్రమంత్రి బండి సంజయ్

న్యూఢిల్లీ,ఆగస్ట్ 12 : నెలాఖరులోపు స్వాతంత్ర్య సమరయోధుల పింఛను కేసులను పరిష్కరిం చాలని అధికారులను కేంద్రమంత్రి బండి సంజయ్ ఆదేశించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ కేసుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. దీనిపై తక్షణమే సర్వే చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని కేంద్రమంత్రికి అధికారులు తెలిపారు. 600కుపైగా ప్రాపర్టీస్ వేలందశలో ఉన్నాయని వివరించారు. వేలం వేసిన ఆస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.107 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పెండింగ్ ఫైళ్లను వేగంగా క్లియర్ చేసిన అధికారులను కేంద్రమంత్రి అభినందించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన కార్యాలయంలో పునరావాస విభాగంసీనియర్ అధికారులు, ఇండియాలో శత్రు ఆస్తుల సంరక్ష అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్లు, శత్రు ఆస్తుల ఆర్థికీకరణ, శరణార్థుల పునరావాసలపై అధికారులు కేంద్ర మంత్రికి సమగ్ర నివేదిక అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ కేసులను ఈ నెలాఖరులోపు పరిష్కరించాలని బండి సంజయ్ అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా 12,800 ఎనిమీ ఆస్తులున్నాయని అధికారులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వివరించారు. 600లకుపైగా ఎనిమీ ప్రాపర్టీస్ వేలం దశలో ఉన్నాయని తెలిపారు. ఫ్రీడం ఫైటర్స్ పెన్షన్ కేసులను పరిష్కరించి, ఎనిమీ ఆస్తులపై తక్షణమే సర్వే చేయించాలని ఆయన అధికారులకు సూచించారు. దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనిమీ ప్రాపర్టీస్ సమస్యలను పరిష్కరించేందుకు సర్వేను వేగవంతం చేయాలని ఆయన చెప్పుకొచ్చారు.

### అనిశెట్టి రజిత మృతికి కెసిఆర్ సంతాపం

హైదరాబాద్,ఆగస్ట్ 12 : ప్రముఖ కవయిత్రి, అభ్యుదయ స్త్రీవాద రచయిత్రి, తెలంగాణ సాహితీవేత్త అనిశెట్టి రజిత మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొని, పీడిత వర్గాల పట్ల సామాజిక బాధ్యతతో కూడిన సాహిత్యాన్ని అందించిన వరంగల్ బిడ్డ అనిశెట్టి రజిత మరణం తెలంగాణకు తీరని లోటన్నారు. తెలంగాణ గొప్ప ప్రజాస్వామిక సాహితీవేత్తను కోల్పోయిందన్నారు.

# సంపాదకీయం

## పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఓ గుంటనక్క !

పాక్ సైన్యాధ్యక్షుడు మునీర్ మరోమారు ప్రేలారు. మొననటి ఆపరేషన్ సింధూర్‌తో బుద్ధి రానట్టుగా ఉంది. భారత్ చేసిన తప్పు ఏంటంటే పక్కలో బల్లెంలా ఉన్న పాక్‌ను నమ్మడమే. కాల్పుల విరమణను నోటిమాటగా నమ్మి విరమించుకోవడం తప్పు. ఇకపోతే భారతదేశ విభజనతో పాకిస్థాన్ ఏర్పడిందన్న కనీస జ్ఞానం లేని పాలకులు ఇప్పుడు భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. అమెరికా ద్గ్గరకు తీసే కొద్దీ పాక్ సైన్యాధ్యక్షుడు మునీర్ నెచ్చిపోయి మాట్లాడుతున్నారు. అమెరికాను ఉగ్రవాదులు వెంటాడి ట్విన్ టవర్స్‌ను కూల్చి విషయం మర్చి పోయిన ట్రంప్ భారత్‌ను వ్యతిరేకించే క్రమంలో పాక్‌ను మళ్లీ చేరదీస్తు న్నాడు. పాక్ పన్నాగాలు తెలిసీ మనం మొన్నటి ఆపరేషన్ సిందూర్ సమయంలో అనవసరంగా తొందర పడ్డామా అన్నది ఆలోచించాలి. మునీర్ లాంటి గుంటనక్కలను ఇంకా నమ్మకుండా జాగ్రత్త పడాలి. ఇకపోతే స్వాతంత్ర్య వేడుకలు జరుపుకోబోతున్న తరుణంలో భారత స్వాత్ర్య ఉద్యమ చరిత్ర గురించి ప్రజలు తెలుసుకోవాలి. బ్రిటిషర్ల దమనకాండ కన్నా విభజన వల్ల జరిగిన రక్తపాతమే అధికం. దాదాపు పదిలక్షల మంది ఊచకోతకు గురయ్యారంటే ఆ రక్తపాతం ఎంతగా పారిందో నేటితరం తెలుసుకోవాలి. విభజన గాయాలను అధ్యయనం చేయాలి. బ్రిటిష్ వారు పోతూపోతూ దేశాన్ని మతప్రాతిపదకన విభజించే చిచ్చు పెట్టారు. ఇందుకు గాంధీ, నెహ్రూ,జిన్నాల పాత్రను కాదనలేం. ఒక్కటిగా ఉన్న భారతావనిని ముక్కలు చేద్దామ్న ప్రతిపాదనను ఆనాడు గాంధీ,నెహ్రూలు పట్టించుకోలేకపోయారు. బ్రిటిష్ వారు పాలించడం వల్ల కలిగిన నష్టం కంటే విభజించడం వల్ల కలిగిన నష్టం పూడ్చుకోలేకుండా పోయింది. పాక్ ఇప్పుడు పక్కలో బల్లెంలా ఉగ్రవాదంతో భారత్‌తో చెలగాటమాడుతోంది. విభజనను ఆపడానికి నాటి నాయకులకు శక్తి లేకుండా ..స్వాతంత్ర్యంతో ముడిపెట్టి చేతులు కట్టేశారు. ఓ రకంగా ఈ నష్టం భూమ్యా కాశాలు ఉన్నంత వరకు తీరవనే చెప్పాలి. మతతత్వం సమాజాన్ని కార్చిచ్చులా భస్మీపటలం చేస్తుందని ఆనాటి విభజన రుజువు చేసింది. నేటికీ అది రావణకాష్టంలా రగులూతనే ఉంది. అందుకు ఇటీవలి పహల్గమ్ వరకు ఎన్నో రక్తపాతాలను చూఊశాం. విద్వేషం, విధ్వంసాలతో కూడా విభజన సాగింది. భరత మాత నుదిటిపై నేటికీ ఆ రక్తపు చారికలు ఇంకా వరదలా కొనసాగుతూనే ఉన్నాయి. అలాంటి మహా భయంకరమైన విధ్వంసం, విషాదం మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు చోటు చేసుకొంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంబరం కంటే దేశ విభజన కారణంగా జరిగిన రక్తతర్పణమే భయంకర విషాదంగా మారింది. లక్షలాది అమాయకులు ఊచకోతలకు గురయ్యారు. వేలాదిమంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఆస్తులు లూటీ అయ్యాయి. స్వాతంత్ర్య ఉత్సవాలు జరుపుకోబోతున్నవేళ దేశం మరోమారు నాటి విభజన రక్తపాతాన్ని గుర్తు చేసుకోవాలి. మతతత్వం మనుషులను ఎంత భయంకరంగా విభజిస్తుందో అన్నది మరువలేని గాయంగా మిగిలింది. అన్నదమ్ముల్లా ఉన్న హిందూముస్లింలను మతం పేరుతో బ్రిటిషర్లు విభజించి పాలించారు. ఇదే మీ దేశం అంటూ గీతగీసి వెళ్లారు. జాతీయోద్యమం కులమతాలకు అతీతంగా ప్రజలను ఏకం చేస్తుంటే కొందరు రాజకీయనేతలు స్వార్ధ ప్రయోజనాలను ఆశించిన మతతత్వం రాజేసారు. 1937 నాటికి అది మరింత తీవ్రస్థాయి దాల్చింది. జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. ఈ దేశంలో ఇతర మతాలను అణచివేసి హిందూరాజ్యం స్థాపించాలని కాంగ్రెస్ ప్రయత్ని స్తోందని జిన్నా రెచ్చగొట్టుడు ప్రసంగాలు మొదలెట్టాడు. గాంధీ మీద తీవ్ర విమర్శలు చేశాడు. దీంతో సొంత గడ్డ మీద హిందువులంతా బానిసలయ్యారు. విభజిత పాక్ భూభాగం నుంచి గుట్టలుగా శవాలు ఢిల్లీకి వచ్చాయి. అక్కడి హిందువులను ఊచకోత కోశారు. ఊచకోతలు తప్పించుకుని మిగిలిపోయిన వారు పాక్‌లో బలవంతంగా ముస్లింలుగా మారాల్సి వచ్చింది. బలవంతపు మతమార్పిళ్లతో ఇస్లాంలోకి మార్చారు. ఇది మన స్వాతంత్ర్య చరిత్రలో మిగిలిన విషాదం. భారత జతీయోద్యమంలో లక్షలాది హిందూ ముస్లిం ప్రజలు భుజం భుజం కలుపుకొని కదన రంగంలో పోరాడితే... జిన్నా విద్వేషాగ్నిని రగిలించే ప్రయత్నాలకు బ్రిటిషర్లు ఆజ్యం పోశారు. మతాలకు అతీతంగా అనేకమంది నాయకులు స్వరాజ్యం కోసం పోరాడుతుండగానే ముస్లిం లీగ్ చాపకింద నీరులాగ మతతత్వాన్ని విస్తరింపచేసింది. 1947 నాటికి అది పతాకస్థాయికి చేరింది. పోతూ పోతూ బ్రిటీషు వాళ్లు మన దేశాన్ని రెండు ముక్కలుగా చీల్చటానికి, ఇంకా అనేక కార్చిచ్చులు రగిలించటానికి కారణమైంది. మరోపక్క కాంగ్రెస్‌లో అధికారం కోసం జరిగిన ముఠా తగాదాలు కూడా దీనిని చిన్నదిగా చేశాయి. తూర్పు బెంగాల్లో మైనార్టీలుగా ఉన్న హిందువుల మీద దాడులు జరిగాయి. ఒకదానికి ఒకటి ప్రతీకారంగా మతతత్వవాదులు ప్రజలను రెచ్చ గొట్టారు. హిందూ - ముస్లిం విబేధాలు దారుణ మారణ కాండకు దారి తీసినా పెద్దా పట్టించుకోలేదు. ఇండియా వైస్రాయి మౌంట్ బాటన్ ... ఏప్రిల్‌లో రాజకీయ పక్షాలతో చర్చలు జరిపాడు. తరువాత 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి దేశ విభజన, స్వాతంత్ర్య ప్రకటన చేశాడు. ముస్లింలీగ్ ప్రేరేపించిన మతతత్వం విజృంభించి, దేశం రెండుగా విడిపోయింది. ఇలా స్వాతంత్ర్య ఉత్సాహం ఉవ్వెత్తున లేవాల్సిన 1947 ఆగస్టు 15.. మతకలహాల నీడతో అంధకారమై పోయింది. మత ప్రతిపాదికన ప్రజలు తమ తమ ఇళ్లను, ఆస్తులను వదిలి వెళ్లిపోవాల్సి వచ్చింది. అదే సందర్భంలో పిచ్చెక్కిన మతోన్మాదం దాడులకు, దౌర్జన్యాలకు బరి తెగించింది. హత్యలూ, అత్యాచారాలూ, అత్యంత అమానవీయ సంఘటన లూ చోటు చేసుకున్నాయి. రైళ్లు రక్తసిక్త మృతదేహాలతో, అగమ్యగోచర విషాద వదనాలతో ప్రయాణించాయి. వేలాది మంది ప్రజలు తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా తమదైన నేలను వదిలి, తమది కాని గడ్డ మీదికి కేవలం మతం ప్రతిపాదికన కాందిశీకులుగా తరలిపోవాల్సి వచ్చింది. మధ్యలోనే ఎంతో మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు. మహిళలను ఎవరెవరో బలవంతంగా లాక్కెళ్లిపోయి, అత్యాచారాలకు పాల్పడ్డారు. వేలాదిమంది బాలబాలికలు తమ తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి, అనాథలై పోయారు. ప్రజలకు అవసరమూ, ఆమోదమూ లేని దేశ విభజన సృష్టించిన ఇలాంటి విషాద, విచారకర దృశ్యాలెన్నో ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయి. ఇవన్నీ తెలుసుకోవాలి. దాదాపు 2 శతాబ్దాలు ఏండ్లు భారత్‌ను ఏలిన ఆంగ్లేయులు వెళ్లిపోతూ భారత ఉపఖండంలో పెట్టిన విభజన చిచ్చు నేటికీ దాయాది దేశాల మధ్య రగులుతూనే ఉన్నది. దేశ విభజనతో సుమారు 1.5 కోట్ల మంది పౌరులు నిరాశ్రయులయ్యారు. దాదాపు పది లక్షల మందిని బలితీసుకున్న విభజన గీత నేటికీ రక్తమోడుతూనే ఉన్నది. భారతదేశం నుంచి 60 లక్షల మంది పాకిస్థాన్‌కు తరలిపోతే.. పాకిస్థాన్ నుంచి 40 లక్షల మందికి పైగా భారతదేశానికి తరలి వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో రెండు లక్షల నుంచి 20 లక్షల మంది వరకు మరణించారని చరిత్ర చెబుతోంది. చట్టాన్ని అమలు చేసే వారు లేక మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయి. విభజిత పాక్, బంగ్లాలో ఇంకా ఛాందసవాద మతోన్మాదుల విజృంభణ కారణంగా అక్కడి మైనార్టీ హిందువులు విధిలేక మతం మారడమో, హత్యలకు గురికావడమో జరుగు తూనే ఉంది. చరిత్ర తెలియని మునీర్ లాంటి మూర్ఖులు భారత్ గురించి ప్రేలుతుంటే చూస్తూ ఊరుకోవడం సరికాదు. సరైన సమయంలో గట్టిగా బుద్ధి చెప్పాల్సిందే.

# విభజనతో పాటే కాశ్మీర్ చిచ్చు



### నాటి పాలకుల దృష్టి లోపం

### సమర్థ నాయకత్వ లోపంతో సమస్యలు

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : బ్రిటిష్ పాలకలు దేశాన్ని విభజించడమే కాకుండా.. అనేక మెలికలు పెట్టి వెళ్లారు. అలాంటి దాంట్లో కాశ్మీర్ సమస్య ఒకటి. నేటికీ అది రావణకాష్టంగా మారడానికి కారణం వారి కుత్సిత రాజకీయ తంత్రమే. వెళుతూవెళుతూ సంస్థానాలను వారి స్వేచ్ఛకు వదిలేసి వెళ్లారు. ఇదే క్రమంలో భారత్ ఆశ్రయం పొంది భారత్‌లో విలీనం కావడానికి కాశ్మీర్ రాజు హరిసింగ్ చేసిన ప్రయత్నాల ను విభజిత పాక్ అడ్డుకుంది. కొంత భాగాన్ని ఆక్రమించడంతో దిక్కులేని స్థితిలో కాశ్మీర్ రాజు భారత్ ఆశ్రయం పొందాడు. అయితే ఆనాటి ప్రధాని నెహ్రూ తాత్సారం, ఉదాసీనత కారణంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ సమస్య అలాగే ఉండిపోయింది. అలాగే 370 ఆర్టికల్‌తో కొత్త చిచ్చును కూడా నెహ్రూ రాజేశారు. తొలుత కశ్మీర్ రాజు హరిసింగ్ స్వతంత్రంగా ఉంటానని చేసి, పాకిస్థాన్‌తో మమేకం అయ్యేందుకు ప్రయత్నించారు. కానీ వెంటనే తమతో మమేకం కాకపోవడంతో పాకిస్థాన్‌లోని ప్రభుత్వం ఆక్రమిత కశ్మీర్ భాగంలోని గిరిజనులను ఉసిగొలిపితే కశ్మీర్ రాజు హరిసింగ్.. నాటి నెహ్రూ ప్రభుత్వాన్ని శరణు కోరారు. తర్వాత కశ్మీర్ కూడా భారతదేశంలో భూభాగమైనా.. ఆక్రమిత కాశ్మీర్ సమస్యనేటికీ తెగడంలేదు. కాశ్మీర్ రాజు ఒప్పందం మేరకు కాశ్మీర్ యావత్తూ భారత్ భూభాగంగా ఉండాలి. కానీ పాక్ పాలకు తీరు, నాటి భారత్ పాలకుల ముందు చూపు లేకపోవడం కారణంగా నేటికి దానిని రావణ కాష్టంగా మార్చేశాయి. మిలిటెంట్ల చొరబాట్లు, పాక్ సైన్యం అకారణంగా కాల్పులు జరుపడం నిత్యకృత్యంగా మారింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారి తీసింది. మత ఘర్షణల నివారణకే దేశ విభజన వందేండ్ల పోరాటం తర్వాత భారత్ 1947లో వలస పాలకుల నుంచి విముక్తి పొందింది. బ్రిటన్ పార్లమెంట్ స్థానంలో భారత స్వాతంత్ర్య చట్టం అమలులోకి వచ్చింది. ఆగస్టు 15వ తేదీ నుంచి బ్రిటీషువారి పాలన ముగుస్తుందని ఆ చట్టం నిర్దేశించింది. అలాగే దేశాన్ని రెండు సార్వభౌమ దేశాలైన ఐక్య భారత్, అధినివేశ పాకిస్థాన్‌గా విభజించాలని సూచించింది. రెండు దేశాలకు కేటాయించాల్సిన ప్రాంతాల పర్యవేక్షణకు బ్రిటీషు వారు సర్ సిరిల్ రాడ్‌క్లిఫ్‌ను రంగంలోకి దించారు. వృత్తిరీత్యా న్యాయాధికారి రాడ్‌క్లిఫ్‌ను సరిహద్దు కమిషన్‌కు చైర్మన్‌గా నియమించారు. ఒక దేశాన్ని రెండు స్వతంత్ర దేశాలుగా విడగొట్టే గీత గీయడానికి ఈ కమిషన్‌ను నియమించారు. ఢిల్లీ దేశ విభజన అనంతరం దాదాపు 1.5 కోట్ల మంది తమ నివాస ప్రదేశాలను వదిలి రాడ్‌క్లిఫ్ గీతకు అటూ ఇటూ ప్రయాణించారు. వారిలో కొందరు కాలినడకన, మరికొందరు రైళ్లలో, బస్సుల్లో రవాణా వసతి ఏది దొరికితే దానిలో గీత దాటారు. ఈ సందర్భంగా జరిగిన మతోన్మాద మారణకాండలో దాదాపు పదిలక్షల మంది తమ ప్రాణాలు కోల్పోయారు. లక్షల కుటుంబాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డాయి. వేల మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. దేశవిభజనతో ఒక ప్రాంతం నుంచి మరోప్రాంతానికి తరలివెళ్తున్న నిరాశ్రయులైన జనంతో ఢిల్లీ గుడారాల నగరంగా మారి పోయింది. ఇండ్లను, పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి, మతకల్లోలాల్లో సర్వం పోగొట్టుకొని శరణార్థులుగా మారారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులదీ ఇదే పరిస్థితి. అదే సమయంలో ఢిల్లీ జనాభాలో.. వలస వచ్చిన ప్రజల సంఖ్య దాదాపు మూడోవంతు వరకు చేరుకున్న దంటే.. ఏ స్థాయిలో వలసలు జరిగాయో ఊహించుకోవచ్చు. నిట్టనిలువునా చీలిన పంజాబ్ లోనూ ఇదే పరిస్థితి. పలు కాలేజీలు వలస ప్రజల శిబిరాలుగా మారిపోయాయి. కనీస సౌకర్యాలు లేక, ఆహారం లేక జనం అలమటించిపోయారు. ప్రభుత్వం సరఫరా చేసే రేషన్ ఆహారం రోజుకు ఒక చపాతీకి తగ్గించారు. ఆకలితో అల్లాడి వేల మంది మరణించారు. ఇంతటి దారుణం తరవాత కూడా పాక్ భారత్‌తో యుద్ధం చేసి ఓడిపోయింది ఆనాడే ఆక్రమిత కాశ్మీర్ సంగతి తేల్చి వుంటే ఇవాళ ఈ గతి ఉండేది కాదని చరిత్రకారులు అంటారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు

### అభిశంవసన తీర్మానం స్వీకరించిన స్పీకర్

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : ఇంట్లో నోట్ల కట్టలు లభించిన ఘటనలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఆయన అభిశంసన కోసం లోక్‌సభ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్పీకర్ ఓం బిర్లా స్వీకరించారు. ఈ ఉదంతంపై విచారణ కోసం ముగ్గురు సభ్యులతో కూడిన ఓ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్యానెల్‌లో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు జస్టిస్ ఎమ్ఎమ్ శ్రీవాత్సవ, సీనియర్ న్యాయవాది బీవీ ఆచార్యులు సభ్యులుగా ఉన్నారు. అభిశంసన తీర్మానంపై ప్రతిపక్ష, పాలక పక్షానికి చెందిన 146 మంది సంతకం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ అభిశంసన పక్రియ ప్రారంభం కావాల్సిందేనని అన్నారు. అవినీతికి పార్లమెంటు పూర్తిగా వ్యతిరేకమని చెప్పారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని అన్నారు. ఇక స్పీకర్ ఏర్పాటు- చేసిన కమిటీ ఈ ఉదంతానికి సంబంధించిన సాక్షులు ప్రశ్నించి, ఆధారాలను పరిశీలిస్తుంది. విచారణ అనంతరం, తుది నివేదికను స్పీకర్‌కు సమర్పిస్తుంది. అనంతరం నివేదికను సభ ముందు ఉంచుతారు. ఈ ఉదంతంలో న్యాయమూర్తి దోషిగా తేలిన పక్షంలో ఆయన అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరుగుతుంది. రాజ్యసభలో కూడా ఇదే పక్రియను అమలు చేస్తారు. ఉభయ సభలు ఆమోదించిన తీర్మానానికి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తారు. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా.. అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీ-ని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. ఆ నివేదికను జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. అక్కడ ఆయనకు చుక్కెదురైంది.

## ఓటేసేందుకు వెళుతున్న వారిపై దాడి

కడప,ఆగస్ట్12 : పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీ-సీ ఎన్నికల సందర్భంగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. ఓటర్లను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు శతవిధాలా ప్రయత్నించారు. ఈ మేరకు దాడులకు సైతం తెగబడుతున్నారు. పులివెందులలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. ఓటు- వేసేందుకు కానేపల్లె నుంచి అచ్చవెల్లికి వెళ్తున్న టీడీపీ శ్రేణులపై దౌర్జన్యం చేశారు. ఓటు- వేయడానికి వెళ్తున్న వారి కారును ఆపి రౌజీయిజం చేశారు.

## పులివెందులలో ప్రశాంతంగా ఉప ఎన్నిక

### ప్రజలకు కడప జిల్లా పోలీసులు భద్రత

### ఓటమి భయంతో వైకాపా నేతలు దిగజారుడు ఆరోపణలు

### ఉప ఎన్నికలపై మంత్రి డోల వీరాంజనేయ స్వామి


విజయవాడ,ఆగస్ట్12 : పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని పులివెందల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలపై మంత్రి డోల వీరాంజనేయ స్వామి అన్నారు.లా అండ్ ఆర్డర్ కాపాడుతూ.. ప్రజలకు కడప జిల్లా పోలీసులు భద్రత కల్పిస్తున్నారని వెల్లడించారు. మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రీజనల్ కాన్ఫరెన్స్‌లో మంత్రి డోల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. వైసీపీ నేతలు ఇంటింటికీ తిరిగి ఓట్లు అడుగుతున్నారని చెప్పుకొచ్చారు. ఈరోజు దాదాపుగా రూ.100 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారని మంత్రి ఆరోపించారు. 154 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన వైసీపీ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదని మంత్రి డోల వీరాంజనేయ స్వామి విమర్శించారు. ఈరోజు పులివెందులలో కూడా వైసీపీ ఓటమి ఖాయమని.. వారు జీర్ణించుకోలేకపోతున్నారని ఆక్షేపించారు. ఓటమిని జీర్ణించుకోలేక రెక్కింగ్ చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే 35శాతం ఓటింగ్ జరిగిందని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేశారని అంటున్నారని.. మరి టీడీపీ ఎమ్మెల్సీని కూడా అరెస్ట్ చేశారు కదా అని ప్రశ్నించారు. చట్టం తన పని తాను చేసుకుపోతోందని ఉద్ఘాటించారు. వైసీపీ లాగా తాము ధర్నాలు గొడవలు చేయడం లేదని చెప్పుకొచ్చారు. ప్రస్తుతానికి పులివెందులలో ఉప ఎన్నిక ప్రశాంతంగా నడుస్తోందని... ఈ ఎన్నికలో కూటమి కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు ప్రతిదాన్ని రాజకీయం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. చట్టాన్ని గౌరవించాలని... ఏకపక్షంగా రాజకీయం చేయటాన్ని ఎవరూ ఉపేక్షించరని హెచ్చరించారు మంత్రి డోల వీరాంజనేయ స్వామి. వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో వినూత్నమార్పులు తెస్తున్నామని నొక్కిచెప్పారు. పిల్లలకు వసతి, చదువు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన బియ్యం ఇచ్చే సమయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ మరువలేనిదని ఉద్ఘాటించారు. రూ. 143 కోట్లతో హాస్టళ్లను రిపేర్లు చేయిస్తున్నామని.. హాస్టళ్లకు రూ.100 కోట్లకు పైగా నిధులు కేటాయించామని గుర్తుచేశారు. హాస్టళ్లలో ఉన్న పిల్లలు ఎవరూ తక్కువ కాదని అన్నారు. హాస్టళ్లలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడించారు. వార్డెన్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ వర్క్ షాప్‌లో చర్చిస్తామని మంత్రి డోల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

## పోలీసుల కళ్లుగప్పి తప్పించుకున్న అవినాశ్

కడప,ఆగస్ట్12 : పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డిని ముందస్తు అరెస్టు చేసి కడపకు తీసుకెళ్లారు. ఈక్రమంలో వైకాపా కార్యకర్తలు ఎర్రగుంట్ల వద్ద వీరి వాహనాన్ని అడ్డుకున్నారు. అవినాష్‌రెడ్డి కూడలి వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసుల కళ్లుగప్పి ఎర్రగుంట్ల నుంచి అవినాష్‌రెడ్డి తన వాహనంలో వెళ్లిపోయారు. సింహాద్రిపురం వైపు వెళ్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఆయన్ను వెంబడించారు.

## నామ స్మరణమే.. శరణం!

ప్రపంచవ్యాప్తంగా భక్తులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. సర్వాకర్షకుడైన శ్రీకృష్ణుడి ఆవిర్భావ లీలనే కృష్ణాష్టమి. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భగవానుడి దివ్య ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ, ఆయన అపార కరుణను అనుభూతి చెందేందుకు ఒక మహత్తర అవకాశం. ఈ పవిత్ర దినం మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపి, భగవంతుడితో మన సనాతన సంబంధాన్ని గుర్తు చేస్తుంది. శ్రీకృష్ణుడి జననం సాధారణ శిశువుల వలె సంభవించినది కాదు. వాస్తవానికి ఆయన పుట్టుక లేనివాడైనప్పటికీ, తన అంతరంగిక శక్తితో ఈ లోకాన అవతరించడం భగవానుడి దివ్య లీలల్లో ఒకటి. దేవాదిదేవుడు, పరబ్రహ్మం, సర్వశక్తిమంతుడైన శ్రీకృష్ణుడు కేవలం ఆయన స్వీయ సంకల్పం మేరకే లోకంలో అవతరిస్తాడు గానీ, భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. మథురలోని కంసుడి కారాగారంలో దేవకీ వసుదేవులకు జన్మించినప్పుడు, శ్రీకృష్ణుడు శంఖ, చక్ర, గదా, పద్మాలతో చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. తల్లి దేవకి ప్రార్థన మేరకు ఒక సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడు అవతరించిన ఆ శుభ ఘడియలలో లోకమంతా ఆనందం, శాంతి నెలకొని, దిక్కులన్నీ ప్రసన్నమైనట్టు శ్రీమద్భాగవతం చెబుతుంది. అవతార లక్ష్యం.. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించేందుకు తాను యుగయుగాన అవతరిస్తానని శ్రీకృష్ణుడే స్వయంగా ప్రకటించాడు. అంతేగాక, ఆయన జీవితం, లీలలు, బోధనలు మానవాళికి గొప్ప సందేశాన్ని అందిస్తాయి. శ్రీకృష్ణుడు కేవలం ఏడేళ్ల వయసులో తన చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి, దానిని ఏడు రోజుల పాటు నిలబెట్టాడు. ఇది ఆయన అసాధారణ శక్తిని, మనం ఆయన్ని ఒక సాధారణ మానవుడిగా చూడకూడదని నిరూపిస్తుంది. ఆయన లీలలు ప్రాపంచిక మాలిన్యాలకు అతీతమైనవి. శ్రీకృష్ణుడి జననం, కర్మల దివ్యత్వాన్ని తెలుసుకున్నవారు ఈ భౌతిక ప్రపంచంలోకి తిరిగి రారు, శాశ్వత ధామాన్ని చేరుకుంటారు. మానవ జన్మకు అంతిమ లక్ష్యం భగవంతునితో ప్రేమపూర్వక సంబంధాన్ని పునరుద్ధరించుకోవడమే! భగవద్గీతలో శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన పరమ సందేశం 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (సమస్త ధర్మాలను త్యజించి నన్నే శరణు పొందు). ఇది మోక్షాన్ని పొందే అత్యంత సరళమైన మార్గం.



ఆధ్యాత్మికం

# కూల్చివేతలను అడ్డుకుంటే కేసులు నమోదు చేయించాలి

**- జిల్లా పంచాయితీ అధికారి జగదీశ్వర్**



**మానకొండూర్,ఆగస్టు12,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రాన్ని జిల్లా పంచాయితీ అధికారి జగదీశ్వర్ మంగళవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలను పరిశీలించి నిభందనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న సెల్లార్లపై యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేసి కూల్చివేతలను అడ్డుకునే వారిపై జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని పంచాయితీ కార్యదర్శి జున్నుతుల రేవంత్ రెడ్డికి జిల్లా పంచాయితీ అధికారి సూచించారు.

# తప్పుడు ఫిర్యాదులతో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** మంథని మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన శనిగల శ్రీనివాస్ తప్పుడు ఫిర్యాదు చేస్తూ రెవెన్యూ అధికారులను పోలీసులను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆయన తల్లి శనిగల సుశీల సోదరి రామిడి పద్మ పేర్కొన్నారు. మంగళవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనిగల సుశీల మాట్లాడుతూ తన భర్త శనిగల గంగయ్య ఇష్టపూర్వకంగానే కూతురుకు రూ. 42 లక్షలకు భూమి అమ్మడం జరిగిందని దానిని ప్రభుత్వ నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని దానిలో తాసిల్దార్ బండి ప్రకాష్ పాత్ర ఏమి లేదని ఆమె తెలిపారు. ఇప్పటికే నా నా భర్త పైన ఉన్న రెండు ఎకరాల భూమిని నా కొడుకు కోడలు పేరు పైకి మార్చుకున్నాడని వెంకటాపూర్ లో కట్టుకున్న ఇల్లును సైతం తన పేరు పైకి మార్చుకొని అమ్ముకున్నాడని ఆరోపించారు. తల్లిదండ్రులమైన మాకు మా కొడుకు శ్రీనివాస్ అన్నం పెట్టకపోవడం బాగోగులు చూసుకోక పోవడంతో గోదావరిఖని లోని మా కూతురు రామిడి పద్మ వద్ద ఆశ్రయం ముందుతుండగా అక్కడికి వచ్చి నా యొక్క బంగారం తాళిబొట్టు తీసుకెళ్లాడని, ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు అయిందన్నారు. గత నాలుగు నెలలక్రితం నా భర్తను ఇక్కడ నుండి తీసుకొని వెళ్లి ఆయనకు మాయమాటలు చెప్పి తప్పుడు ఫిర్యాదు చేపిస్తున్నాడని వాపోయారు, మా కుమారుడు శ్రీనివాస్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన పల్లాకుల నరసింహారెడ్డి, తోకల రమేష్, గుజ్జుల సత్యనారాయణ రెడ్డి ల సహకారంతో తప్పుడు ఫిర్యాదు చేస్తున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

# కరీంనగర్ బిసి కథనబేరి సభ వాయిదా

**- ఎమ్మెల్యే గంగుల కమలాకర్**




**మానకొండూర్, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఈనెల 14న బిఆర్ఎస్ ఆద్వర్యంలో నిర్వహించనున్న బిసి కథనభేరి సభ వాయిదా పడ్డట్టు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14తేది నుండి 17వరకు అతి భారీ వర్షాలు పడే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ సూచనలతో ప్రభుత్వ ముందస్తు హెచ్చరికల దృష్ట్యా బిసి కథనబేరిని వాయిదా వేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తదుపరి కథనభేరికి తేదీ నిర్ణయించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు వాయిదాపడ్డ విషయాన్ని గమనించాల్సిందిగా ఎమ్మెల్యే గంగుల ప్రకటన ద్వారా తెలిపారు.

# మంథనిలో తీవ్ర యూరియా కొరత

**- వేరే మందు బస్తా తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తాం**
**- ఫెర్టిలైజర్స్ యజమానుల ఇష్టారాజ్యం - చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు - అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న ఫెర్టిలైజర్ దుకాణాలపై చర్యలేవి**

**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** ఒకవైపు ప్రభుత్వం యూరియా కొరత లేదు అని స్పష్టం చేసినప్పటికీ పెద్దపెల్లి జిల్లా మంథని లో మాత్రం దీనికి విరుద్ధంగా నడుస్తుంది . మంథని లో ఉన్న అన్ని ఫెర్టిలైజర్స్ దుకాణాలలో యూరియా కొరత ఉందని రైతులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు . ఏదైనా ఒక మందుబస్తను లేదా గంట మందును తీసుకుంటేనే యూరియా బస్తా ఇస్తామని షాప్ యజమానులు చెబుతున్నారని ఆ మందుతో అవసరం లేకున్నా కేవలం యూరియా కోసమే ఆ మందు వేల రూపాయలు పెట్టి కొనవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కావలసిన రైతులు . గత్యంతరం లేక షాప్ యజమానులు చెప్పిన విధంగా కొంటున్నారు . జిల్లా మండల సంబంధిత అధికారులకు ఈ విషయం తెలిసినా కూడా షాప్ యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరతను ఉన్నట్లు సృష్టించి ఫెర్టిలైజర్స్ షాప్ యజమానులు లక్షల్లో ఆదాయం పొందుతున్నారు . ఫెర్టిలైజర్ షాపుల్లో నిల్వ ఉన్న యూరియాను కూడా అధిక ధరలకు విక్రయించడం వలన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం పడికాపులు కాస్తున్నారు ఇకనైనా రైతుల బాధను అర్థం చేసుకొని మంథనిలో యూరియా కొరత లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి బాధితులకు ఓ వరం లాంటిది..



**శామీర్ పేట, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఓ వరం లాంటిదని అర్హులైన వారు సద్వినియం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ప్రతి పేదవారు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగించుకోవాలని వారి ఆరోగ్యాన్ని కాపాడుతూ కుటుంబానికి అండగా ఉండే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సరసం మోహన్ రెడ్డి, వంగ వెంకట్ రెడ్డి, జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

# బి ఆర్ ఎస్ బీసీ గర్జనకు వేలాదిగా తరలి వెళ్దాం

**◆ పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**







**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బీసీ బిడ్డలుగా ప్రతి ఒక్కరు కరీంనగర్ లో ఈనెల 14న జరిగే బి ఆర్ ఎస్ పార్టీ బీసీ గర్జనకు తరలి వెళ్లాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి బి ఆర్ ఎస్ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల నియోజకవర్గస్థాయిలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గం నుండి వేలాదిగా కరీంనగర్ లో జరిగే బీసీ గర్జనలో పాల్గొనాలని, బీసీలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను ప్రజలందరికీ తెలియజెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బీసీ లకు ఇచ్చిన 42% రిజర్వేషన్ కోసం చిత్తశుద్ధితో లేదని, ఆర్డినెన్స్, ధర్నాలు అంటూ కాలం వెళ్లబుచ్చి, చివరకు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయ్యాక బీసీ రిజర్వేషన్లు సాధించుకుంటామంటూ చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. ఈ విధంగా బీసీలకు అన్యాయం చేసి వారి తప్పిదాలను, చేతగానితనాన్ని ప్రతిపక్ష పార్టీల పైకి నెట్టివేసే క్రమంలో తప్పుడు ప్రచారాలను బీసీ బిడ్డల్లోకి పంపిస్తుందని, గ్లోబల్ ప్రచారాలు చేస్తుందని, వాటిని తిప్పి కొట్టి వాస్తవాలను తెలియజెప్పే దిశలో బిఆర్ ఎస్ పార్టీ కరీంనగర్ బీసీ గర్జనకు పిలుపునిచ్చిందని, ఈ గర్జన కార్యక్రమానికి బీసీ బిడ్డలు పెద్ద ఎత్తున పెద్దపల్లి నియోజకవర్గం నుండి వేలాదిగా తరలివెళ్లి బీసీ గర్జనను విజయవంతం చేయాలన్నారు.గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారికంగా కాకున్నా, అనధికారికంగా 50 శాతానికి పైగా బీసీ బిడ్డలకు స్థానిక సంస్థల ఎలక్షన్ లో అవకాశం కల్పించిందన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గాలలో అన్ని కులాల వారికి అవకాశం తీసుకువచ్చిన ఘనత బి ఆర్ ఎస్ ప్రభుత్వానిదే అని కొనియాడారు. 50 సంవత్సరాలకే గౌడన్నలకు, చేనేత కార్మికులకు పెన్షన్ కల్పించిన ఘనత కేసిఆర్ గారి బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్నిదని పేర్కొన్నారు. యాదవులకు గొర్లు, ముదిరాజులకు చేప పిల్లలు, రజకులకు, నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్తు ఇలా అనేక కార్యక్రమాలను బీసీ బిడ్డల అభివృద్ధి కోసం తీసుకువచ్చింది బి ఆర్ ఎస్ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఇలా అన్ని విషయాలలో బీసీలకు ఎంతో ప్రాధాన్యత, మరోవైపు వారి అభివృద్ధి కోసం కార్యక్రమాలు బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేసిందని, కానీ దానిని చెప్పుకోలేదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈరోజు బీసీల కోసం ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయకున్నా కాంగ్రెస్ పార్టీ ప్రతిక్షణం అబద్ధాలతో, అసత్యాలు ప్రచారం చేస్తుందని, కానీ ఆనాడు బీసీల అభివృద్ధి కోసం చేసిన వాస్తవాలను కూడా ప్రచారం చేసుకోలేదన్నారు. వారు చేసిన అబద్ధాల గ్లోబల్ ప్రచారాలను ప్రజలు నమ్మి వారికి అవకాశం ఇస్తే, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తిరిగి అవే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ అబద్ధాల ప్రచారాలను ప్రజలందరికీ తెలియ చెప్పాల్సిన బాధ్యత బి ఆర్ ఎస్ కార్యకర్తలపైన ఉన్నదని పేర్కొన్నారు.ఆనాడు ఇచ్చిన ప్రతి జిల్లా కేంద్రంలో బీసీల కోసం ఒక పెద్ద కన్వెన్షన్ హాల్, స్టడీ సెంటర్ ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదు. గౌడ సోదరులకు ప్రతి గ్రామంలో 5 ఎకరాలు ఇచ్చి ఈతవనం పెట్టిస్తారని ఇచ్చిన హామీ, రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న హామీగానే పోయిందన్నారు. గతంలో ఈత చెట్లు బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా నాటామని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. యాదవ సోదరులకు గొర్రెల పంపిణీ కార్యక్రమం పట్టించుకోవడం లేదని, ప్రతి కులానికి పద్మశాలిలకు, గౌడ కులస్తులకు, నాయి బ్రాహ్మణులకు, విశ్వబ్రాహ్మణులకు, వడ్డెరలకు, రజకులకు, మున్నూరు కాపులకు, యాదవులకు, ముదిరాజులకు ఇలా అందరికీ కార్పొరేషన్ ఇస్తానని చెప్పిన ఎన్నికల హామీ ఇంత వరకు దాని ఊసే లేదన్నారు. ఇలా ఎన్నో హామీలను ఇచ్చి, రెండు సంవత్సరాలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని విషయాన్ని, ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అలాగే చాలా ముఖ్యంగా బీసీ సంక్షేమానికి సంవత్సరానికి 20వేల కోట్లు మంజూరు చేస్తానని చెప్పి , ఈ ప్రభుత్వం ఏర్పడి రెండవ సంవత్సరం పూర్తి అవుతున్న 20 పైసలు కూడా మంజూరు చేయలేదన్నారు. మహిళలకు ఇస్తానని చెప్పిన 2500, చేయూతలో పెంచుతానన్న చెప్పిన 4000 పెన్షన్ పూసే లేదన్నారు. రెండు సంవత్సరాల కాలంలో రెండు నెలల పెన్షన్ కూడా రాలేదని వృద్ధులు చెప్పడం శోచనీయమన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు రెండు లక్షల కోట్లు అప్పులు తెచ్చినా కానీ, ప్రజలకు ఇచ్చిన హామీలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదైతే మోసం చేసిందో, అబద్ధాలు చెప్పిందో, మభ్యపెట్టిందో ఈ వాస్తవాన్ని ప్రజలందరికీ బి ఆర్ ఎస్ నాయకులు తెలియజెప్పాలని పిలుపునిచ్చారు.

# ధర్మపురి ప్రెస్ క్లబ్ ఐజేయు అధ్యక్షునిగా మధు మహాదేవ్ ఎన్నిక





**ధర్మపురి, ఆగష్టు 12, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా మధు మహాదేవ్ శర్మ ను, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు కిషన్ లు ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణ%శీ%లోని స్థానిక కర్నె అక్కపెల్లి కళ్యాణ మండపంలో రాష్ట్ర నాయకులు జె.సురేందర్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ సంపాదకులు సంగనభట్ల రామకృష్ణయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోపాలచారి, ఆధ్వర్యంలో ఐ.జే.యు జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీటీ శ్రీనివాసరావు, సంపూర్ణ చారి మరియు కార్యవర్గ సభ్యుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ధర్మపురి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా మధుమహదేవ్, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు కిషన్ నమస్తే తెలంగాణ రూరల్ రిపోర్టర్, ఉపాధ్యక్షులుగా క్యాదాసు స్వామి జనం సాక్షి రిపోర్టర్, ముత్తినేని శ్రీనివాస్ బి ఆర్ కె న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ సహాయ కార్యదర్శిగా బాకీ రాజన్న (చందు) ది క్రైమ్ న్యూస్ రిపోర్టర్, అక్కినపల్లి బాబు కుమార్ నవతెలంగాణ రిపోర్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గడిపల్లి వెంకన్న పవర్ రిపోర్టర్, కోశాధికారిగా కర్నే సంతోష్ క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ రిపోర్టర్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మధు మహదేవ్ శర్మ మాట్లాడుతూ యూనియన్ నియమ నిబంధనలు అనుసరించి జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం అహర్నిషలు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం హరికృష్ణ ,అల్లేరాము, హైదర్ అలీ, కోశాధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సహాయ కార్యదర్శి రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పవిత్ర, శంకర్ గౌడ్, ధర్మపురి ప్రెస్ క్లబ్ సభ్యులు పాత శ్రీనివాస్, బొంగురాల రాజేష్, చిలువేరి సురేష్, ముప్పట్ల రాజేందర్, కస్తూరి ప్రవీణ్, బత్తిని సంపత్, కొండా వినయ్ కుమార్, రాజారపు నరేష్, చీటి సతీష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# మంథని మండల టీ.ఎల్.ఎమ్ మేళా ప్రారంభం

**- టీ.ఎల్.ఎమ్ మేళా ను మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** మంథని మండల ప్రాథమిక స్థాయి లో భోధించే ఉపాధ్యాయు లచే ఏర్పాటు చేసిన టీ.ఎల్.ఎమ్ మేళా ను మంథని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కొత్త శ్రీనివాస్ ప్రారంబించారు. ఈ సందర్భంగా మంథని మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తాము తయారు చేసిన భోదనాభ్యసన ఉపకారణాలను ప్రదర్శించారు. తదుపరి జరిగిన కార్యక్రమంలో అతిథులు గా విచ్చేసిన వారు మాట్లాడుతూ మంథని మండలంలో ఉపాధ్యాయులు తయారుచేసిన బోధనాభ్యాసన పరికరాల మేళా ప్రదర్శన చాలా బాగుందని, మండల విద్యాశాఖ చాలా కృషి చేస్తూ మండలంలో ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తుందని అన్నారు. కార్యక్రమానికి పరిశీలగులుగా విచ్చేసినటువంటి అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిఎం షేక్ మాట్లాడుతూ టిఎల్ఎం తయారీ ని చూస్తే ఇక్కడ ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఎంతగా కృషి చేస్తున్నారు తెలిసిపోతున్నదని కొనియాడారు.ఈ సందర్భంగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సభ్యులు శశిభూషణ్ కాచే, ఆర్టిఓ సభ్యులు మంథని సురేష్, మండల విద్యాధికారి దాసరి లక్ష్మి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన పాఠశాలలకు బహుమతి ప్రధానం నిర్వహించారు. బెస్తపల్లి, ఎరుకల గూడెం, చిన్న ఓదాల, భీమ్రావుపేట్, ఖాన్ సాయి పేట, మఠం వీధి, అక్కేపల్లి, బాలికల ప్రాథమిక పాఠశాల జెబీఎస్,ఉప్పట్ల ప్రాథమిక పాఠశాలలకు కార్యక్రమం విజేతలుగా బహుమతులు లభించాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు జె సురేష్ కుమార్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, డిఆర్పి ప్రవీణ్, మండల రిసోర్స్ పర్సన్లు ఎర్రం రమేష్, ఈర్ల రమేష్,కోట లక్ష్మణ్, మద్ది రాము, నారమల్ల లక్ష్మణ్,సునీత, బిగ్ చంద్ర శేఖర్, లోకే రాజ్ పవన్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉంది

## ◆ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**శామీర్ పేట కలెక్టరేట్, ఆగస్టు-12 (ది క్రైమ్ న్యూస్):** మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడం మీ చేతుల్లోనే ఉందని, మీరు లక్ష్యాన్ని ఏర్పరచుకొని అందుకు క్రమశిక్షణ, ప్రణాళిక బద్దంగా కార్యచరణతో బాగా కష్టపడుతూ ఇష్టంగా చదివి సాధించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా విద్యార్థులకు బోధించారు. మంగళవారం మేడ్చల్ మండలం కిష్టాపూర్లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ మీ కలలను నిజం చేసుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవడానికి మీరు బాగా కష్టపడి చదవాలని, అందుకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వారి సబ్జెక్టుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకొని, వారికి అవసరమైన మార్గనిర్దేశ సూచనలు తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీలో మీకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగారు, విద్యార్థులు స్పందిస్తూ కంప్యూటర్లు, ల్యాబ్ కావాలని తెలుపగా, అదనపు కలెక్టరు తప్పకుండా సమకూరుస్తామని తెలిపారు. స్కూల్, కాలేజీ మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, అన్ని సౌకర్యాలు ఉన్నాయా ఏమైనా మరమ్మత్తులు



అవసరమా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న%శీ%, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని అదనపు కలెక్టరు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, ప్రిన్సిపల్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** బిజెపి జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం బిజెపి పెద్దపల్లి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకొని, తిరంగా ర్యాలీ నిర్వహించారు. యాత్ర చీకరాయిలో ప్రారంభమై భోజన్నపేట, హనుమంతునిపేట, ధర్మాబాద్ ,ముత్తారం ,గౌరెడ్డిపేట ,రాఘవపురం మీదుగా పెద్దపల్లి వరకు సాగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ భారత సాయుధ దళాల పట్ల పౌరుల కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచే రాజకీయేతర ఉద్యమంల దేశవ్యాప్తంగా చేపడుతున్న తిరంగా యాత్రను పెద్దపల్లి మండలంలో నిర్వహించడం జరిగిందని అన్నారు. జాతీయ పతాకం చేత పట్టుకొని,దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల పట్ల గౌరవాన్ని వ్యక్తపరిచే విధంగా ఈ యాత్ర కొనసాగిందన్నారు. ఈ యాత్ర మండల స్థాయిలో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో యాత్రను సమ్మిళితంగా, శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించామని అన్నారు. భారత సైనికుల సేవలను గౌరవించేందుకు బిజెపి కార్యకర్తలు,జాతీయవాదులు ఈ యాత్రలో చురుకుగా పాల్గొని దేశభక్తిని చాటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలరపు పర్వతాలు, సీనియర్ నాయకులు తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్రావు, జిల్లా కౌన్సిల్ నెంబర్ కావెటి



రాజగోపాల్, మేకల శ్రీనివాస్, ఈర్ల శంకర్, మండల ఉప అధ్యక్షులు సబ్బు మల్లయ్య, మెడగొని శివయ్య, కార్యదర్శులు రెడ్డి శ్రీకాంత్, శిలారపు మహేష్, మేకల తిరుపతి పడాల శ్రీనివాస్ పడాల వీరేశం బుర్ర సదానందం,పూరెల్ల రాజేశం, బోదాసు అంజి, తాళ్ల సతీష్, గుడ్ల సతీష్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ముంజ రాజేందర్, ఆనందరావు, వేల్పుల సురేందర్, వేల్పుల హరీష్, నక్క శ్రీనివాస్, లింగయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

# గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసును సీబీఐకి బదిలీ చేసిన సుప్రీం కోర్టు..

**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** గట్టు వామనరావు దంపతుల హత్య కేసుపై సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ)కి అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని మంగళవారం ఆదేశించింది. ఈ క్రమంలో.. హత్య కేసును తిరిగి విచారణ జరపాలని, పిటిషనర్ కు భద్రత కల్పించాలని సీబీఐకి సూచించింది. హైకోర్టు లాయర్లైన వామనరావు, ఆయన సతీమణి నాగమణి దంపతులను పెద్దపల్లి జిల్లా మంథనిలో 2017 ఫిబ్రవరి 17వ తేదీన రోడ్డుపైనే కొందరు దారుణంగా హతమార్చారు. ఈ జంట హత్య తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ కేసులో పలువురిని అరెస్ట్ చేయగా.. ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. అయితే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని వామనరావు తండ్రి కిషన్ రావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కె. సింగ్ల ధర్మాసనం పిటిషన్ను విచారించి.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అలాగే హత్యకు సంబంధించిన నోటీసులు జారీ చేసింది. అలాగే హత్యకు సంబంధించిన వీడియోలు, పత్రాలు అందజేయాలని ఆదేశించింది. సీబీఐ విచారణ అవసరమా? అనే అంశంపై రికార్డులు పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తెలిపింది. ఈలోపు.. కేసును సీబీఐకి అప్పగించేందుకు తమకు ఎలాంటి



అభ్యంతరం లేదని తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది తెలిపారు. దీంతో.. సీబీఐకి కేసును బదిలీ చేస్తున్నట్లు సుప్రీం కోర్టు ఇవాళ ఆదేశాలు జారీ చేసింది.

# నిషేధిత ప్లాస్టిక్ సంచులను వాడితే ట్రేడ్ లైసెన్సు రద్దు

**- నగర పాలక సంస్థ రామగుండం**



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్న దుకాణదారులకు రామగుండం నగర పాలక సంస్థ జరిమానా విధించింది . మంగళ వారం రామగుండం నగర పాలక సంస్థ అధికారులు మేడిపల్లి సెంటర్ లో నిర్వహించిన తనిఖీలలో ఒక చికెన్ సెంటర్ తో పాటు ప్రక్కనే ఉన్న మరో బేకరీలో నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నట్టుగా గుర్తించి నిర్వాహకులకు చెరో వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులను వినియోగించడం పునరావృత్తమయితే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ తనిఖీలలో రామగుండం నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం , జూనియర్ అసిస్టెంట్ శంకర్ స్వామి, వార్డు అధికారులు శ్యామ్ , అభినవ్, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ ,సానిటరీ జవాన్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులకు పట్టుబడ్డ ల్యాండ్ సర్వేర్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ల్యాండ్ సర్వే రిపోర్ట్ కోసం లంచం డిమాండ్ చేసి రైతు వద్ద నుంచి పదివేల రూపాయలు ఫోన్ పే ద్వారా పుచ్చుకున్న ల్యాండ్ సర్వేయర్ ను అవినీతి అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. పెద్దపల్లి తాహసిల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ సునీల్ భూమి సర్వే చేసి పంచనామ ఇవ్వ ఇవ్వడానికి బాధితుని వద్ద



నుండి తన అసిస్టెంట్ అయిన ప్రైవేట్ సర్వేయర్ రాజేందర్ ద్వారా 10 వేల రూపాయలు ఫోన్ పే ద్వారా పుచ్చుకోగా మంగళవారం కరీంనగర్ ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కస్టడీలోకి తీసుకొని విచారణ చేపట్టారు. అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే నిర్భయంగా తమను సంప్రదించాలని ఏసీబీ డిఎస్పి విజయ్ కుమార్ సూచించారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నాము

**- గట్టు వామన్ రావు కేసులో అసలు దోషులకు శిక్ష పడాలి**

**- సీబీఐ విచారణలో అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర బయటపడాలి**

**- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అడ్వకేట్ గట్టు వామన్ రావు దంపతుల హత్య కేసు విచారణను సీబీఐకి అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్వాగతించారు. ఇది న్యాయ వ్యవస్థపై ప్రతి ఒక్కరికీ నమ్మకం కలిగించిందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో అసలు దోషులు, వారికి సహకరించిన అప్పటి ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడితేనే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. మంథనిలో నడిరోడ్డుపై అడ్వకేట్ వామన్ రావు దంపతులు హత్యకు గురైతే అప్పటీ బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని విమర్శించారు. నిష్పక్షపాతంగా విచారణ చేయకుండా అసలు దోషులను కాపాడిందన్నారు. కుమారుడు, కోడలిని కోల్పోయిన ఆ వృద్ధ తల్లిదండ్రులకు న్యాయం చేయాల్సిన అప్పటి ప్రభుత్వ పెద్దలు విచారణను తప్పుదోవ పట్టించి అసలు హంతకులను కాపాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని ప్రజా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ కోరినా పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో కీలకమైన న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. చివరకూ న్యాయమే గెలుస్తుందన్నారు.



# త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ పై అవగాహన



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్) :** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం డ్రీమ్, స్టార్ట్, రైజ్ సంస్థ ప్రతినిధులు త్రీడి ప్రింటింగ్ టెక్నాలజీ పై అవగాహన కల్పించారు. మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇండస్ట్రియల్ సెక్టార్ వంటి అంశాల పైన అవగాహన కల్పించడం జరుగుతుందని సంస్థ వారు పేర్కొన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. త్రీడీ ప్రింటింగ్ ఎలా పనిచేస్తుందో విద్యార్థుల మాటల్లో వారు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, డ్రీమ్, స్టార్ట్, రైజ్ సంస్థ ప్రతినిధులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# మంథని కరాటే విద్యార్థుల ప్రతిభ






**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** జాతీయస్థాయి కరాటే పోటీలలో మంథనికి చెందిన జపాన్ షిటోరియా కరాటే విద్యార్థులు ప్రతిభ చాటినట్లు శిక్షకులు కావేటి సమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పోటీలలో అండర్ 17 విభాగంలో ఎండి తైబా వెండి పతాకం, అండర్ 14 విభాగంలో పోగుల శివ సాకేత్, బండారి మణికంఠ, కొండ రిషి కాంస్య పతాకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను జపాన్ షిటోరియా ఇండియా అధ్యక్షుడు, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు భరత్ శర్మ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ శిఖోకాయి రిప్రెసెంటివ్ పాలకుర్తి పాపయ్య, తెలంగాణ కార్యనిర్వాహన అధ్యక్షుడు గుంటుపల్లి సమ్మయ్య, మల్యాల రామస్వామి, ఇన్స్ట్రక్టర్ నాగలి రాకేష్, జడల శివాని, కావేటి శివ గణేష్, మెట్టు హాసిని, శ్వేత నందన, హర్షిని, హర్షవర్ధనులు అభినందించారు. ఉచిత కరాటే శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆసక్తిగల విద్యార్థులు 9848503412 ను సంప్రదించగలరని ఆయన కోరారు.

## ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

**శామీర్ పేట, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా మంగళవారం ముగిశాయి. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీగాయత్రీ మహాక్షేత్రంలో రాఘవేంద్రస్వామి 354వ ఆరాధనోత్సవాలు ఆలయ వ్యవస్థాప కులు, వాక్ బ్రహ్మ డాక్టర్



ఎస్వీ ఎల్ ఎన్. మూర్తి అధ్వర్యంలో కన్నుల పండువగా జరిగాయి. కర్నాటక రాష్ట్రం బెంగుళూరు నుంచి వేదబ్రాహ్మణులు వచ్చి గత మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జన, పాల పంచామృతాభిషేకం, పాదపూజ, కనకాభిషేకం, తులసి అర్చన, హస్తోదకము, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం పల్లకీ సేవ, రథోత్సవం, అష్టావధాన సేవ, కుష్మాండ్ బలి మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. స్వామివారి ఆరాధన ఉత్సవాలకు ఆలయ ట్రస్టు సభ్యులు, మండలంతో పాటు నగరం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# నిర్మాణాలను పరిశీలిస్తూ బిల్లులు ఆలస్యం కాకుండా చూడాలి

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**



**తిమ్మాపూర్, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ ఎండీ కాలనీలోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఇండ్ల నిర్మాణాల ప్రగతి వివరాలను తెలుసుకుని నిర్మాణాలు చేపట్టని వారికి రద్దు చేసి ఇతరులకు ఇండ్లు కేటాయించి నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కాకుండా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఎంపీడీవోలు వి.వరలక్ష్మీ, జి.కృష్ణప్రసాద్, వి.సురేందర్, డి.శ్రీనివాస్, కె.ప్రవీణ్,వై.శశికళ ఆయా మండలాల హౌసింగ్ ఏ.ఈలు, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# భూమి కబ్జా చేసి బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తమ భూమిని కబ్జా చేసి భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సలిగంటి రామలక్ష్మి పోలీస్ అధికారులను కోరారు. మంగళవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణం కమాన్ ప్రాంతంలో తనకు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో నిర్మాణం చేపట్టగా బొంకూరి రవీందర్ ప్రోద్బలంతో అతని సోదరుడు బొంకూరి రాజేందర్ కూల్చివేసి సామగ్రి ఎత్తుకెళ్ళారని ఆరోపించారు. ఈనెల 10న మాపై దౌర్జన్యానికి పాల్పడ్డ సదరు వ్యక్తులపై 100కి ఫోన్ చేసి పెద్దపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసినట్లు రామలక్ష్మి వాపోయారు. తనతో పాటు అనేక మంది భూములు కబ్జాకు పాల్పడ్డారని, వారి నుండి రక్షణ కల్పించి న్యాయం చేయాలని పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో లక్ష్మి, విజయ, కమల, లక్ష్మి, నూరుబీ, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హనుమంతు గౌడ్ ఆర్థిక సహాయం అందజేత

**- కల్వచర్ల గ్రామంలో బిజెపి నాయకుడు బత్తిని నరసయ్యను కోల్పోవడం చాలా బాధాకరం**



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు బత్తిని నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులు భార్య స్వరూప, కుమారుడు రజనీకాంత్ ను పరామర్శించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హనుమంతు గౌడ్ అనంతరం మాజీ ఎంపీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షులు మొల్మూరి శ్రీనివాస్ వారి కుటుంబ ఆర్థిక పరిస్థితినీ వివరించగా వెంటనే స్పందించిన మెరుగు హనుమంతు 10,000/- ఆర్థిక సహాయం చేయడం జరిగింది. అనంతరం బీజేపీ కార్యకర్తల పార్టీ అని, వారి శ్రేయస్సు కు ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని తెలిపారు, కల్వచర్ల గ్రామంలో బిజెపి నాయకుడు బత్తిని నరసయ్యను కోల్పోవడం చాలా బాధాకరం వారి ఆత్మ శాంతికి చేకూరాలని, ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యావంతుల వేదిక చైర్మన్ కదరి కళాధర్ రెడ్డి, బీజేపీ నాయకులు దొంతుల సురేష్, గుండా శంకరయ్య, తాళ్లపల్లి కృష్ణ గౌడ్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు సురేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి

**- బిఎస్పి పెద్దపల్లి జిల్లా ఇంఛార్జి పెగ నరేష్**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** గ్రామ స్థాయి నుండి బహుజనులు ఏకం చేసి బీఎస్పీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ పెద్దపల్లి జిల్లా ఇంఛార్జి పెగ నరేష్ పిలుపునిచ్చారు. బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా సమీక్ష సమావేశం మంగళవారం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఇంఛార్జి నరేష్ జిల్లాలో బీఎస్పీ పార్టీ పరిస్థితులను అసెంబ్లీ, సెక్టార్, బూత్ స్థాయి కమిటీల రిపోర్ట్ ను పరిశీలించారు. కమిటీలు లేని ప్రాంతంలో కార్యకర్తలను సమావేశపర్చి కమిటీలను నియమించాలని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించుకోవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు పూర్తి రుణమాఫీ చేయడంలో, సన్న రకాల వరి ధాన్యానికి ఇవ్వాల్సిన రూ 500 బోనస్ హామీలను పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. బిసి ప్రధాని అని చెప్పుకునే నరేంద్ర మోడీ దేశంలో బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలలో జనాభా లెక్కలప్రకారం సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, రామగుండం అసెంబ్లీ ఇంఛార్జి జింక ఉదయ్, అసెంబ్లీ అధ్యక్షుడు జనగామ లింగయ్య, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, పెద్దపల్లి పట్టణ అధ్యక్షురాలు రామిల్ల శారద, నాయకులు జనగామ అంజయ్య, పల్లికొండ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలు కూల్చే అవకాశం ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని..

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. అధికారులు పర్యవేక్షణలో ఉంటారని.. - మేడ్చల మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**శామీర్ పేట కలెక్టరేట్, ఆగస్టు-12 (ది క్రైమ్ న్యూస్) :** హైదరాబాద్‌లో రాబోయే 3 రోజులు, అంటే ఆగస్టు 13 బుధవారం నుండి ఆగస్టు 15 శుక్రవారం వరకు, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలకనుగుణంగా హైదరాబాద్ లోని ఉత్తర ప్రాంతాలు (మేడ్చల్ జిల్లా, సైబరాబాద్ ప్రాంతం మొదలైనవి) ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని మేడ్చల మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. హైదరాబాద్ లోని ఇతర ప్రాంతాలలో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 10/15 సెం.మీ కంటే ఎక్కువ, కొన్ని చోట్ల 20 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నది. కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి మరియు రాబోయే 3 రోజులు వాహనాల రాకపోకలను తగ్గించుకోవాలని. లోతట్టు ప్రాంతాల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్

**• ఖనిలో ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ దినోత్సవ వేడుకలు • విద్యార్థులకు అండ ఏఐఎస్ఎఫ్ జెండా • ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**



**గోదావరి ఖని టౌన్ (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక మార్కండేయ కాలనీలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్యఅతిథిగా హాజరై శ్వేత-అరుణ పతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ భారతదేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘమని,స్వాతంత్రం రాకపూర్వమే 1936 ఆగస్టు 12న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని, లక్నో నగరంలోని బెనారస్ యూనివర్సిటీలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య పురుడోసుకున్నదని, కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏదైనా ఉన్నదంటే అది ఒక్క ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘమే అని, నాటి నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పాఠశాలలలో కళాశాలలలో మౌలిక సదుపాయాల కల్పించాలని, పెండింగ్ లో ఉన్నటువంటి స్కాలర్షిప్ ,ఫీజు రీయింబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలను ధరలకు అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని, గురుకుల విద్యార్థులకు సొంత భవనాలను కేటాయించాలని అనేక సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్న ఏకైక సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన అన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం ఏఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులను విజయవంతం చేయాలని, విద్యార్థులకు అండ, ఏఐఎస్ఎఫ్ జెండా ఎల్లప్పుడూ ఉంటదని ఆయన అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మొలుగూరి నితిలేష్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్, గొడిసెల ప్రణీత్, తడిగొప్పుల సాయి అనుప్, కట్ల అభినయ్, రౌతు విదిష తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలకు తగు జాగ్రత్తలు.. ప్రజలతో అవగాహన సదస్సు..

**• శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్**

శామీర్ పేట, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్): వినాయక చవితి సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా శామీర్ పేట వినాయక చవితి కమిటీతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్. మంగళవారం వినాయక చవితి సందర్భంగా శామీర్ పేట మండలంలోని ప్రజలకు, వినాయక విగ్రహాలు ప్రతిష్టించే వారికి అవగాహన పోలీస్ స్టేషన్ మీటింగ్ హాల్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మండపాలు నిర్మించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ తీగలు, కరెంట్ స్తంభాల విషయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వినాయక చవితి అనేది ఒక విశిష్టమైన పండుగ, పండుగ జరుపుకునే సమయంలో ఇతరులకు అసౌకర్యం కలగకుండా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మట్టితో తయారు చేసిన గణపతులను ప్రతిష్టించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోలీసు వారి సహకారం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్ కి లేదా 100 నంబరుకు ఫోన్ చేయాలని ప్రజలకు తెలియజేశారు. పండుగను సుఖసంతోషాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడమే మన అందరి బాధ్యత బాధ్యతాని తెలిపారు. అనంతరం మేడ్చల్ డిజిపి కోటిరెడ్డి శామీర్ పేట పెద్ద చెరువును పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట మండల ప్రజలు, ఎస్ఐలు దశరథ్, శశివర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.






# హిందువుల ఆలయాల జోలికొస్తే ఎవరినీ వదిలిపెట్టం

**- హిందూవాహిని నేత సాయి**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణాలో హిందువుల ఆలయాలపై జరుగుతున్న దాడుల తీవ్రంగా ఖండిస్తున్నామని హిందూవాహిని జిల్లా ఉపాధ్యక్షుడు ఉయ్యంకార్ సాయి అన్నారు. భాగ్యనగరము లోని బంజారాహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయాన్ని ధ్వంసం చేసినందుకు నిరసంగా ఇచ్చిన ధర్నా పిలుపుమేరకు హైద్రాబాదు వెళ్తున్న హిందూవాహిని నాయకులను పెద్దపల్లి పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ, తెలంగాణా రాష్ట్రంలో హిందువుల ఆలయాలపైనే దాడులు జరగడం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది పథకం ప్రకారం జరుగుతున్న కుట్రగా అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో హిందువుల ఆలయాలపై ఇన్ని దారుణాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టిపట్టనట్టు వ్యవహరించడం కాంగ్రెస్ పార్టీ ద్వంధనీతిని బహిర్గత చేస్తోందని ఆరోపించారు. హిందూ ఆలయాల జోలికి వస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి హిందువుల ఆలయాలకు రక్షణ కల్పించాలని, దాడులకు పాల్పడే వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని సాయి డిమాండ్ చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పసిలేటి వెంకట్ సాయి, ప్రవీణ్, వంశీ, తదితరులు ఉన్నారు.

## సుప్రీంకోర్టు ఉత్తర్వులు స్వాగతిస్తున్నాం



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** న్యాయవాద దంపతుల హత్య కేసు విచారణను సిబిఐ కి అప్పగిస్తున్నట్లు తీర్పు వెలువడిన నేపథ్యంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని మంథని పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది శశిభూషణ్ కాచే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. న్యాయ వాద దంపతుల హత్య కేసు విచారణ ను సుప్రీంకోర్టు సిబిఐ కి అప్పగింస్తూ జారీ చేసిన ఉత్తర్వులను స్వాగతిస్తున్నమని, సిబిఐ విచారణలో వాస్తవ విషయాలు వెలుగులోకి వస్తాయని ఆయన తెలిపారు. కుట్ర దారులను బయటకు తీసి న్యాయ వ్యవస్థ పై నమ్మకం కలిగి, బాదిత కుటుంబాల సంఖ్యని న్యాయం జరుగుతందని ఆశిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# సర్వాయి పాపన్న విగ్రహఆవిష్కరణ విజయవంతం చేయాలి



**తొర్రూరు, (ది క్రైమ్ న్యూస్):** ఈనెల ఆగష్టు16వతేదిన మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో జరగనున్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ విజయవంతం చేయాలని గౌడ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. తొర్రూరు మండలం కేంద్రంలో జరిగిన సమావేశంలో గౌడ నాయకులు పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలు ఆవిష్కరించి గౌడ యువజన సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొర్రూరు గౌడ యువజన సంఘం కమిటీ ఎన్నిక జిల్లా ప్రధాన కార్యదర్శి గా పబ్బాల. రాము గౌడ్ గౌరవఅధ్యక్షులు- మాచర్ల. వెంకన్నగౌడ్ అధ్యక్షులు- బొమ్మెర.వినోద్ గౌడ్ ప్రధానకార్యదర్శి- బొమ్మగాని.ప్రవీణ్ గౌడ్ ఉపాధ్యక్షులు-చీకటి.దీలిప్ ఉపాధ్యక్షులు-కుర్ర.నరేష్ ఉపాధ్యక్షులు-నలమాస.సంపత్ కోశాధికారి-దీకోండ.శ్రీనివాస్ తొర్రూరు టౌన్ కమిటి అధ్యక్షులు- బొమ్మగాని. మనోజ్ గౌడ్ ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ యువజన సంఘం సలహాదారులు గండి.వీరేందర్ గౌడ్, గుదే.వీరన్న గౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు నలమాస. సాయిగౌడ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బండి.దీపక్ గౌడ్ గోపా తొర్రూరు డివిజన్ అధ్యక్షులు తాళ్ళపల్లి.రమేష్ గౌడ్ తొర్రూరు గోపా మండల అధ్యక్షులు యాకన్న గౌడ్ తొర్రూరు మండల ముఖ్య నాయకులు, గౌడ సంఘం నాయకులు యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు పడే అవకాశం ఉంది..

**- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని..**
**- తుంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి**



**శామీర్ పేట, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అత్యవసరం పరిస్థితుల్లోని బయటకు వెళ్లాలని తుంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి తెలిపారు. మంగళవారం తెలంగాణలో వాతావరణ శాఖ తెలిపిన విధంగా తెలంగాణలో, హైదరాబాద్, హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో మూడు రోజులు పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, అధికారులు సూచనల మేరకు అత్యవస పరిస్థితిలోనూ బయటకు వెళ్లవలసిందిగా కోరారు. అధికారులు మీకు అండగా ఉంటారని తుంకుంట మున్సిపల్ ఆఫీస్ కు పోలీస్ స్టేషన్ కు అవసరమైతే ఫిర్యాదు చేయాలని తెలిపారు.

# బాల్యం నుండే కె.ఎల్ మహేంద్ర జాతీయోద్యమం వైపు ఆకర్షితుడు




**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** ఆర్.జి -1 ఏరియా సెంటినరీ కాలనీ లోని కే.ఎల్ మహేంద్ర భవన్ లో కే.ఎల్ మహేంద్ర 18 వ వర్ధంతి సభను ఎం ఆర్ సీ రెడ్డి ఆధ్వర్యంలో ఆగస్టు 12 న కె.ఎల్ మహేంద్ర వర్ధంతి సందర్భంగా ఈ మీటింగ్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.జి -1 ఏరియా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై వి రావు , సెంట్రల్ సెక్రెటరీ జూపాక రామచందర్ హాజరు కావడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.జి -1 ఏరియా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై వి రావు పాల్గొని విజయవంతం చేసిన ఆర్.జి -1 ఏరియా కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, ఏఐటీయూసీ నాయకుడు కె.ఎల్. మహేంద్ర 1922 నవంబర్ 25న ప్రస్తుతం తెలంగాణ రాజధానిగా ఉన్న హైదరాబాద్‌లో జన్మించారు, అప్పట్లో నిజాం రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఆయన తండ్రి ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ కె.ఎల్ మహేంద్రకు కేవలం రెండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడే మరణించారు.ముగ్గురు సోదరులు ఒక సోదరితో కె.ఎల్ మహేంద్ర ఉండేవారు.బాల్యం నుండే మహేంద్ర జాతీయోద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. అతని గురువు శ్రీ చంద్రశేఖర్ శుక్లా స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రేరేపించాడు. తొమ్మిదవ తరగతిలోనే మహేంద్ర గాంధీ పత్రిక 'హరిజన్' చదివి అతని రచనలతో బాగా ప్రభావితమయ్యాడు. అతను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరినప్పుడు నిజాం 'వందే మాతరమ్' పాడటాన్ని నిషేధించాడు.ఉస్మానియాను వదిలి కె.ఎల్. మహేంద్ర శాంతి నికేతన్‌లో చేరిన తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో వాతావరణం చాలా అణచివేతగా మారింది .శాంతి నికేతన్‌లో ఆయనకు మార్క్సిస్ట్ సాహిత్యం, కమ్యూనిస్ట్ నాయకులతో పరిచయం ఏర్పడింది. తరువాత ఆయన రాజకీయ కార్యకలాపాల కారణంగా శాంతి నికేతన్‌ను విడిచిపెట్టి బర్ద్వాన్ కళాశాలలో చేరాల్సి వచ్చింది. అక్కడ ఆయన హరేకృష్ణ కోణార్క్ , బెనోయ్ చౌదరిని సంప్రదించి సిపిఐ లో చేరారు. తరువాత బెనోయ్ చౌదరి ఆయనను కార్మిక సంఘాలను నిర్వహించడానికి అసన్ సోల్ కు పంపారు.అక్కడ ఆయన స్టీల్ వర్కర్స్ యూనియన్‌ను నిర్వహించారు. ఆయన జనరల్ సెక్రటరీ ఎన్నికై. చాలా సంవత్సరాలు అదే పదవిలో కొనసాగారు. దీనితో పాటు మహేంద్ర అసన్ సోల్ వచ్చిన ఒక సంవత్సరంలోనే రెండు యూనియన్‌లను నమోదు చేశాడు జూలై 1946లో హైదరాబాద్ కి తిరిగి వచ్చాక కె.ఎల్. మహేంద్ర దాదాపు ప్రతి రోజూ రెండు, మూడు యూనియన్లను స్థాపించేవారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి జరిగిన పోరాటంలో పాల్గొన్నారు. జాతీయ చర్చలో భూమి సమస్య ప్రముఖంగా హైలైట్ అయినప్పటికీ, సైన్యం 5,000 మందికి పైగా కమ్యూనిస్ట్ సాయుధ కార్యకర్తలను చంపగలిగింది. పెద్ద సంఖ్యలో పోరాట కార్యకర్తల నష్టం చివరకు నాయకత్వం సాయుధ పోరాటాన్ని ముగించడానికి దారితీసింది1946లో జరిగిన హైదరాబాద్ అఖిల భారత సమావేశంలో కె.ఎల్. మహేంద్ర హైదరాబాద్ రాష్ట్ర ఏఐటీయూసీ కార్యదర్శులలో ఒకరిగా ఎన్నికైన వెంటనే కె.ఎల్. మహేంద్ర 30 కి పైగా యూనియన్లను ఏర్పాటు చేశారు.మహేంద్ర ఎ. పి ఏఐటీయూసీ కార్యదర్శిగా చురుకుగా ఉన్న కాలంలో, రైల్వేలలోని యూనియన్లను బలోపేతం చేశారు. దీనితో పాటు, ఏఐటీయూసీలో 40,000 కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో, బొగ్గు గనుల సంఘాలలో 60,000 కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న యూనియన్లను వారు నిర్మించారు. 1970 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు శాసన మండలికి ఎన్నికయ్యి 1982 వరకు కొనసాగారు. 1982లో కె.ఎల్. మహేంద్ర సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షునిగా,1996 నుంచి 2001 వరకు ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా 1999 లో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షునిగా పని చేశారు., దీనితో పాటు మహేంద్ర హోటల్ కార్మికులను వ్యవస్థీకరించి హోటల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడయ్యాడు. దక్షిణాదిన ఉన్న కార్మికులను కలుపుకుని సినిమా వర్కర్స్ యూనియన్‌ను కూడా నిర్వహించాడు. 1960లలో అతను కొత్తగా ఉద్భవిస్తున్న ఇంజనీరింగ్ పరిశ్రమలలో కార్మిక సంఘాలను స్థాపించాడు. వైజాగ్‌లో స్టీల్ ప్లాంట్‌ను తెరవడానికి కృషి చేశారు.పారిశ్రామిక వివాద చట్టం ని మార్చడానికి సంజీవ రెడ్డి చేసిన ప్రయత్నాలకు వ్యతిరేకంగా కూడా ఆయన పోరాటం చేశారు. తన స్నేహితుడు ముఖ్యమంత్రి అంజయ్య ద్వారా ట్రేడ్ యూనియన్లలో ఎన్నికలకు 'రహస్య బ్యాలెట్' వ్యవస్థను గుర్తించడం ద్వారా. భారతదేశంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు చట్ట ప్రకారం రహస్య బ్యాలెట్ ద్వారా జరిగే ఏకైక రాష్ట్రం అప్పటి ఆంధ్రప్రదేశ్ మాత్రమే. 1970 నుండి 1978 వరకు కె.ఎల్ మహేంద్ర పి.డబ్ల్యూ.డి కార్మికులు, మున్సిపల్ కార్మికులు, కనీస వేతన పోరాటం, షాప్ ఎంప్లాయీస్ కార్మికులు అనేక ఇతర యూనియన్ల రాష్ట్రవ్యాప్త సమ్మెలకు నాయకత్వం వహించారు. 1987లో కె.ఎల్ మహేంద్ర ఢిల్లీ ఏఐటీయూసీ కేంద్రానికి మారారు. అప్పటి నుండి సరళీకరణ వల్ల ఏర్పడిన ఉద్యోగ తొలగింపుల కారణంగా కార్మికులపై పడుతున్న ప్రభావానికి వ్యతిరేకంగా కార్మికులను సమీకరించారు. తన పదవీకాలంలో హింద్ మజ్దూర్ సభతో ఐక్యతను తీసుకురావడానికి ప్రయత్నించారు కానీ సాధ్యం కాలేదు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆరు ప్రధాన జాతీయ స్థాయి సమ్మెల నాయకత్వం వహించారు.. 2001 సంవత్సరంలో సింగరేణి బొగ్గు గనుల సమ్మె కాలంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమ్మెల వలన సింగరేణి నష్టాలు వస్తున్నాయని కనుక సమ్మె చేస్తే బొగ్గు గనులు మూసి వేస్తామని చెబితే ఆనాడు కె.ఎల్. మహేంద్ర సంస్థ లాభాలు వస్తే లాభాలలో 10%వాటా కార్మికులకు ఇస్తామని ఒప్పందం చేసుకొని దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థల్లో లేని లాభాల వాటా హక్కు సాధించిన మహనీయుడు. ఈయన చివరకు 2007 ఆగస్టు 12 న తుది శ్వాస వదిలారు.నేడు సింగరేణిలో పని చేస్తూన్న కార్మికులు అనుభవిస్తున్న లాభాల వాటా కె.ఎల్.మహేంద్ర కృషి ఫలితమే అని గమనించాలనీ అన్నారు. ఈ కార్యక్రమనికి హాజరై న బ్రాంచి సెక్రెటరీ ఎం ఆర్ సీ రెడ్డి , సీ హెచ్ పి ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ , ఓసీపీ-టు బేస్ వర్క్ షాప్ పిట్ సెక్రటరీ అమరగొండ పోశం,ఆర్.జి -1 ఏరియా వివిధ గనుల పిట్ సెక్రటరీలు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్స్,సేఫ్టీ కమిటీ మరియు మైన్స్ కమిటీ మెంబర్స్, టెంపుల్ కమిటీ క్యాంటీన్ కమిటీ మెంబర్స్,ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహం





**భూపాలపల్లి, ఆగస్టు -12:(ది క్రైమ్ న్యూస్):** మంగళవారం భూపాలపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన అశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

మొదటగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలోని రోగుల హాజరు పట్టిక, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి జరుగుతున్న వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవసరమైన వ్యాక్సిన్లు, ఇతర మందులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం ప్రక్కనే ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులు గైర్హాజరు కావడం, పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కారణం లేకుండా గైర్హాజరు కావడం, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ లకు తాళాలు వేసి ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి యొక్క లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని బాగా చదవాలని సూచించారు. విద్యార్థి లక్ష్య సాధనకు 10వ తరగతి మొదటి మెట్టు అని ప్రతి విద్యార్థి బాగా చదవాలని, మంచి మార్కులు సాధించాలని సూచించారు. వంటగదిని పరిశీలించి భోజనం ఏవిధంగా ఉందో పరిశీలించారు. స్టోర్ రూమ్ లో సానులు భద్రపరచడానికి అవసరమైన ర్యాక్ లు అందిస్తామని తెలిపారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వార్డెన్ ను ఆదేశించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్ఓ శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ నాగరాజు, ఆర్.ఐ రామస్వామి, హాస్టల్ వార్డెన్ సమ్మయ్య, డాక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - జమ్మికుంట పట్టణ సీఐ. ఎస్ రామకృష్ణ గౌడ్



**జమ్మికుంట ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జమ్మికుంట పట్టణ సీఐ ఎస్. రామకృష్ణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణం, మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన హౌసింగ్ బోర్డ్ కాలనీ, నాయి చెరువు పరిసర ప్రాంతాల్లో నివాసముండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మండల కేంద్రానికి ఆనుకొని ప్రవహిస్తున్న మానేరు పరివాహక ప్రాంతలు అయినా విలాసాగర్, తనుగుల, వావిలాల గ్రామాల్లో నివాసముండే ప్రజలు, మత్స్యకారులు ఎవరు కూడా చేపల వేటకు వెళ్లవద్దని ప్రజలను కోరారు.భారీ వర్షాల నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండి ప్రమాద స్థాయికి చేరుతాయని ప్రజలందరూ వర్షాలను దృష్టిలో పెట్టుకొని నది పరివాహక ప్రాంతాలకు, చెరువులు కుంటలు పొంగే ప్రాంతాలకు ప్రజలు ఎవరు కూడా వెళ్లకూడదని సిఐ ఎస్ రామకృష్ణ గౌడ్ ప్రజలకు సూచించారు.

# సిఎం మర్యాద పూర్వకంగా కలిసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి, ఆగష్టు 12(క్రైమ్ న్యూస్):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి సిఎం నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు.. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేసారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి అనేక పెట్టుబడులు.. పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తూ తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న సీఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంత్రికి వినతి పత్రం అందజేసిన ఆత్కూరి శ్రీకాంత్

## - సిపిఎం పార్టీ మండల కార్యదర్శి



**భూపాలపల్లి/కాటారం/ఆగస్టు -12:(ది క్రైమ్ న్యూస్):** కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో సహజ వరులు అయినటువంటి మట్టి ఇసుక అక్రమంగా దోపిడి చేసి ప్రభుత్వ ఆదాయాన్ని గండి కొడుతూ ప్రజల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆకుకూరి శ్రీకాంత్ ఐటీ మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఇప్పటివరకు కిందిస్థాయి నుంచి హ్యూమన్ రైట్స్ కమిషన్ వరకు వినతులు అందజేసిన ఫలితం లేకపోయిందని, అక్రమంగా దోపిడికి గురవుతున్న మట్టి, ఇసుక తవ్వకాలకు అధికారులు సహకరిస్తున్నారని, తక్షణమే అక్రమ తవ్వకాలకు పాల్పడ్డ వ్యక్తులపై అదేవిధంగా స్పందించని అధికారులపై పూర్తిస్థాయి సమగ్ర విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని, మంత్రిని కోరారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దానికోసం మరియు కాటారం సబ్ డివిజన్ కేంద్రంగా వంద పడకల ఆసుపత్రి, డిజిటల్ లైబ్రరీ, మినీ స్టేడియం సకల సౌకర్యాలు ఉండే విధంగా స్కిల్ కోచింగ్ సెంటర్లతోపాటు విద్యా రంగాన్ని అభివృద్ధి చేసే విధంగా ఎడ్యుకేషనల్ హబ్ ను ఏర్పాటు చేసి, కాటారంను అభివృద్ధి పథంలో నడిపించే విధంగా చొరవ తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

# అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు





**ధర్మపురి, ఆగష్టు 12, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామివారి ఆలయంలో అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయంలోని అనుభంద దేవాలయం అయిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానంలో గల గణపతికి గణపతి ఉపనిషత్ లతో అభిషేకం, హారతి మంత్రపుష్పం కార్యక్రమములు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో దేవస్థానం ట్రస్ట్ బోర్డు అద్యక్షులు జక్కు రవీందర్, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు బొల్లారం పోచయ్య, గుడ్ల రవీందర్, రాపర్తి సాయికిరణ్, సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, స్థానిక వేదపండితులు మధు రామ శర్మ, కాకెరి గోపాల్ శర్మ, జనుమంచి రాములుశర్మ, అర్చకులు విశ్వనాథ శర్మ, బొజ్జ సంతోష్ కుమార్, బొజ్జ రాజగోపాల్, ద్యావళ్ల సాయికుమార్, అదిక సంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది

## - అధికారులు అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - రాబోయే 2 రోజుల పాటు అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో పాటించాల్సిన అప్రమత్తత పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు.రానున్న 2 రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పెద్దపల్లి జిల్లాలో ఆగస్టు 13,14 తేదీలలో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు.అత్యంత వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరులలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జర్గకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# మానకొండూర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు




**మానకొండూర్, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలో జిల్లా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈమధ్య కాలంలో కొందరు ఇండ్లను కిరాయికి తీసుకుని నేరాలకు పాల్పడుతున్న నేపధ్యంలో వీధుల్లో తిరుగుతూ అద్దెకుంటున్న వాళ్ళ వివరాలు, వాహనాలను తనిఖీ చేసి నెంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తూర్పు దర్వాజ వద్ద గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆన్లైన్ మోసాలతో జనవరి నుండి జూన్ వరకు రాష్ట్ర వ్యాప్తంగా 55వేల సైబర్ కేసులు నమోదవగా 41వేల మంది 171కోట్ల డబ్బులు పోగొట్టుకున్నారని, యువత అత్యాశతో ఆన్లైన్ ద్వారా తెలియని వ్యక్తిని నమ్మి డబ్బులు పోగొట్టుకుని ఆత్మాహత్యలకు పాల్పడు తున్నారన్నారు. అకౌంట్లు అద్దెకు తీసుకుని పెట్టుబడుల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారని, లోన్ ఆప్ లలో వ్యక్తి గత సమాచారాన్ని ఇవ్వకుండా చరవాణిని ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుంటూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గ్రామాల్లోని కొందరు యువత గంజాయికి అలవాటు పడి విచక్షణను కోల్పోవడమే కాక అనారోగ్యాల పాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులకు, ఊరికి చెడ్డపేరు తెచ్చే విధంగా కాకుండా భవిష్యత్తులో ఉన్నతంగా ఎదిగేందుకు మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముగింపుగా గంజాయి నిర్మూలనపై విద్యార్థులు, యువకులందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిఐలు బి.సంజీవ్, సదన్ కుమార్, నిరంజన్ రెడ్డి, పుల్లయ్య, బిల్లా కోటేశ్వర్, శ్రీలత ఎస్ఐలు స్వాతి, రాజు సైబర్ క్రైమ్ సిబ్బంది అనిల్, స్థానిక పోలీస్ సిబ్బంది,ఏఆర్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



# ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉంది

- అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన ఎపిఎ జి.యం.అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు

**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** పని గంటలు పెంచుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా అడ్రియాల లాంగ్ వాల్ గని నందు మంగళవారం నిర్వహించిన అవగాహణ కార్యక్రమాన్ని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, పని గంటలు పెంచుతూ భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని అన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని, కావున ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు. అంతే కాకుండా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకిత భావంతో పని చేయాలని అన్నారు. భద్రత పట్ల అశ్రద్ధ వహించకుండా అధికారులు, సూపర్వైజర్లు సంబంధిత ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి సక్రమంగా పని చేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఏ ఇతర ప్రభుత్వ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగు తుందని, కావున ఉద్యోగులందరూ దీనిని గమనించి, సమిష్టి కృషితో నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుతూ సంస్థను మరింత ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. ఈ సమావేశంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడానికి రూపొందించిన ప్రణాళికల గురించి సంబంధిత అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా సంస్థ అభివృద్ధికి సంబంధించి పలువురు ఉద్యోగులు ఇచ్చినటువంటి సలహాలు, సూచనలను సంబంధిత అధికారులు స్వీకరించారు. ఇట్టి అవగాహన కార్యమాన్ని అన్ని బదిలీ(షిఫ్ట్) లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వివరించారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ఏరియా ఇంజనీర్ కె.యాదయ్య, ఎస్వోటుజియం బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్ధన్, ఐఈ డిజియం కె.చంద్రశేఖర్, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మేనేజర్ సునీల్ కుమార్, సీనియర్ పి.రాజేశం ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేతకానితనానికి నిదర్శనం

- మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

**ఇల్లంతకుంట, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో రైతులకు యూరియా సరఫరా చేయాలని బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు మంగళవారం ధర్నా నిర్వహించారు. సిద్ధం వేణు మాట్లాడుతూ..... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలైనా రైతుల హామీలు నెరవేర్చకుండా రైతులను ఆగం చేసి రైతుభీమా ప్రీమియం కూడా చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కోటి ఎకరాలకు సాగునీళ్లిస్తే కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టును పడావుబెట్టి రైతులకు సాగునీళ్లివ్వడం లేదని ఆరోపించారు. సమైక్యాంధ్రలో యూరియా కోసం చెప్పులు,బుక్కులు లైన్లలో పెడితే రేవంత్ రెడ్డీ పాలనలో చేతకానితనానికి నిదర్శనంగా పోలీసు పహారాలో యూరియా బస్తాలు తీసుకునే పరిస్థితి వచ్చిందని,వారానికోసారి ఢీల్లి వెళ్లి వస్తున్నాడే తప్ప రైతులకు బస్తా యూరియా తీసుకురాలేదని, ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే రైతులకు యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూరియా కొరత లేదని,సరిపడా నిల్వలున్నాయంటూ అదికారులు రాత్రికి రాత్రే ప్రకటన చేయడం హాస్యాస్పదంగా ఉందని, కొరత లేకుంటే రాత్రి,పగలు తేడా లేకుండా యూరియా కోసం రైతులు లైన్లు ఎందుకు కడుతున్నారని ప్రశ్నిస్తూ జిల్లా వ్యవసాయ అధికారి బస్తాకు కొంత కమీషన్లు తీసుకుని డీసీఎంఎస్,ఆగ్రోస్ వాళ్లకు యూరియా కేటాయిస్తుండగా ప్రయివేట్ వ్యాపారులు యూరియాతో ఇతర మందులు అంటగట్టి రైతులను నిండా ముంచుతుంటే విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇంత జరుగుతున్నా రైతుల సమస్యలు తెలుసుకోవడంలో జిల్లా కలెక్టర్ శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. యూరియా కొరతపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తూ రైతు ప్రభుత్వమని చేప్పుకునే స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి పార్టీ సీనియర్ నాయకులు ఒగ్గు నర్సయ్య,కెవిఎన్ రెడ్డి, కముటము రాములు, బిళ్ళవేని పరశు రాములు, ఉడతల వెంకన్న, బొల్లం వెంకటేష్, వోల్లాల రవీందర్ గౌడ్, కేశవేణి శ్రీనివాస్ యాదవ్, పట్నం శ్రీనివాస్, కూనబోయిన రఘు, ఆకుల శ్రీనివాస్,సిద్ధం నరసయ్య, భాస్కర్ రెడ్డి, ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, అంతగిరి భాస్కర్, మహేందర్,రవీందర్ రెడ్డి, నరసయ్య, పిల్లి వేణు,గుంటి మధు, బుర్ర బాలకిషన్, దయ్యాల మహేష్ ఎండి సమీర్, గొడుగు హరికుమార్,, మీసం శ్రీనివాస్ యాదవ్, కుంభం రాజు, రాజేందర్, రంగు నరేష్ గౌడ్, పండుగు అర్జున్,పండుగ వేణు తదితర నాయకులు పాల్గొన్నారు.



# ఇరు గ్రామాల్లో రగులుతున్న భూ సమస్యను పరిష్కరించండి

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని జూగుండ్లతో పాటు సరిహద్దు గ్రామమైన గన్నేరువరం మండలం గోపాల్ పూర్ గ్రామాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మహేశ్వర్, జిల్లా సర్వే, భూరికార్డులశాఖ సహాయ సంచాలకులతో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి మంగళవారం సందర్శించి సమస్యత్మాకమైన 8ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ.... గోపాలపూర్‌లో రైతుకు, దళితులకు మధ్య భూవివాదం చాలా ఏళ్లుగా కొనసాగుతుందని, 178 సర్వే నెంబర్‌లో దళితులకు చెందిన 8 ఎకరాల భూమి రికార్డుల్లో తప్ప మోఖాపై లేక భూములు ఆక్రమణలకు గురై దళితులు ఆందోళన చెందుతున్నారన్నారు. భూమి విషయంలో ఇరు గ్రామాల్లో రగులుతున్న భూ సమస్యను పరిష్కరించే విధంగా 8 ఎకరాల కొలతలు,హద్దులు తేల్చేలా భూ సర్వే చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చాలా కాలంగా ఉన్న భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, గన్నేరువరం తహసీల్దార్ జె.నరేందర్, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు మామిడి అనిల్ కుమార్, బుధారపు శ్రీనివాస్, రెడ్డిగాని రాజు, ఉప్పులేటి రాజు, ఉప్పులేటి సతీష్, బాలయ్య, హసన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది గడిచినా కాని రుణమాఫీ స్వాహ నేనా ..

## - బ్యాంకర్ల నిర్లక్ష్యంతో వర్తించని రుణమాఫీ - బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా బేగంపేటలోని కేడీసీసీ బ్యాంక్ ఎదుట స్థానిక రైతులు ఆందోళనకు దిగారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితమే విడతలుగా మంజూరు చేసిన రుణమాఫీ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో అర్హులైన కొందరు రైతులకు అందకుండా పోయింది. దీంతో ఆగ్రహించిన రైతులు రామగిరి మండలంలోని కేడీసీసీ బ్యాంక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సుమారు యాభైయ్ మూడు మంది రైతులకు రుణమాఫీ బకాయిలు అందలేదు. పలుమార్లు రైతులు బ్యాంకు చుట్టూ తిరిగినా బ్యాంక్ అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహించిన రైతులు బ్యాంకు ముందు నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అన్ని బ్యాంకుల్లో రుణమాఫీ వర్తిస్తే కేవలం బ్యాంక్‌లోనే రైతులకు ఎందుకు రుణమాఫీ వర్తించదు అని ప్రశ్నించారు. ఏడాది క్రితమే ప్రభుత్వం ప్రకటించిన పంట రుణ మాఫీ ఇప్పటికీ అమలు కాకపోవడంతో బ్యాంక్ ఎదుట బైఠాయించారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులు వసూలు చర్యలు ప్రారంభించాయని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంకా 53 మంది రైతులకు సంబంధించిన రూ. 1.54కోట్లు మాఫీ కావాల్సి ఉందన్నారు. సకాలంలో వర్షాలు కురువక బీడు పడిన పొలాలు, పంటల నష్టాలతో అప్పుల భారంలో ఉన్న సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం అన్యాయం అని విమర్శించారు. తక్షణమే రుణమాఫీ అమలు చేసి, వసూలు చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చేవరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. రైతుల ఆందోళన సమాచారం తో రామగిరి పోలీసులు చేరుకొని రైతుల రుణ మాఫీ విషయమై బ్యాంకు అధికారులను ఆరా తీశారు. తమకు రుణమాఫీ అయినా బ్యాంకు అధికారుల తప్పిదం వల్ల జాప్యం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీ పథకం అర్హులైన రైతులకు అందడం లేదు. సాంకేతిక కారణాలతో పాటు ఆధార్‌కార్డుల్లో పేర్లలో, బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం వల్ల, ఇతర తప్పులు రావడంతో అర్హులకు రుణమాఫీ అందడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీల ఫోరమ్ అధ్యక్షులు మురుమూరు శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నాయిని చెరువులో పడి వ్యక్తి మృతి..



**జమ్మికుంట, ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువులో మతిస్థిమితం లేని వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు జమ్మికుంట పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే జమ్మికుంట పట్టణంలో నివాసము ఉండే మహమ్మద్ జబ్బర్ (64) బహిర్భూమి కోసం ఇంటి నుండి బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు నాయిని చెరువులో పడి మృతి చెందినట్లు మృతుడి బంధువు మహమ్మద్ ఇమ్రాన్ వచ్చి ఫిర్యాదు చేశాడు. మృతుడికి మానసిక పరిస్థితి బాగాలేదని తెలుపగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# పుష్కర ఘాట్ సత్వరంగా అయ్యేలా చర్యలు తీసుకోండి

## - ముస్త్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య- నాగరాజు



**రామగిరి ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):** రామగిరి మండలంలోని ముస్త్యాల గ్రామ శివారులో గల గోదావరి వద్ద పుష్కర ఘాట్ నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలి అని ముస్త్యాల గ్రామ తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు లలిత్ కుమార్‌ను కోరారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామ సమీపంలో పుష్కర ఘాట్ టెండర్ కోసం ఆర్.జి-వన్ జి ఎంను కలవడం రామగిరి లావణ్య నాగరాజు మంగళవారం కలిశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఆర్జి-వన్ జి ఎం లలిత్ కుమార్‌ను కలవడం తెలిపారు. ముస్త్యాల గ్రామానికి చెందిన పుష్కర ఘాట్ పనులకోసం గత మూడు నెలల క్రితం ముస్త్యాల గ్రామానికి పుష్కర ఘాట్ కోసం కలవగా సివిల్ డిపార్ట్ మెంట్ వాళ్లను పంపి ఎస్టిమేషన్ చేయడం జరిగింది అని లావణ్య పేర్కొన్నారు. పుష్కర ఘాట్ పనులు మొదలు పెట్టలేదు కావున పుష్కర ఘాట్ పనులు మొదలు పెట్టాలని జిఎం లలిత్ కుమార్ కోరారు. జి ఏం సానుకూలంగా స్పందించి ఎస్టిమేషన్ చేసి కొత్తగూడెం టెండర్ కోసం పంపామని కొత్తగూడెం నుండి ఫైలు తిరిగి రాగానే పనులు మొదలు పెట్టడం జరుగుతుందని జీ ఏం లలిత్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమం లో పెద్దపల్లి జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జక్కుల యాదగిరి, కొండ్రా అంజయ్య పాల్గొన్నారు.

# తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఆవిర్భావ సభ ..



**ఇల్లందకుంట ఆగస్టు 12 (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి (టిఎంపిఎస్) ఆవిర్భావ సభను హైదరాబాదులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజరాబాద్ నియోజకవర్గం నుండి బండి మల్లేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 4 మండలాల నుండి ముదిరాజ్ కుల బాంధవులను ఆవిర్భావ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బండి మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ అందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి ముదిరాజ్ లకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయడానికి తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి ఏర్పాటు అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ .శ్రీకాంత్, ఏ .కుమార్, ఆర్ .నాగయ్య, లక్ష్మయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన 21మందికి కోర్టు జరిమానా

**ఇల్లంతకుంట, ఆగస్టు 12,(ది క్రైమ్ న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 21 మందికి మంగళవారం కోర్టు జరిమానా విధించింది. కోర్టు కానిస్టేబుల్ జీవన్, తిరుపతి లు పట్టుబడిన వారందరిని కోర్టులో ప్రవేశపెట్టగా సిరిసిల్ల రెండవ తరగతి మేజిస్ట్రేట్ జయశ్రీ అందరికీ జరిమాన విధించినట్లు ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# అంగరంగ వైభవంగా “అంగారక చతుర్థి” వేడుకలు

## - గణనాథున్ని దర్శించుకుని పునీతుడైన భక్తులు

**రామగిరి, ఆగస్టు 12(ది క్రైమ్ న్యూస్):-** శ్రీ గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. అంగారక సంకష్టహర చతుర్థి సందర్భంగా మంగళవారం గణనాథుని ఆలయాలు భక్తులతో పండుగ వాతావరణం నెలకొంటుంది. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయని శాస్త్రాల్లో చెప్పబడింది. కొత్తగా చతుర్థి దీక్ష తీసుకునేవారు అంగారక చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయష్కారం. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలను అధికమించడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష చేపట్టడం అనాదిగా పాటిస్తున్న నియమం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీవిఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో21 ప్రదక్షిణాలు చేసిమోదకులు ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గణపతికి ఇష్టమైన వారం మంగళవారం అలాగే నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలన్న మంగళవారం వచ్చే అంగారక చతుర్థి రోజున “ఓం గం గణపతియై నమః “ అని స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది ఏడాదిలో ఒకసారిమంగళవారం వచ్చే చతుర్థి ని అంగారక అంటారు. ఈ రోజున రాత్రి 9 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. ఈరోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్నీ తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడంఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# విశ్వజి



## ఇలా కాపాడుకోండి

సాధారణంగానే మహిళల్లో పోషకాహర లోపం ఎక్కువగా కనిపిస్తుంది. అది ఎప్పుడూ వివిధరకాల సమస్యలకు కారణమవుతూనే ఉంటుంది. పోషకాల్లో ఒక్కో విటమిన్ ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది. అందువల్ల అన్ని పోషకాలు మనిషికి అవసరమే. దాంట్లో విటమిన్–డి అనేది ఎముకల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. విటమిన్–డి లోపిస్తే ఎముకలు బలహీనపడి 'ఆస్టియోమలాషియా' సమస్య వస్తుంది. అంతేకాదు, ఇది ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో ఆస్టియోపోరోసిస్ సమస్యకు దారితీసి.. ఎముకలు గుల్లబారుతాయి. చిన్న గాయం కావడంతోనే విరిగిపోతుంటాయి. ఈ సమస్యలు పురుషుల కంటే మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ప్రకారం, విటమిన్–డి లోపం వల్ల మహిళల్లో తీవ్రమైన సమస్యలు వస్తాయట. నడి వయసు దాటిన మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ హార్మోన్ తక్కువగా ఉంటుంది. ఫలితంగా ఎముకలు పటుత్వం కోల్పోతూ ఉంటాయి. ఇదే కాకుండా జీవనశైలిలో మార్పుల వల్ల కూడా మహిళల్లో విటమిన్–డి లోపిస్తుంది. ఫలితంగా అలసట, కండరాల బలహీనత, ఎముకల్లో నొప్పి (ముఖ్యంగా నడుము, కాళ్లు), డిప్రెషన్, రోగనిరోధక శక్తి తగ్గి తరచూ జలుబు, జ్వరం రావడం, జుట్టు రాలడం, గాయాలు త్వరగా తగ్గకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. విటమిన్–డి లోపించకూడదు అంటే.. ప్రతిరోజూ ఉదయం కొంతసేపు శరీరానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. రోజూ కాకపోయినా రెండు రోజులకు ఒకసారి 15–30 నిమిషాలు సూర్యోదయం వేళ ఎండలో కూర్చుంటే మంచిది. అలాగే తినే ఆహారంలో విటమిన్–డి ఉండే ఫ్యాటీ ఫిష్ (సాల్మన్), గుడ్డు పచ్చసొన, ఫోర్టిఫైడ్ పాలు, పప్పు ధాన్యాలు తీసుకోవాలి. యూవీ కిరణాలు పడేచోట సాగు చేసిన పుట్టగొడుగుల్లో కూడా విటమిన్–డి ఉంటుంది. వీటితో పాటు 50 ఏళ్లు దాటిన మహిళలు వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్లు తీసుకోవాలి. వీటితో పాటు క్యాల్షియం పుష్కలంగా ఉండే ఆహారం తీసుకుంటూ, బరువులతో కూడిన వ్యాయామం చేయడం ద్వారా విటమిన్–డి లోపాన్ని ఎదుర్కోవచ్చు.




## ఈ ఆసనాలతో డయాబెటిస్ ముప్పు దూరం - ఎన్నో ఫలితాలు..!!

యోగా. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుంది. దీర్ఘ కాలిక రోగాలకు పరిష్కారం చూపుతోంది. నిత్యం యోగా చేయటం ద్వారా షుగరు వంటి సమస్యలు నియంత్రణలో ఉంటాయి. డయాబెటీస్ ఒకసారి వచ్చిందంటే నయమయ్యేది కాదు. డయాబెటీస్ కు యోగా ఎంతగానో తోడ్పడుతున్నట్లు రిసెర్చ్ లు వెల్లడించాయి. యోగాలోని ఆసనాలతో షుగరు తో పాటుగా అనారోగ్య సమస్యలు ఎన్నో దూరం అవుతాయి. డయాబెటీస్ రావటానికి అనేక కారణాలు ఉన్నాయి. అందులో మానసిక ఒత్తిడీ ప్రధాన కారణంగా ఉంది దీంతో సింపథెటిక్ నాడీ వ్యవస్థ, అడ్రినల్ గ్రంథి ఉత్తేజితమై రక్తంలోకి గ్లూకోజు ఎక్కువగా విడుదలవుతుందని, కణాల్లోకి గ్లూకోజు వెళ్లేలా చేసే ఇన్సులిన్ హార్మోన్ పనితీరు అస్తవ్యస్తం గా మారుతుంది. ఈ క్రమంలో క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతకు తోడ్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆసనాలతో కండరాలకు రక్త సరఫరా పెరుగుతుందని, అంతేకాకుండా ఇన్సులిన్ గ్రాహకాల వ్యక్తీకరణ ఇనుమడించటం వల్ల గ్లూకోజును బాగా స్వీకరిస్తాయి. ప్రాణాయామం, ధ్యానం వంటి వాటితో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. యోగాలో ధ్యానంతో పాటుగా ఎన్నో రకాల ఆసనాలు శరీరానికి మేలు చేస్తాయి. యోగాలో వేసే త్రికోణాసనం షుగరు వ్యాధి గ్రస్తులకు ప్రయోజన కరంగా ఉంటుంది. అదే విధంగా చక్రాసనం ఆరు సార్లు చేయటం ద్వారా మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. పది నిమిషాల పాటు శవాసనం అవసరం. ఇందులో ప్రశాంతంగా వెల్లకిలా పడుకోవాలి. కళ్లు మూసుకొని పాదాల దగ్గర నుంచి తల వరకూ ఒక్కో అవయవం మీద దృష్టి సారిస్తూ అవన్నీ బాగా విశ్రాంతి పొందుతున్నట్లు భావించాలి. ఇక.. సూర్య నమస్కారాలు 12 దశల్లో చేయాలి. సూర్య నమస్కారాల్లో ప్రణామ, హస్తోత్థావ,



హస్తపాద, అశ్వసంచాలన, దండ, అష్టాంగ నమస్కార, భుజంగ, అదోముఖస్వాన, అశ్వ సంచాలన, హస్తపాద, హస్తోత్థావ, ప్రణామ ఆసనాలను ఒక క్రమపద్ధతిలో చేయాలి. అర్ధమత్స్యేంద్రాసనం, పవన ముక్తాసనం, భుజంగాసనం, పాదచక్రాసనం, ధనురాసం వంటివి చేయటం ద్వారా శరీరానికి ఆరోగ్య పరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఇక 5 సార్లు భస్త్రిక చేయాలి. ఇందులో నాలుగు సార్లు శ్వాసను వీలైనంత వేగంగా తీసుకొని, వదిలిపెట్టాలి. ఆ తర్వాత ఒకసారి గాఢంగా శ్వాస తీసుకొని, నెమ్మదిగా వదలాలి. ఇలా ప్రతీ ఆసనం.. భంగిమ శరీరంలో ఒక్కో అవయవానికి మేలు చేస్తుంది.

### రోజూ అసలు ఎన్ని జామకాయలను తినాలి..?

## వీటి వల్ల కలిగే లాభాలు ఏమిటి..?



జామకాయలు అంటే చాలా మంది ఇష్టంగానే తింటారు. కొందరు జామకాయలను తింటే కొందరు జామ పండ్లను తినేందుకు ఆసక్తిని చూపిస్తారు. జామకాయలు కొద్దిగా దోరగా, పులుపు, తీపి రుచుల కలయికలో ఉంటాయి. జామ పండ్లు తియ్యగా ఉంటాయి. జామ కాయలను లేదా పండ్లను వేటిని తిన్నా ఆరోగ్యకరమైన ప్రయోజనాలే కలుగుతాయి. జామకాయలను తినడం వల్ల లాభాలు కలుగుతాయని చాలా మందికి తెలుసు. కానీ రోజుకు ఎంత మోతాదులో వీటిని తినాలి.. అని చాలా మంది సందేహిస్తుంటారు. అయితే ఇందుకు పోషకాహార నిపుణులు ఏమని సమాధానం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. 100 గ్రాముల జామ కాయలు లేదా పండ్లను రోజూ తినవచ్చు. అంతకు మించితే జీర్ణ సమస్యలు వస్తాయి. ఇక జామకాయలను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. అనేక పోషకాలు మన శరీరానికి లభిస్తాయి. డయాబెటిస్ ఉన్నవారికి.. జామకాయలు లేదా పండ్లను పోషకాలకు నెలవుగా చెప్పవచ్చు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల వీటిని తింటే పోషకాహార లోపం తగ్గుతుంది. ఈ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గేలా చేస్తుంది. రోగాలు రాకుండా చూస్తుంది. జామ పండ్లను తినడం వల్ల ఫైబర్ అధికంగా లభిస్తుంది. దీని వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. షుగర్ ఉన్నవారికి జామ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని తింటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవచ్చు. ఈ కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల వీటిని తింటే రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. పైగా ఈ కాయల్లో ఉండే ఫైబర్, విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. అందువల్ల జామకాయలను తరచూ తింటుంటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె ఆరోగ్యానికి.. జామకాయల్లో పొటాషియం, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రిస్తాయి. రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. ఈ కాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న కారణంగా వీటిని తింటే చర్మం సంరక్షించబడుతుంది. సూర్యకాంతి నుంచి చర్మం సురక్షితంగా ఉంటుంది. ఆక్సీకిరణ ఒత్తిడి తగ్గిపోతుంది. ఫలితంగా వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం యవ్వనంగా మారి కాంతివంతంగా కనిపిస్తుంది. జామకాయల్లో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ కాయలను తింటే గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. రోగ నిరోధక వ్యవస్థకు.. జామకాయలను తినడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. జామకాయలను తింటే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. దీంతో నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. జామ కాయల్లో తెలుపు, పింక్ రంగులో ఉండే కాయలు ఉంటాయి. అయితే పింక్ రంగులో ఉండే కాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. ఇది కంటి చూపును మెరుగు పరచడంతోపాటు రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా జామ కాయలు లేదా పండ్లను రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# మార్కెట్

## బ్యాంకులకు ఆ స్వేచ్ఛ ఉన్నది

### కనీస నగదు నిల్వల పెంపుపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

గోజారియా(గుజరాత్) : బ్యాంకు ఖాతాల్లో కనీస నగదు నిల్వలపై రిజర్వు బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని, దీనిపై రిజర్వు బ్యాంక్ నియంత్రణ ఏదీ ఉండదని స్పష్టంచేశారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ.50 వేల వరకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న ప్రస్తుత తరుణంలో ఆయన పై విధంగా స్పందించారు. కనీస బ్యాలెన్స్ ఎంత ఉండాలనే నిర్ణయం ఆర్బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ.10 వేలు, మరికొన్ని బ్యాంకులు రూ.2 వేలుగా నిర్ణయిస్తుంటాయి. ఇటీవల ఐసీఐసీఐ బ్యాంక్ తన పొదుపు ఖాతాల్లో నగదు నిల్వలను ఐదింతలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో రూ.10 వేలుగా ఉన్న కనీస నగదు నిల్వలను రూ.50 వేలకు పెంచింది. కానీ, కొన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు కనీస నగదు నిల్వలపై పరిమితులను ఎత్తివేశాయి. యువతకు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత చాలా కీలకమన్నారు. మునుపు చదువుకోకపోతే అభివృద్ధి చెందరని చెప్పేవారు.. కానీ నేటి యుగంలో డిజిటల్ అక్షరాస్యత విషయంలోనూ ఇదే పరిస్థితి అన్నారు.



## అమెరికా-చైనా మధ్య ట్రేడ్ డీల్‌కు మరో 90 రోజులు విరామం



రష్యా చమురు కొనుగోలును కారణంగా చూపి భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీస్థాయిలో ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. న్యూఢిల్లీపై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు. ప్రస్తుతం 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చింది. ఆగస్టు 27 నుంచి మిగతా 25 శాతం టారిఫ్ అమలులోకి రానుంది. అయితే, రష్యా చమురు కొనుగోలు చేస్తున్న చైనా విషయంలో మాత్రం ట్రంప్ భిన్నవైఖరితో ముందుకెళ్తున్నారు. డ్రాగన్‌పై ఎలాంటి టారిఫ్‌లు బాదడం లేదు. తొలుత చైనాపై భారీగా టారిఫ్‌ల బాంబ్ పేల్చిన ట్రంప్.. ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఇప్పుడు చైనాతో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. వాణిజ్య ఒప్పందం చర్చల గడువును పొడిగించినట్లు చైనా కూడా తన అధికారిక మీడియాలో పేర్కొంది. రెండు దేశాలూ ఇటీవలే పోటాపోటీగా సుంకాలు విధించుకున్న విషయం తెలిసిందే. చైనా నుంచి దిగుమతయ్యే వస్తువులపై 145 శాతం టారిఫ్‌లు విధించనున్నట్లు ట్రంప్ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించారు. ఇక చైనా సైతం అమెరికాపై 125 శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ ఏడాది మేలో అమెరికా, చైనా మధ్య కీలక ట్రేడ్ డీల్ కుదిరింది. ఇరుదేశాలు సుంకాలను భారీగా తగ్గించేందుకు ఓ అంగీకారానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం.. అమెరికా దిగుమతులపై చైనా సుంకాలను 125 నుంచి 10 శాతానికి తగ్గించింది. మరోవైపు చైనా దిగుమతులపై అమెరికా సుంకాలను 145 నుంచి 30 శాతానికి తగ్గించింది. ఈ తగ్గింపు 90 రోజులు మాత్రమే అమల్లో ఉండేలా ఇరు దేశాలూ ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం మంగళవారం అర్ధరాత్రితో ముగియనుంది. దీంతో ట్రంప్ తాజాగా డ్రాగన్‌తో వాణిజ్య ఒప్పందానికి మరో 90 రోజుల విరామం ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనాపై ప్రతీకార సుంకాలు విధించాలా? వద్దా? అనే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్? పేర్కొన్నారు. ఎందుకంటే, రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంతో సంబంధం లేని, అనేక అంశాలు అమెరికా–చైనా సంబంధాలను ప్రభావితం చేస్తాయని ఆయన అన్నారు.

## భారీగా తగ్గిన పుత్తడి.. రూ.900 దిగిన తులం ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 11 : రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు భారీగా పడిపోవడంతో దేశీయంగా తులం ధర రూ.900 దిగొచ్చింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పదిగ్రాముల ధర రూ.1,02,520కి దిగొచ్చింది. రాజకీయ అనిశ్చిత పరిస్థితులు తగ్గుముఖం పట్టడం, స్టాకిస్టులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో ధరలు తగ్గుముఖం పట్టాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన తులం ధర రూ.900 తగ్గి రూ.1,02,100గా నమోదైంది.



గడిచిన ఐదు సెషన్లలో పుత్తడి ధర రూ.5,800 ఎగబాకిన విషయం తెలిసిందే. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ కలిగిన తులం బంగారం ధర రూ.760 తగ్గి రూ.1,02,280కి పరిమితమైంది. అంతకుముందు ఇది రూ.1,03,040గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర కూడా రూ.700 దిగొచ్చి రూ.1,02,280గా నమోదైంది. రష్యా–ఉక్రెయిన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంపై ఒక కొలిక్కి వచ్చే అవకాశాలుండటంతో గ్లోబల్ మార్కెట్లో పుత్తడి ధరలు భారీగా తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. కిలో వెండి రూ.1,000 తగ్గి రూ.1,14,000గా నమోదయ్యాయి.

# పక్కాగా ఉచిత బస్సు ప్రయాణ పథకం

## ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

## స్త్రీశక్తి సన్నద్ధతపై చంద్రబాబు నాయుడు సమీక్ష



అమరావతి,ఆగస్ట్12 : రాష్ట్రంలోని మహిళలు అందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం స్త్రీశక్తి' సన్నద్ధతపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సమీక్షలో సీఎం అధికారులను ఆదేశించారు. అధిక రద్దీకి అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నిర్వహణ సమర్థంగా చేయాలని, అందుకు తగ్గట్టు- సామర్థం పెంచుకోవాలని, భద్రత కూడా ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని... ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సంబంధించి ప్రయాణికుల నుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకుని, దానికి అనుగుణంగా పథకాన్ని మరింత మెరుగ్గా అమలు పరచాలని సీఎం నిర్దేశిరచారు. సర్వీస్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా సేవలు అందించేలా చూడాలన్నారు. ఈపోస్ మిషన్లకు జీపీఎస్ తప్పనిసరిగా ఎనేబుల్ చేసి ట్రాక్ చేయడం ద్వారా ప్రయాణికులకు సమాచారాన్ని అందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానమై పనిచేయాలి. సమస్యలు ఎక్కడైనా ఉత్పన్నమైతే వాటిని వెంటనే పరిష్కరించేలా వ్యవస్థ సిద్దంగా ఉండాలి. బస్ స్టేషన్లు అత్యంత పరిశుభ్రంగా ఉండాలి. ఎప్పటికప్పుడు చెత్త తొలిగించాలి. టాయిలెట్లను ప్రతి 2 గంటలకు ఒకసారి శుభ్రపరచాలి. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలి. ప్రయాణికులు ఎక్కడా అసౌకర్యానికి గురి కాకూడదు. అన్ని బస్ స్టేషన్లలో తాగునీటి కోసం ఆర్వో ఎ÷-లాంట్లు- ఏర్పాటు- చేయాలి. రూ.30 కోట్లతో చేపట్టిన బస్ స్టేషన్ల మరమ్మతులు, పెయింటింగ్ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి కావాలి. అవసరమైన చోట్ల కొత్తగా ఫ్యాన్లు, చైర్లు ఏర్పాటు- చేయాలి. ప్యాసింజర్లకు సహకరించేలా 24 గంటలు ఆర్టీసీ సిబ్బంది బస్ స్టేషన్‌లో అందుబాటు-లో ఉండాలి. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు అదనంగా నడపాల్సి వస్తుండటంతో బస్సులు ఎక్కడా బ్రేక్ డౌన్ కాకుండా చర్యలు తీసుకున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ- ఆర్డనరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళలు రాష్ట్రమంతా ప్రయాణించవచ్చని వివరించారు. వీరికి జీరో ఫేర్ టిక్కెట్ కోసం ఈపోస్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ ఆగస్ట్ 14కల్లా అప్డేట్ చేస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యిందని వెల్లడించారు. స్త్రీశక్తి పథకాన్ని ముఖ్యమంత్రి ఈనెల 15న మధ్యాహ్నం విజయవాడలోని పండింట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో ప్రారంభిస్తారు. మరోవైపు సమీక్షలో ముఖ్యమంత్రి రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అందించే సాయంపైనా అధికారులతో చర్చించారు. ఆటో డ్రైవర్లకు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలతో కలిపి... కొత్త పథకం రూపొందించేందుకు సమగ్రంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.

# కుక్కలను పూర్తిగా నిర్మూలించడం సరికాదు

### వాటికి షెల్టర్లు ఏర్పాటుచేసి, స్టెరైజేషన్ చేయాలి

### కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ అభిప్రాయం

### సుప్రీం ఆదేశాలు పునః పరిశీలించాలన్న అడవి శేష్

న్యూఢిల్లీ,ఆగస్ట్12 : ఢిల్లీ, ఎన్సీఆర్‌లలో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భిన్నంగా స్పందించారు. రోజు రోజుకు మనం సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లుగా ఉందన్నారు. మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదని.. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదని అన్నారు. కుక్కల నుంచి ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్థానికంగా షెల్టర్ల ఏర్పాటు, స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీధి కుక్కల అంశంలో 'సుప్రీం' ఇచ్చిన ఆదేశాలను పునఃపరిశీలించాలని అభ్యర్థిస్తూ సినీ నటుడు అడివి శేష్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా లేఖ రాసినట్లు- ఆయన వెల్లడించారు. తీర్పుపై ఇప్పటికే పలు జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ సైతం ఈ విషయాన్ని లేవనెత్తారు. ఈ తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధి కుక్కలున్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు-ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఢిల్లీ వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు-, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. కుక్కలను దూరంగా ఉన్న షెల్టర్లకు తరలించాలని సోమవారం సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా ఢిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది.

# స్వాతంత్ర్యోద్యమంలో ఉర్దూ పాత్రపై వ్యాసరచన

### మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్ వెల్లడి

అమరావతి,ఆగస్ట్12 : స్వాతంత్ర్యోద్యమంలో ఉర్దూ పాత్ర అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలల్లో వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ- సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీ 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తున్నట్లు- మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. ఏపీ ఉర్దూ అకాడమీ నేతృత్వంలో రాష్ట్ర మైనారిటీ- సంక్షేమ శాఖ, విద్యా శాఖల సంయుక్త నిర్వహణలో భారత స్వాతంత్ర పోరాటంలో ఉర్దూ భాష పాత్ర అంశంపై పోటీ-లను 13,14 వ తేదీలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు- పూర్తి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఆయా జిల్లాల మైనారిటీ- సంక్షేమ శాఖ అధికారులను నోడల్ అధికారులుగా నియమించి పర్యవేక్షణకు ఏర్పాట్లు- చేశామన్నారు. రాష్ట్ర రెండవ అధికారిక భాష ఉర్దూను ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి మైనారిటీ- సంక్షేమ శాఖ అమలు చేస్తున్న కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు- తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీ-ల నిర్వహణతో భాష అభివృద్ధి చెందడమే కాకుండా, ఉర్దూ మాధ్యమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులలో దేశభక్తి భావాలు కూడా పెంపొందుతాయని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛను స్వాతంత్రోద్యమంలో భారతీయుల ఐక్యతతో కూడిన పోరాటాలే మనందరికీ స్వతంత్ర ఫలాలను అందించాయన్నారు. ఆనాటి స్వాతంత్ర ఉద్యమంలో ఉర్దూ భాష పాత్ర పై వ్యాసరచన, వక్తృత్వపోటీ-లలో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు- మొదటి, రెండవ, మూడవ బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందని మైనారిటీ- శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు

# శంషాబాద్‌లో ఖరీదైన గంజాయి పట్టివేత

హైదరాబాద్,ఆగస్ట్ 12 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ.13.3 కోట్లు- విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గత నెల 30న కూడా బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద రూ.40 కోట్లు- విలువ చేసే హైడ్రోఫోనిక్ గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# సాంఘిక సంక్షేమశాఖలో వినూత్న మార్పులు

### విద్యార్థుల తల్లితండ్రుల్లో భరోసా కల్పించేలా చర్యలు

### సంక్షేమ శాఖమంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

విజయవాడ,ఆగస్ట్12 : సాంఘిక సంక్షేమశాఖలో వినూత్న మార్పులు తీసుకువస్తున్నామని, హస్టల్స్ లో తమ పిల్లలను చేర్పించే విద్యార్థుల తల్లితండ్రుల్లో భరోసా కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రీజనల్ కాన్ఫరెన్స్ ను మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ వసతి గృహాల మరమత్తుల నిమిత్తం రూ. 143 కోట్లు-, నూతనంగా నిర్మించే హస్టల్ భవనాలకు రూ. 100 కోట్లకు పైగా, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి దాదాపు రూ. 50 కోట్లు- విడుదల చేయడం జరిందన్నారు. మొత్తంగా దాదాపు రూ. 300 కోట్లు- హస్టల్స్ కు కేటాయించామని తెలిపారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే వసతుల మెరుగుపై దృష్టి సారించామని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో అహ్లాదకరంగా ఉంటూ చదువు పై దృష్టి నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో నూతనంగా హస్టల్ భవనాలు నిర్మాణాలు చేపడుతున్నామని మంత్రి డోలా చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మెనూలో నాణ్యమైన బియ్యం అందిస్తున్నాము. ఈ ఏడాది నుండి పోస్ట్ మెట్రిక్ విద్యార్థులకు కార్పెట్, టవల్స్, బెడ్ షీట్స్ కూడా అందిస్తున్నామన్నారు. ఇంటర్ లో, పదవ తరగతిలో గణనీయమైన మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించుకున్న విషయం విదితమే అని అన్నారు. మెరుగైన మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను సత్కరించుకోవడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన పోటీ-తత్వం అలవడటంతో పాటు- ఉత్తీర్ణత శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను క్షేత్రస్థాయికి చేర్చడానికి రీజనల్ వర్క్ షాపు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్ అందిస్తామన్న నమ్మకం తల్లితండ్రుల్లో కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామన్నారు. హస్టల్ లో ఉంటు-న్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, మంచి భోజనం ఏర్పాటు- చేయాలని, వసతి సౌకర్యాలు బాగుండాలని ఆదేశించారు. రీజనల్ కాన్ఫరెన్స్ల ఏర్పాటులో భాగంగా మొదటగా విజయవాడలో, అటుపై విశాఖపట్నం, తిరుపతి లలో కూడా రీజనల్ వర్క్ షాపు లు త్వరలో ఏర్పాటు- చేయనున్నామని తెలిపారు. వర్క్ షాపులో వార్డెన్లు తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరక్టర్ లావణ్య వేణి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్ టీ- ఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన హస్టల్ వార్డెన్లు, అధికారులు పాల్గొన్నారు.

# బీహార్ ఓటర్ల జాబితా సవరణ

### విచారణచేపట్టిన సుప్రీంకోర్టు

### వివరాలతో సిద్దంగా ఉండాలని ఆదేశం

### ఆధార్‌ను పౌరసత్వంగా గుర్తించలేమన్న ధర్మాసనం

న్యూఢిల్లీ,ఆగస్ట్ 12 : బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించాలన్న ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే సరైన వివరాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. విచారణ క్రమంలో ఆర్జేడీ నేత మనోజ్ ఝా తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఓ నియోజకవర్గంలో 12 మంది చనిపోయారని ఈసీ పేర్కొందని, కానీ వారు సజీవంగా ఉన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. మరో సందర్భంలో.. బతికే ఉన్న వ్యక్తులను చనిపోయినట్లు ప్రకటించారని ఆరోపించారు. అయితే.. ఇటువంటి ప్రక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్లు, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్లు- ప్రకటించడం వంటి తప్పిదాలను సరిదిద్దవచ్చని.. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే.. వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి 'సుప్రీం' ధర్మాసనం సూచించింది. ఎస్ఐఆర్ పక్రియ ప్రారంభానికి ముందు ఎంతమంది ఓటర్లు ఉన్నారు; గతంలో నమోదైన మరణాల సంఖ్య; ఇప్పుడు నమోదు చేసిన మరణాల సంఖ్య వంటి వివరాలపై ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపింది. బిహార్ ఎస్ఐఆర్‌లో సామూహికంగా ఓటర్లను తొలగిస్తే తక్షణమే జోక్యం చేసుకుంటామని జులై 29న సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు జులై 10న చేపట్టిన విచారణ సందర్భంగా.. బిహార్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించాలన్న ఈసీ నిర్ణయంపై స్టే విధించేందుకు నిరాకరించింది. అదేవిధంగా ప్రాథమిక పత్రాలుగా ఆధార్, రేషన్ కార్డుతో పాటు స్వయంగా ఓటర్ ఐడీ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ఆధార్ సేవలను కీలకమైన గుర్తింపు డాక్యుమెంట్‌గానే పరిగణనలోకి తీసుకుంటున్నామని, భారతదేశ పౌరసత్వానికి అది కచ్చితమైన రుజువు కాదని, సరైన వెరిఫికేషన్ తప్పనిసరని ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న వైఖరిని సుప్రీంకోర్టు సమర్థించింది. బిహార్ ప్రత్యేక సమగ్ర సవరణ కు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఆధార్‌ను కంక్లూజివ్ ప్రూఫ్‌గా ఆమోదించలేమని ఎన్నికల కమిషన్ చెప్పడం సరైనదేనని జస్టిస్ సూర్య కాంత్ అన్నారు. ఓటర్ వెరిఫికేషన్ పక్రియను చేపట్టే అధికారం ఈసీఐకి ఉందా అనే ప్రాథమిక అంశాన్ని నిర్ణయించాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అలాంటి అధికారం లేనట్టయితే ఈ అంశం ఇక్కడితో ముగుస్తుందని, ఆ అధికారం ఈసీఐకి ఉన్నట్లయితే ఓటర్ వెరిఫికేషన్ పక్రియపై ఎలాంటి అభ్యంతరాలు ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ తన వాదన వినిపిస్తూ, 1950 తర్వాత పుట్టిన ప్రతివ్యక్తి భారతదేశ పౌరుడేనని, అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎక్సర్‌సైజ్‌లో విధానపరమైన తీవ్ర తప్పిదాలున్నాయని అన్నారు. ఉదాహరణగా ఒక చిన్న అసెంబ్లీ నియోజకవర్గంలో నివసిస్తున్న 12 మందిని చనిపోయినట్టు- పేర్కొన్నారని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించ లేదని అన్నారు. పోల్ ప్యానల్ సరైన విధానాన్ని అనుసరించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగింపు జరిగిందని, ముఖ్యంగా అవసరమైన దరఖాస్తులు సమర్పించలేక పోయిన వారిపై ఈ ప్రభావం ఉంటుందని అన్నారు. 2003 ఓటర్ల జాబితాలో పేరున్న వారిని కూడా కొత్తగా ఫామ్‌లు సమర్పించమనడం, అలా చేయని పక్షంలో రెసిడెన్స్‌లో ఎలాంటి మార్పు లేనప్పటికీ వారిని తొలగించడం జరుగుతుందన్నారు. ఈసీఐ ప్రకటించిన గణాంకాల ప్రకారం 7.24 కోట్ల మంది అవసరమైన ఫామ్స్ దాఖలు చేశారని, అయినా 65 లక్షల మంది ఓటర్ల పేర్లు సరైన వెరిఫికేషన్ లేకుండా తొలగించారని అన్నారు. పేర్ల తొలగింపును బలపరచే ఎలాంటి సర్వే నిర్వహించ లేదని అఫిడవిట్‌లో ఎన్నికల కమిషన్ అంగీకరించిందని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇటువంటి పక్రియలో కొన్ని లోపాలు ఉంటాయని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదించారు. చనిపోయిన వ్యక్తులను బతికి ఉన్నట్టు-, సజీవంగా ఉన్నవారిని చనిపోయినట్టు- ప్రకటించడం వంటి తప్పదాలని సరిదిద్ద వచ్చన్నారు. ఇది కేవలం ముసాయిదా జాబితా మాత్రమేనని కోర్టుకు విన్నవించారు. ఈ క్రమంలోనే వాస్తవాలు, గణాంకాలతో సిద్ధంగా ఉండాలని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. ఇదిలా ఉండగా.. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. ఈ నెల 1న ముసాయిదా జాబితాను ప్రచురించారు. ఎస్ఐఆర్ పక్రియ చేపట్టక ముందు రాష్ట్రంలో మొత్తం నమోదిత ఓటర్ల సంఖ్య 7.9 కోట్లుగా ఉండగా, ముసాయిదాలో అది 7.24 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రకటించనున్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి.

# 15 నుంచి ఎపి సచివాలయంలో నో ప్లాస్టిక్

### సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై పూర్తి నిషేధం

### అధికారులతో సమీక్షించిన సిఎస్

అమరావతి,ఆగస్ట్12 : ఎపిని వచ్చే ఏడాది జూన్ 5 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానిలో భాగంగా ఈనెల 15వ తేదీన నుండి ఎపి సచివాలయంలో నో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నినాదంతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విచ్చలవిడి ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి మరీ ముఖ్యంగా మానవాళికి కలుగుతున్న నష్టం వర్ణణాతీతం. ఈనేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టడం జరిగింది. దానిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన రాష్ట్ర సచివాలయం నుండే ముందుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేందుకు శ్రీకారం చుట్టనున్నారు. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్ నిషేధంపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ శాఖల కార్యదర్శులతో సమావేశమై చర్చించారు. ఆగష్టు 15 నుండి ఎపి సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు తీసుకోవాల్సి న చర్యలపై ఆయన కార్యదర్శులతో సమీక్షించారు. ముఖ్యంగా పర్యావరణానికి హాని కలిగిస్తున్న ఒకసారి వాడి పడేసే వివిధ క్యారీ బ్యాగులు,ప్లాస్టిక్ మంచినీటి సీసాలు,గ్లాసులు, ప్లేట్లు-,కప్పులు,స్పూన్లు,ఫోర్కులు, ఫినాయిల్ సీసాలు, డబ్బాలు తదితర వస్తువులను పూర్తిగా నిషేధించే ఇందుకు తీసుకోవాల్సిన అంశాలపై సిఎస్ విజయానంద్ చర్చించారు. ఈసమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ రావత్,ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్, పిసిబి చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఆర్పి సిసోడియా,కృష్ణబాబు, సిసిఎల్ఏ జయలక్ష్మి,జిఏడి ముఖ్య కార్యదర్శి ఎంకె మీనా, సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు,ముఖ్య కార్యదర్శి సునీత,కార్యదర్శులు తదితరులు వర్చువల్ గా పాల్గొన్నారు.

# అంటువ్యాధులకు తోడు జ్వరాలు


### భయంతో ఆస్పత్రులకు పరుగు

ఏలూరు,ఆగస్ట్12 : వర్షాల సీజన్ కావడంతో ప్రజలకు అంటువ్యాధులు తప్పడం లేదు. దీనికితోడు ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రజల జ్వరాలతో బాధపడుతున్నారు. వైరల్ ఫీవర్‌తో పాటు మలేరియా కూడా విజృంభిస్తోంది. నిగత కొద్దిరోజుల నుంచి అనేక గ్రామాల్లో దగ్గు, జలుబులు తీవ్రరూపం దాల్చడమే కాకుండా చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు వైరల్ ఫీవర్‌లుగా పేర్కొంటున్నప్పటికీ లక్షణాలు మాత్రం మలేరియా, టైఫాయిడ్‌లను పోలినట్లుగానే ఉంటున్నాయి. జ్వరాలు జనాన్ని భయానికి గురిచేస్తున్నాయి. వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికి పారిశుధ్య సమస్య కారణంగా వైరల్ జ్వరాలు విభృంభిస్తున్నాయంటున్నారు. వాతావరణంలో వేడితీవ్రత తగ్గకపోవడం అలాగే వర్షాల కారణంగా నీరు నిలిచి ఉంటున్నందున ఈగలు, దోమలు వృద్ధి చెందిన వైరల్ జ్వరాలతో పాటు డయేరియా లాంటి రోగాలు విస్తరిస్తున్నాయంటున్నారు. అలాగే జ్వరాలకు తోడుగా దగ్గు, జలుబు కూడా సాధారణ ప్రజానీకాన్ని సతమతం చేస్తోంది. ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుండడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు జ్వర బాధితులు క్యూ కడుతున్నారు. వైద్య,ఆరోగ్యశాఖ రక్త పరీక్షల నమూనా శిబిరాలను సైతం చేపట్టింది. వరద ప్రాంతంతో పాటు పలు గ్రామాల్లో దోమల మందులను పిచ్‌కారి చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లాంటి చర్యలను చేపడుతున్నప్పటికి పారిశుధ్య సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. మురికి కాలువలతో పాటు గుంతల్లో నిలిచిపోయిన నీటికారణంగా ఈగలు, దోమలు తీవ్రంగా ప్రబలుతున్నాయంటున్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత లోపంతో కూడా జ్వరాలు తీవ్రంగా విస్తరించడానికి కారణమవున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

# ఎసిబికి చిక్కిన మహిళా ఉద్యోగి

### లంచం తీసుకుంటుండగా పట్టివేత

వికారాబాద్,ఆగస్ట్ 12 : తెలంగాణ వ్యాప్తంగా అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ గుబులు పుట్టిస్తోంది. లంచం తీసుకుంటున్న ప్రభుత్వ అధికారుల భరతం పడుతోంది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే రంగంలోకి దిగి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటోంది. అయినా ప్రభుత్వ అధికారుల తీరు మారడం లేదు. లంచాల కోసం టేబుల్ కింద చేయిపెడుతున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ లో ఏసీబీ అధికారులకు ఓ మహిళా ఉద్యోగి లంచం తీసుకుంటూ దొరికింది. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డిఎస్పి ఆనంద్ కుమార్ చెప్పిన వివరాల ప్రకారం .. రెవెన్యూ సెక్షన్లలో పనిచేస్తున్న సుజాత అనే మహిళా ఉద్యోగిని రూ.15 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు . నవాబుపేట మండల పరిధిలోని రెండు ఎకరాల అసైన్డ్ భూమి విషయంలో తహశీల్దార్ కార్యాలయానికి ప్రొసిడింగ్ కాపీ పంపించడానికి మహిళా ఉద్యోగి సుజాత 20 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసింది . కలెక్టర్ సంతకం కోసం టేబుల్ మీద ఫైల్ పెట్టడానికి 5 వేల రూపాయలు ముందుగానే ఫోన్ పే ద్వారా తీసుకుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి ప్రభుత్వం ఫ్రీహ్యాండ్ ఇచ్చింది. అవినీతి అధికారులు ఏ శాఖలో ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. ఉపేక్షించొద్దని తేల్చిచెప్పింది. ఫిర్యాదులు రాగానే వెంటనే రంగంలోకి దిగాలని ఆదేశించింది. దీంతో లంచాల విషయం తెలిస్తే తమకు సమాచారం అందించాలంటూ టోల్ ఫ్రీ నంబర్ కు, వాట్సాప్ నంబర్ ను జనంలోకి విస్తృతంగా ఏసీబీ అధికారులు తీసుకెళ్తున్నారు.





## విదేశాల్లో స్పిరిట్ తొలి షెడ్యూల్

కథానాయకుడు ప్రభాస్.. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కలయికలో 'స్పిరిట్' పేరుతో బహుభాషా చిత్రం రూపొందనున్న సంగతి తెలిసిందే. ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. త్రిప్తి దిమ్రి కథానాయిక. ఈ సినిమా సెప్టెంబరు నెలాఖరున పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అయితే తొలి షెడ్యూల్ మాత్రం విదేశాల్లో మొదలు కానుందని సమాచారం. దీనికోసం సందీప్ ఇప్పటికే మెక్సికో, ఇండోనేషియా, మలేషియా, బ్యాంకాక్ తదితర దేశాల్లో లొకేషన్లు రెక్కీ చేసి పెట్టుకున్నారు. సినిమాలోని కీలక షెడ్యూల్స్‌ను అక్కడే ప్లాన్ చేస్తున్నట్లు- తెలిసింది. ప్రభాస్ నవంబరు నాటికి సెట్లోకి అడుగు పెట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ భారీ యాక్షన్ ఎంటర్-టైనర్‌లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనువిందు చేయనున్నారు. సంగీత దర్శకుడు హర్ష వర్ధన్ రామేశ్వర్ ఈ చిత్ర పాటల్ని ఇప్పటికే సిద్ధం చేసినట్లు- తెలిసింది.

## విడుదలకు ముందే కూలీ కలెక్షన్ల రికార్డు

రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో విడుదలవుతున్న చిత్రం 'కూలీ' విడుదలకు ముందే రికార్డులను సొంతం చేసుకుంది. తాజాగా ప్రీ బుకింగ్స్ ఓపెన్ చేయడంతో టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. దీంతో ఓవర్సీస్‌లో రికార్డు నమోదైంది. విడుదలకు రెండు రోజుల ముందే 'కూలీ' రెండు మిలియన్ల క్లబ్‌లో చేరిపోయింది. ప్రీమియర్స్‌లోనే ఈ స్థాయిలో వసూళ్లు సాధించిన మొదటి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పింది. 2016లో రజనీకాంత్ నటించిన 'కబాలి' నార్త్ అమెరికాలో విడుదలకు ముందే 60 వేల డాలర్లు వసూళ్లు చేసిన మొదటి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పింది. ఇప్పుడు మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత ఆయన రికార్డును ఆయనే బ్రేక్ చేశారు. సూపర్‌స్టార్ రికార్డును బ్రేక్ చేయడం మళ్లీ ఆయనకే సాధ్యమని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'కూలీ' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నాగార్జున, ఆమిర్‌ఖాన్, ఉపేంద్ర, శ్రుతిహాసన్, సత్యరాజ్, సౌబిన్‌షాహిర్, మహేంద్రన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించారు. తాజాగా విడుదల చేసిన పాటలు, -ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. 'కూలీ'తో లోకేశ్ మరో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించాడంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.




## వార్-2 లో బాబీ డియోల్ రోల్?


ఎన్టీఆర్, హృతిక్ రోషన్ కీలక పాత్రల్లో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ 'వార్2' కియారా అద్వాణీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు బాబీ దేవోల్ సినిమాలో కనిపించనున్నట్లు- సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా - ల్గ÷కె-మాక్స్‌లో బాబీ అతిథి పాత్రలో మెరుస్తారని సమాచారం. ఇటీ-వల జరిగిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఎన్టీఆర్ మాట్లాడుతూ.. ఈ సినిమాలో ఎన్నో సర్‌ప్రైజ్‌లు ఉన్నాయని వాటిని ఎవరూ రివీల్ చేయొద్దని కోరారు. దీంతో ఆ సర్‌ప్రైజ్ ఈ పాత్రే కావొచ్చని అభిమానులు భావిస్తున్నారు. యానిమల్'తో మంచి విజయాన్ని అందుకుని అందరి ప్రశంసలు సొంతం చేసుకున్నారు బాబీ దేవోల్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సినిమా విజయంలో స్క్రిప్ట్ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. సూర్య హీరోగా వచ్చిన 'కంగువా'లో ఆయన ప్రతి నాయకుడిగా కనిపించారు. అయితే ఆ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకోకపోవడంపై ఆయన స్పందించారు. స్క్రిప్ట్ సరిగా లేకపోతే ఏ సినిమా కూడా ఆడదని అన్నారు. సూర్య చాలా గొప్ప నటు-డు. 'కంగువా' మంచి విజయం సాధిస్తుందని అందరం అనుకున్నాం. కానీ మేం ఆశించింది జరగలేదు. నేను నటు-డిగా ఎదగడానికి సినిమాలు చేస్తున్నాను. అందుకే భిన్నమైన పాత్రలు ఎంచుకుంటాను. 'డాకు మహారాజ్'లో బాలకృష్ణతో నటించిన అనుభవం ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన నిజంగానే మాస్ హీరో' అని తెలిపారు.






## కేరళ కుట్టిగా జాన్వీ పరమ్ సుందరి

సిద్ధార్థ్ మల్హోత్రా , జాన్వీ కపూర్ జంటగా తెరకెక్కిన సినిమా 'పరమ్ సుందరి' తుషార్ జలోటా దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఇందులో.. సౌత్ ఇండియన్ టాప్ హీరోలు రజనీకాంత్, మోహన్‌లాల్, అల్లు అర్జున్‌లాంటి వారిని ఇమిటేట్ చేసి జాన్వీ అలరించారు. కేరళ అమ్మాయిగా జాన్వీ, దిల్లీ అబ్బాయిగా సిద్ధార్థ్ సందడి చేశారు.




## నిరంతరాయంగా కాంతారా-2 చిత్రీకరణ

కొన్ని ప్రమాదాలు యాధృచ్ఛికమన్న నిర్మాత

కన్నడ మూవీగా విడుదలై పాన్ ఇండియా స్థాయిలో ఆదరణ దక్కించుకున్న చిత్రం 'కాంతారా' ఇప్పుడు ప్రీక్వెల్‌గా రిషబ్‌శెట్టి 'కాంతారా: చాప్టర్1' రూపొందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. 'కాంతార2' మొదలైనప్పటి నుంచి వరుస ప్రమాదాలు, షూటింగ్‌కు అడ్డంకులు తలెత్తుతున్న సంగతి తెలిసిందే. ఇదేమైనా శాపమా? అంటూ కన్నడ ఇండస్ట్రీలో టాక్ మొదలైంది. దీనిపై చిత్ర నిర్మాత చలువే గౌడ స్పందించారు. సినిమాకు ఏర్పడిన అవరోధాలపై స్పందించారు. సినిమా షూటింగ్ సందర్భంగా దురదృష్టవశాత్తూ చోటు-చేసుకున్న సంఘటనలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. సెట్‌లో ఒకే ఒక అగ్ని ప్రమాదం జరిగింది. మిగిలినవన్నీ సినిమాకు సంబంధం లేనివని అన్నారు. 2024 నవంబరులో కర్ణాటకలోని కొల్లూరు వద్ద జరిగిన ప్రమాదంలో చిత్ర బృందం గాయాలతో బయటపడింది. అలాగే 2025 జనవరిలో సెట్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటు- చేసుకుంది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఆ తర్వాత ఇటీవల రిషబ్ శెట్టి సహా కొంతమంది టీమ్ సభ్యులు త్రుటిలో పడవ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కెమెరాలు, ఇతర పరికరాలు నీటిపాల య్యాయి. ము ఎక్కువగా దట్టమైన అటవీ ప్రాంతంలో చిత్రీకరణలు జరిపాం. ఉదయం 4 గంటలకు నిద్రలేచి, 4.30 కల్లా రెడీ అయి, షూటింగ్ స్పాట్‌కు వెళ్లిపోయే వాళ్లం. ఎట్టి పరిస్థితుల్లో ఉదయం 6 గంటలకు చిత్రీకరణ మొదలైపోయేది. 80 శాతం సినిమాను నిజమైన ప్రదేశాల్లోనే తెరకెక్కించాం. ఆ షూటింగ్ లొకేషన్స్ అన్నీ నగరానికి వందల కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. దీనికి తోడు వాతావరణం ఇబ్బంది పెడుతూనే ఉండేది. సమయం వృథా కాకూడదని కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌ను వర్షంలోనే తీశాం. వివిధ కారణాల వల్ల షూటింగ్ ఆలస్యమవుతుంటే ఎవరికైనా కోపం వస్తుంది. అయితే, దీనికి ఎవరో ఒకరిని బాధ్యులను చేయలేం. కానీ, వచ్చి ఫుటేజ్ చూసిన తర్వాత మేము సమయాన్ని వృథా చేయలేదని పించిందని అన్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది.




## 14న విడుదలవుతున్న కూలీ, వార్-2

### తెలుగు రాష్ట్రాల్లో యధావిధిగా టిక్కెట్ రేట్లు

కూలీ, వార్ 2 సినిమాలకు తెలంగాణలో టికెట్లు రేట్లు పెంచబోతున్నట్లు సోమవారం సాయంత్రం నుంచి వార్తలు వైరలయ్యాయి. అయితే ఈ నిర్ణయంపై అటు- అభిమానులతో పాటు- మువీ లవర్స్ కూడా తీవ్రంగా తప్పుబట్టారు. డబ్బింగ్ సినిమాలకు కూడా టికెట్ రేట్లు పెంచి ఈ దోచుకోవడం ఏంటి అని సోషల్ మీడియాలో నిర్మాతలతో పాటు- తెలంగాణ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. దీంతో టికెట్ ధరలపై నిర్మాతలు వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. సాధారణ టికెట్ ధరలకే ఈ సినిమా టికెట్‌లను అందుబాటులో ఉంచబోతున్నట్లు- సినీ వర్గాల సమాచారం. దీనికి సంబంధించి అప్‌డేట్ రానుంది. మరోవైపు ఈ రెండు సినిమాల బుకింగ్స్ ఓపెన్ కాబోతున్నాయి. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న కూలీ సినిమాతో పాటు- హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో రాబోతున్న వార్ 2 చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయితే ఈ రెండు డబ్బింగ్ సినిమాలకు తెలంగాణతో పాటు- ఆంధ్రప్రదేశ్‌లో టికెట్ రేట్లు- పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు- వార్తలు వస్తున్నాయి. కూలీ సినిమాకు తమిళనాడులో అత్యధిక టికెట్ ధర రూ.190 రూపాయలు ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో వచ్చేసరికి ఆ ధర దాదాపు రూ.450 నుంచి రూ.500 వరకు వెళుతుందని అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు హిందీ నుంచి వస్తున్న డబ్బింగ్ చిత్రం వార్ 2 కి కూడా హిందీలో రూ.250 టికెట్ రేట్లు- ఉండగా.. తెలంగాణలో రూ.400 వరకు ఉండబోతుందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ ఇవే రేట్లు- కొనసాగితే.. భవిష్యత్తులో ప్రేక్షకులు థియేటర్లకి రావడం మానేసి.. ఓటీటీ- లేదా.. పైరసీ వెబ్‌సైట్‌లకు అలవాటుపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# స్పోర్ట్స్

# పర్ఫార్మెన్స్ ఇస్తున్నంత వరకు రోహిత్, విరాట్‌లకు ఢోకా లేదు

## టీమ్‌ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్



టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే కెరీర్ ఫ్యూచర్? గురించి కొన్ని రోజులుగా తీవ్ర చర్చ జరుగుతోంది. అయితే ఈ ఇద్దరూ 2027 వరల్డ్?కప్?లో ఆడాలనుకుంటున్నప్పటికీ, దీనిపై బీసీసీఐ సుముఖంగా లేదని వార్తలు వస్తున్నాయి. 2025 అక్టోబర్?లో జరగనున్న ఆస్ట్రేలియా సిరీసే ఆఖరిదని ప్రచారం కూడా జరుగుతోంది. అయితే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తాజా కామెంట్స్ ఆసక్తి రేపుతున్నాయి. రోహిత్, విరాట్ వన్డే ఫ్యూచర్?పై విలేకరులు అడిగిన ప్రశ్నకు గౌతమ్ గంభీర్ నేరుగా కాకపోయినా, పరోక్షంగా సమాధానమిచ్చాడు. 2027 వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా చాలా సమయం ఉందని, ఈ మెగా టోర్నీకంటే ముందు 2026 టీ20 ప్రపంచకప్ ఉంటుందని చెప్పాడు. ప్రస్తుతం తమ ముందున్న లక్ష్యం కూడా అదేనన్నాడు. అయితే ఫామ్‌లో ఉండి, వీలైనన్ని ఎక్కువ పరుగులు చేసినంత వరకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకు ఎలాంటి ఢోకా ఉండదని తెలుస్తోంది. "వన్డే వరల్డ్ కప్ కంటే ముందు టీ20 ప్రపంచకప్ జరగనుంది. ఇది చాలా పెద్ద టోర్నమెంట్. కాబట్టి ప్రస్తుతం మా దృష్టి మొత్తం దానిపైనే ఉంది. 2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల టైమ్ ఉంది. అయితే అత్యుత్తమంగా పర్ఫార్మెన్స్? ఇస్తున్నంత వరకు వయసు అనేది ఓ సంఖ్య మాత్రమే అని నేను ఎప్పుడూ చెబుతుంటా" అని గంభీర్ అన్నాడు. కాగా, ఈ ఏడాది ముగిసేలోపు టీమ్‌ఇండియా ఆరు వన్డే మ్యాచ్?లు ఆడనుంది. అక్టోబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్?లో మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత నవంబర్‌లో సౌతాఫ్రికాతోనూ మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొననుంది. ఇలా టీమ్‌ఇండియాకు 2025లో మొత్తం ఆరు వన్డే మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ సిరీస్?ల్లో రోహిత్, విరాట్ దాదాపు బరిలోకి దిగడం ఖాయమే. అయితే ఈ సిరీస్?ల్లో ప్రదర్శన ఆధారంగానే రోహిత్, విరాట్ ఫ్యూచర్ ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.



## ఆసియాకప్‌కు సిద్ధమవుతున్న బుమ్రా !

ఆసియాకప్ 2025 టోర్నీకి ముందు టీమిండియా అభిమానులకు గుడ్ న్యూస్. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్ పర్యటనలో మూడు మ్యాచ్‌లే ఆడిన టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఆసియా కప్ 2025 టోర్నీ ఆడనున్నాడు. పనిభారం కారణంగా ఈ టోర్నీకి బుమ్రా దూరంగా ఉంటాడని ప్రచారం జరిగింది. కానీ తాజా సమాచారం ప్రకారం ఆసియాకప్ ఆడేందుకు బుమ్రా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. బుమ్రా.. ఆసియా కప్ ఆడితే వెస్టిండీస్‌తో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో తొలి మ్యాచ్ నుంచి అతనికి విశ్రాంతి ఇచ్చే అవకాశం ఉంది.బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి భారత క్రికెటర్ల ఫిట్‌నెస్ రిపోర్ట్స్ అందిన తర్వాత అజిత్ అగార్కర్ సారథ్యంలోని భారత సెలెక్షన్ కమిటీ ఆగస్ట్ 19, 20వ తేదీల్లో సమావేశం కానుంది. టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. హెర్నియా సర్జరీ నుంచి కోలుకొని ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు. ఇంగ్లండ్ పర్యటనలో దుమ్మురేపిన శుభ్‌మన్ గిల్ ఆసియా కప్‌తో టీ20 ఫార్మాట్‌లోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. వైస్ కెప్టెన్సీ బాధ్యతలు కూడా స్వీకరించే అవకాశం ఉంది. ఇంగ్లండ్‌తో జరిగిన టీమిండియా ఆఖరి టీ20 సిరీస్‌కు గిల్ దూరంగా ఉన్నాడు. ఆ సిరీస్‌లో అక్షర్ పటేల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యాలతో కూడిన బ్యాటింగ్ లైనప్‌నే ఆసియాకప్‌లో కొనసాగించే అవకాశం ఉంది. కీపర్‌గా బ్యాటర్‌గా సంజూ శాంసన్ సత్తా చాటాడు. అతనికి బ్యాకప్‌గా జితేశ్ శర్మ లేదా ధ్రువ్ జురెల్‌కు అవకాశం లభించనుంది. ఎక్కువ ప్రత్యామ్నాయాలు ఉండటంతో జట్టు ఎంపిక సెలెక్టర్లకు తలనొప్పిగా మారింది.జస్‌ప్రీత్ బుమ్రా రాకతో సిరాజ్‌కు రెస్ట్ ఇవ్వనున్నారు. రెండో పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ ఆడనుండగా.. మూడో పేసర్‌గా ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణాల మధ్య పోటీ నెలకొంది. ఐపీఎల్ 2025 సీజన్‌లో 25 వికెట్లు తీసిన ప్రసిధ్ కృష్ణవైపు సెలెక్టర్లు మొగ్గు చూపవచ్చు. స్పిన్ ఆల్‌రౌండర్ల కోటాలో అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆడనుండగా.. స్పెషలిస్ట్ స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ ఆడనున్నారు. వన్డేల్లో కీపర్‌గా కొనసాగుతున్న కేఎల్ రాహుల్ రీఎంట్రీ ఇవ్వడం కూడా కష్టమే.జస్‌ప్రీత్ బుమ్రా రాకతో టీమిండియా బౌలింగ్ బలం పెరగనుంది. బుమ్రా వేసే నాలుగు ఓవర్లు జట్టుకు కీలకం కానున్నాయి. పొట్టి ఫార్మాట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా చివరిసారిగా టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్ ఆడాడు. ఈ మ్యాచ్‌లో బుమ్రా(2/18) తన ప్రదర్శనతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఐపీఎల్‌లోనూ బుమ్రా మెరుగైన ప్రదర్శనే చేశాడు.

## త్వరలో సల్మాన్ కొత్త ఐపీఎల్ టీమ్

క్రికెట్, బాలీవుడ్ మధ్య చాలా కాలం నుంచి మంచి అనుబంధం ఉంది. ఐపీఎల్ దీనిని మరింత బలోపేతం చేసింది. బాలీవుడ్ స్టార్స్ అయిన షారుఖ్ ఖాన్, ప్రీతి జింటా చాలా కాలం నుంచి ఐపీఎల్ ఫ్రాంచైజీలైన కేకేఆర్, పంజాబ్ కింగ్స్‌కు యజమానులుగా ఉన్నారు. ఒకానొక సమయంలో శిల్పా శెట్టి కూడా రాజస్థాన్ రాయల్స్ జట్టుకు భాగస్వామిగా ఉన్నారు. అయితే, ఇటీవల సల్మాన్ ఖాన్‌ను కూడా ఐపీఎల్‌లో టీమ్ ఎందుకు కొనకూడదు అని అడిగితే, ఆయన ఇచ్చిన సమాధానం ఆశ్చర్యపరిచింది. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో సల్మాన్ ఖాన్‌ను మీరు ఎప్పుడైనా ఐపీఎల్‌లో టీమ్ కొనాలనుకుంటున్నారా? అని అడిగారు. దీనికి సల్మాన్ స్పందిస్తూ.. ఐపీఎల్‌కు ఇప్పుడు మేము చాలా ముసలివాళ్లం అయ్యామని నవ్వుతూ సమాధానం చెప్పారు. కాగా, ఈ సంవత్సరం సల్మాన్ ఖాన్ ఐఎస్‌పీఎల్ (ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్) లో ఢిల్లీ ఫ్రాంచైజీకి యజమానిగా మారారు.ఐపీఎల్ మొదటి సీజన్ అయిన 2008లోనే తాను ఒక జట్టుకు యజమానిగా మారే అవకాశం వచ్చిందని సల్మాన్ ఖాన్ వెల్లడించారు. కానీ, ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు తెలిపారు. ఆ సమయంలోనే నాకు ఐపీఎల్ ఆఫర్ వచ్చింది. కానీ నేను తీసుకోలేదు. దీని గురించి నేను ఇప్పుడు బాధపడటం లేదు, సంతోషంగా ఉన్నానని సల్మాన్ ఖాన్ అన్నారు. షారుఖ్ ఖాన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీలో 55 శాతం వాటాలు కలిగి ఉన్నారు. మిగిలిన 45 శాతం వాటాలు జూహీ చావ్లా భర్త జై మెహతాకు చెందిన మెహతా గ్రూప్ వద్ద ఉన్నాయి. ప్రీతి జింటా 2008 నుంచి పంజాబ్ కింగ్స్ జట్టుకు భాగస్వామిగా ఉన్నారు. ఆమెకు ఆ జట్టులో 23 శాతం వాటాలు ఉన్నాయి. శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా 2009లో రాజస్థాన్ రాయల్స్‌లో 11.9 శాతం వాటాలు కొనుగోలు చేశారు. ఈ వాటాలు 2015 వరకు వారి దగ్గరే ఉన్నాయి. అక్షయ్ కుమార్ ఏ జట్టుకు యజమాని కానప్పటికీ, చాలా ఏళ్ల క్రితం ఢిల్లీ డేర్‌డెవిల్స్‌తో (ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్) మూడు సంవత్సరాల ఒప్పందం కుదుర్చుకున్నారు. నష్టాలను తగ్గించుకోవడానికి ఢిల్లీ ఈ ఒప్పందం చేసుకుంది.



## ఈ ఏడాది టీమిండియా పూర్తి షెడ్యూల్ విడుదల



ఆసియా కప్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈసారి ఆసియా కప్ యూఏఈలో సెప్టెంబర్ 9 నుండి 28 వరకు జరగనుంది. భారత క్రికెట్ జట్టు గ్రూప్ లో పాకిస్తాన్‌తో తలపడనుంది. ఇదే గ్రూపులో ఒమన్, యూఏఈ కూడా ఉన్నాయి. అంటే, సూపర్ 4కి భారత్, పాక్ అర్హత సాధించే బలమైన జట్లుగా ఉన్నాయి. ఒకవేళ సూపర్ 4కు చేరినా, మరోసారి భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగనుంది. మరోవైపు సెప్టెంబర్‌లోనే మహిళల ప్రపంచ కప్ కూడా ప్రారంభం కానుంది. ఈ సంవత్సరం టీమ్ ఇండియా పూర్తి షెడ్యూల్, మ్యాచ్‌ల వివరాలు ఇక్కడ అందిస్తున్నాం. ఆసియా కప్‌లో మొత్తం 8 జట్లు ఆడుతున్నాయి, వీటిని నాలుగు జట్ల చొప్పున 2 గ్రూపులుగా విభజించారు. ప్రతి జట్టు తమ గ్రూప్‌లోని 3 జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడాల్సి వస్తుంది. గ్రూప్ నుంచి రెండు జట్లు సూపర్ 4కు అర్హత సాధిస్తాయి. సూపర్ 4లో ప్రతి జట్టు ఇతర 3 జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ఒకవేళ భారత్, పాక్ సూపర్ 4కి చేరుకుంటే.. మరోసారి దాయాదులు తలపడతాయి. ఆసియా కప్‌లో ఇండియా మొత్తం 6 మ్యాచ్‌లు ఆడుతుంది. ఫైనల్‌కు చేరుకుంటే, కనుక మొత్తం 7 మ్యాచ్‌లు అవుతాయి. సెప్టెంబర్ 14న భారత్, పాక్ మధ్య ఒక మ్యాచ్ ఖచ్చితంగా ఉంది. గ్రూప్ %ూ% నుంచి భారత్, పాకిస్తాన్ సూపర్ 4కి వెళ్లే అవకాశం ఉంది, ఆ మ్యాచ్ తేదీ గ్రూప్ దశ ముగిసిన తర్వాత నిర్ణయిస్తారు. ఒకవేళ భారత్, పాకిస్తాన్ జట్లు ఫైనల్‌కు చేరుకుంటే, ఆసియా కప్‌లో భారత్, పాక్ మధ్య మొత్తం 3 మ్యాచ్‌లు జరుగుతాయి. 28వ తేదీన ఆసియా కప్ ముగిసిన తర్వాత, టీమ్ ఇండియా వెస్టిండీస్‌తో 2 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని తరువాత, ఆస్ట్రేలియా పర్యటనలో 3 వన్డేలు మరియు 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ఆడబడుతుంది. ఇక్కడ విరాట్ కోహ్లీ మరియు రోహిత్ శర్మ తిరిగి వస్తున్నారు, వీరు ఇప్పుడు %ాణ×% ఫార్మాట్‌లో మాత్రమే ఆడుతున్నారు. దీని తరువాత భారత్-దక్షిణాఫ్రికా టెస్ట్, వన్డే మరియు టీ20 సిరీస్ ఉంటుంది. భారత మహిళల జట్టు సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో 3 మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌తో 2 వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. భారతదేశంలో జరగనున్న ప్రపంచ కప్‌లో టీమిండియా తొలి మ్యాచ్ సెప్టెంబర్ 30న శ్రీలంకతో ఉంది.

## ఆసీస్‌పై సౌతాఫ్రికా ఘన విజయం!

ఆస్ట్రేలియా పర్యటనలో ఎట్టకేలకు సౌతాఫ్రికా తొలి విజయాన్నందుకుంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఓడిన సఫారీ టీమ్.. ఆ పరాజయం నుంచి త్వరగానే తేరుకుంది. మంగళవారం ఆతిథ్య ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో 53 పరుగుల తేడాతో గెలుపొందింది. జూనియర్ ఏబీడీ, డెవాల్డ్ బ్రెవిస్ విధ్వంసకర శతకంతో సౌతాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో మూడు టీ20ల సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. సిరీస్ డిసైడర్ అయిన మూడో టీ20 శనివారం జరగనుంది.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 218 పరుగుల భారీ స్కోర్ చేసింది. డెవాల్డ్ బ్రెవిస్ (56 బంతుల్లో 12 ఫోర్లు, 8 సిక్సర్లతో 125 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్(22 బంతుల్లో 3 ఫోర్లతో 31) రాణించాడు. ఆస్ట్రేలియా బౌలరర్లలో గ్లేన్ మ్యాక్స్‌వెల్(2/44), బెన్ ద్వార్షుయిస్(2/24) రెండేసి వికెట్లు తీయగా.. జోష్ హజెల్ వుడ్, ఆడమ్ జంపా చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 17.4 ఓవర్లలో 165 పరుగులకే కుప్పకూలి ఓటమిపాలైంది. మరోసారి టీమ్ డెవిడ్(24 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ మిచెల్ మార్ష్(13 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 22), అలెక్స్ క్యారీ(18 బంతుల్లో 3 ఫోర్లతో 26) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. సౌతాఫ్రికా బౌలర్లలో క్వెనా మఫకా(3/57), కోర్బిన్ బోచ్(3/20) మూడేసి వికెట్లు తీయగా.. మార్క్‌రమ్, పీటర్ రబడా తలో వికెట్ తీసారు.

## నెంబర్ 3లో అభిమన్యు ఈశ్వరన్‌ను ఆడించాలి

### టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ

ఇంగ్లండ్ పర్యటనను టీమిండియా విజయంతో ముగించింది. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో అసాధారణ ప్రదర్శన కనబర్చిన టీమిండియా 2-2తో సిరీస్‌ను సమం చేసుకుంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్ రిటైర్మెంట్ అనంతరం బరిలోకి దిగిన తొలి సిరీస్‌లోనే టీమిండియా అద్వితీయమైన ప్రదర్శన చేసింది. నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన శకాన్ని ఘనంగా ప్రారంభించాడు. ఈ సిరీస్‌లో టీమిండియా అన్ని విభాగాల్లో రాణించింది. కానీ నెంబర్ 3 స్థానం నుంచి మాత్రం ఆశించిన పరుగులు రాలేదు. ఈ స్థానంలో ఆడించిన కరుణ్ నాయర్, సాయి సుదర్శన్‌లు ఒక్కో హాఫ్ సెంచరీ మాత్రమే నమోదు చేశారు. దాంతో శ్రేయస్ అయ్యర్‌ను ఈ స్థానంలో ఆడించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. కానీ టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మాత్రం అభిమన్యు ఈశ్వరన్‌ను ఈ స్థానంలో ఆడించాలని సూచించాడు. ఇంగ్లండ్ పర్యటనలో అతనికి ఒక్క మ్యాచ్‌లో అవకాశం దక్కలేదు. అంతకుముందు ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో కూడా అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. దాంతో అతను ఇప్పటి వరకు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయలేదు. ఈ క్రమంలోనే మూడో స్థానంలో అభిమన్యు ఈశ్వరన్‌కు ఒక అవకాశం ఇవ్వాలని గంగూలీ సూచించాడు. ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియాకు లోటుగా కనిపించిన స్థానం ఇది మాత్రమేనని చెప్పాడు. 'అభిమన్యు ఈశ్వరన్‌కు ఇంకా చాలా వయసు ఉంది. అతనికి అవకాశం వస్తుందని నేను నమ్ముతున్నాను. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా పరుగులు రాబట్టారు. కానీ నెంబర్ 3 బ్యాటర్ మాత్రం రాణించలేకపోయాడు.

# కెప్టెన్ అంటే శుభ్‌మన్ లా ఉండాలి



గిల్‌పై సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు
టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌పై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ప్రశంసల జల్లు కురిపించాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ పాల్గొననుండటం గొప్ప విషయమని కొనియాడాడు. ఇది భారత క్రికెట్‌కు శుభపరిణామమని చెప్పిన లిటిల్ మాస్టర్.. యువ క్రికెటర్లకు మంచి సంకేతాలను ఇస్తుందని పేర్కొన్నాడు. కెప్టెన్ అంటే ఇలా ఉండాలని శుభ్‌మన్ గిల్ చాటి చెప్పాడని మెచ్చుకున్నాడు.అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు లేనప్పుడు భారత ఆటగాళ్లు దేశవాళీ క్రికెట్ ఆడాటాన్ని బీసీసీఐ తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా 3-1 తేడాతో ఓడిన తర్వాత బీసీసీఐ ఈ నిబంధనను తీసుకొచ్చింది. దాంతోనే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ దాదాపు దశాబ్దం తర్వాత రంజీట్రోఫీ ఆడారు. శుభ్‌మన్ గిల్ కూడా దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యాడు. అతను నార్త్ జోన్ జట్టును నడిపించనున్నాడు.తాజాగా ఈ విషయంపై స్పందించిన గవాస్కర్.. గిల్ నిర్ణయాన్ని ప్రశంసించాడు. 'దులీప్ ట్రోఫీలో శుభ్‌మన్ గిల్ పాల్గొననుండటం మంచి నిర్ణయం. బంగ్లాదేశ్ పర్యటన మరుసటి ఏడాదికి వాయిదా పడింది. అలాగే శ్రీలంకతో కూడా ఎలాంటి సిరీస్ లేదు. ఈ నేపథ్యంలోనే బీసీసీఐ.. దేశవాళీ క్రికెట్‌కు ప్రాధాన్యమిచ్చింది. దాంతో టీమిండియా టాప్ ఆటగాళ్లంతా దులీప్ ట్రోఫీ ఆడనున్నారు. శుభ్‌మన్ గిల్ నార్త్ జోన్‌కు సారథ్యం వహించనున్నాడు. ఈ టోర్నీకి అందుబాటులో ఉండి, ఇతర ఆటగాళ్లకు శుభ్‌మన్ గిల్ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అయితే ఇంగ్లండ్ సిరీస్‌లో పాల్గొన్న టీమిండియా ఫాస్ట్ బౌలర్లు దులీప్ ట్రోఫీకి దూరంగా ఉండటం మంచి నిర్ణయమే.'అని సునీల్ గవాస్కర్ చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో అటు కెప్టెన్‌గా.. ఇటు బ్యాటర్‌గా శుభ్‌మన్ గిల్ సత్తా చాటాడు. 754 పరుగులతో రాణించాడు. ఒక సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 1971లో సునీల్ గవాస్కర్ ఓ సిరీస్‌లో 774 పరుగులు చేసి టాప్‌లో కొనసాగుతున్నాడు.